
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 17.06.2025 | సంపుటి :11 సంచిక : 329 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# రైతుభరోసా నిధులు విడుదల



## ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులు

- పదేళ్లలో బీఆర్ఎస్ వందేళ్ల విధ్వంసం సృష్టించింది
- సరిచేసేందుకు రోజుకు 18గంటలు కష్టపడుతున్నాం
- దేశంలో వరి పండించడంలో అగ్రస్థానంలో తెలంగాణ
- రైతు రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నాం
- గత పాలకులు వరి వేస్తే ఉరే అన్నారు
- ఇప్పుడు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వీధి నాటకాలు
- రైతులను కాదనుకున్న వారు అధికారంలోకి రాలేరు
- సర్పంచ్ లకు గత ప్రభుత్వమే బకాయిపడింది
- రైతునేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా అందిస్తాం
- కాంగ్రెస్‌కు వ్యవసాయానికి విడదీయరాని అనుబంధం
- తొమ్మిది రోజుల్లోనే మొత్తం డబ్బులు జమ చేస్తాం: భట్టి


రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి(జనంసాక్షి):**రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రైతువేదికల్లో 'రైతునేస్తం' కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది రైతులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఆడిటోరియం నుంచి మరో 1034 రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రైతులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు మిగతా 2లో..

## రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు

- కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయండి
- కళాశాలల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు కమిటీ
- ప్రతి నెల వైద్యారోగ్య, విద్యా శాఖలపై సమీక్ష

వైద్యారోగ్య సమీక్షలో సీఎం రేవంత్

వార్త 2లో



## 'జన గణన' ప్రక్రియ షురూ..

- నోటిఫికేషన్ జారీ చేసిన హోంశాఖ
- మొత్తంగా రెండు దశల్లో లెక్కింపు
- 2027 మార్చి 1వ నాటికి పూర్తి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలో 15 ఏళ్ల తర్వాత చేపట్టబోయే జన గణనకు సంబంధించిన కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కింపు ప్రక్రియ నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైనట్లయ్యింది. మొత్తంగా రెండు దశల్లో జనాభాను లెక్కించనున్నారు. 2027 మార్చి 1వ తేదీ నాటికి జనగణన పూర్తి కానుంది.మంచు ఎక్కువగా ఉండే 'కేంద్రపాలిత ప్రాంతాలు జ


ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యేందుకు వెళ్తూ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

## అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పండి

### ఏసీబీని ప్రశ్నించిన కేటీఆర్

- అక్రమ కేసులతో భయపెట్టినా ప్రశ్నించడం ఆపబోం
- ఎన్నిసార్లైనా విచారణకు వస్తా
- జైలు.. కేసులు మాకు కొత్తకాదు..
- ముఖ్యమంత్రి రేవంత్‌కు దమ్ముంటే లైవ్‌డిటెక్టర్‌కు సిద్ధమా..?
- ప్రజలే ఆయనకు గుణపాఠం చెప్తారు
- ఏసీబీ విచారణ అనంతరం మీడియాతో కేటీఆర్

**హైదరాబాద్ (జనంసాక్షి):**ఫార్ములా ఈ కారు రేసులో అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పాలని ఏసీబీ అధికారులను కేటీఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యల కంటే.. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడంలో శ్రద్ధ చూపిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి మీకు మిగతా 2లో..

## గోదావరి - బనకచర్లపై హరీశ్ వ్యాఖ్యలు తెలంగాణకు నష్టం

కృష్ణా జలాల్లో మనకు దక్కాల్సిన వాటాను పొందడంలో నాటి భారాస ప్రభుత్వం విఫలమైంది: మంత్రి ఉత్తమ్ 2లో



## ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్

భారాస నేతను 8 గంటలపాటు ప్రశ్నించిన అధికారులు 2లో

## తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ ఏమైనా చేస్తారు

ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి

# ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర

- నెతన్యాహూ సంచలన వ్యాఖ్యలు
- ఇరాన్ దాడుల్లో ధ్వంసమైన యూఎస్ ఎంబసీ
- టెలిఅవివ్ యూస్ కార్యాలయం మూసివేత





**జెరూసలెం(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఇరాన్ చంపాలని చూస్తున్నదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్ టార్గెట్ ట్రంపేనని, ఆ దేశానికి ప్రథమ శత్రువు అమెరికా అధ్యక్షుడేనని చెప్పారు. అణు ఒప్పందాన్ని రద్దు చేసినందుకే ట్రంప్‌ను లేకుండా చేయాలని ఇరాన్ భావిస్తున్నదని ఆరోపించారు. 2024లో రెండుసార్లు ఆయనను అంతమొందించడానికి ఇరాన్ ప్రయత్నించిందన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ పరస్పర దాడుల నేపథ్యంలో నెతన్యాహూ మాట్లాడుతూ.. ట్రంప్‌ను చంపాలని ఇరాన్ చూస్తున్నది. ఆయనే ఇరాన్‌కు నంబర్‌వన్ శత్రువు. ట్రంప్ నిర్ణయాత్మక నాయకుడు. బలహీనమైన రీతిలో బేరసారాలు చేయడానికి ఆయన ఎప్పుడూ ఇష్టపడరు. ప్రత్యర్థికి లొంగిపోరు. గతంలో జరిగిన నకిలీ అణుఒప్పందాన్ని రద్దు చేసి.. ఖాసిమ్ సులేమానీని మిగతా 2లో..

## మాపై అణుదాడికి దిగితే.. పాక్ ప్రతిదాడి చేస్తుంది

ఇరాన్ అధికారి మొహసిన్ రెజాయి వ్యాఖ్యలు

ఖండించిన దాయాది దేశం 2లో

## ఖమేనీ హత్యకు యత్నాలు

బంకర్‌కు తరలించిన ఇరాన్ అధికారులు

## ప్రధాని మోడీకి సైప్రస్ అత్యుత్తమ పురస్కారం

'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3' అవార్డు ప్రదానం

ఇది యుద్ధాల శకం కాదు : మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సైప్రస్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3ను ప్రధానం చేశారు. ప్రధాని ఈ గౌరవాన్ని స్వీకరిస్తూ ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారం అందుకున్నారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ తొలి అధ్యక్షుడు మకరియోస్ 3 పేరుతో ఈ అత్యున్నత పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. సైప్రస్ ప్రభుత్వ అవార్డు 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల



సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక అని చెప్పారు. రెండు దేశాల మధ్య క్రియాశీల మిగతా 2లో..

## కాళేశ్వరం ఇక నిరూపయోగం

- ఇది ఎంతమాత్రం ఇది పనికొచ్చే ప్రాజెక్ట్ కాదు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక కూడా ఇదే తెలిపింది
- గతంలోనే దీనిపై బీజేపీ స్పష్టత ఇచ్చింది
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణలోని పాలక పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మేరకు నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సీబీఐ విచారణపై మొహం మార్చుకుందని వ్యాఖ్యానించారు. అలాగే బీసీ గణనపై మిగతా 9లో..



## కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్(జనంసాక్షి):** భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది .కమలాపురం మండలం వంగపల్లిలో గ్రానైట్ వ్యాపారి మనోజ్ క్వారీ నిర్వహిస్తున్నారు. రూ.50 లక్షలు ఇవ్వాలంటూ తమను కౌశిక్‌రెడ్డి బెదిరించారంటూ మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు చేశారు. దీంతో సుబేదారి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలన్న పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది.



## గర్జించిన గిరిపుత్రులు

- అటవీశాఖ అధికారులపై తిరగబడ్డ ఆదివాసీలు
- ఫారెస్ట్‌లో గుడిసెలను ఖాళీ చేపించే క్రమంలో ఘర్షణ
- రొయ్యూరు అటవీ సమీపంలో ఉద్రిక్తత వాతావరణం

**ఏటూరునాగారం(జనంసాక్షి):**ఏటురునాగారం ఏజెన్సీ ప్రాంతంలోని రిజర్వ్ ఫారెస్ట్ లోని అటవీ ప్రాంతంలో వేసిన గుడిసెలు తొలగించేందుకు వెళ్లిన అటవీ శాఖ అధికారులపై గిరిజనులు తిరగబడ్డ ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గత సంవత్సర కాలం గా నార్త్ రేంజ్ అటవీ శాఖ పరిధి లోని రొయ్యూర్ బీట్, రోయ్యూర్ సెక్షన్ లోని రిజర్వ్ ఫారెస్ట్ లోని అటవీ ప్రాంతంలో గిరిజనులు అక్రమంగా గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. అయితే పలు మార్లు అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు చేసి గుడిసెలను తొలగించిన తిరిగి గుడిసెలు నిర్మిస్తూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలోనే గుడిసెలను తొలగించే ప్రయత్నంలో అటవీ శాఖ అధికారులపై మిగతా 2లో..

## జీహెచ్‌ఎంసీ కాదు.. బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేయండి

కిషన్ రెడ్డిని నిలదీయండి • బిజెపి కార్పోరేటర్ల ధర్నాపై మంత్రి పొన్నం ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):** బిజెపి కార్పోరేటర్లు సమస్య పరిష్కారం కోసం వెళ్లి బిజెపి కార్యాలయం వద్ద ధర్నా చేయాలని హైదరాబాద్ లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు నిర్వహించిన ధర్నాపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. నిధులను కూడా కిషన్ రెడ్డి వద్ద నిలదీయాలని అన్నారు. జీహెచ్‌ఎంసీ అభివృద్ధిపై బీజేపీ చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. ఈ విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ధర్నా చేయాల్సింది జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు కాదు.. హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని మండిపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తెచ్చేందుకు ప్రయత్నించకుండా బీజేపీ నాయకులు రాజకీయ స్టంట్లు వేయడం సరికాదని విమర్శించారు. నగర అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా కేంద్ర ప్రభుత్వం మారిందని, దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వైఫల్యమే కారణమని తెలిపారు. జీహెచ్‌ఎంసీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటోం



దని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఈ విధమైన రాజకీయాలు చేయడం కన్నా, కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తే మేము కూడా వస్తాం అని మంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ అభివృద్ధికి అందరం కలిసి నిధులు తీసుకురావాలన్న మంత్రి, ఈ విషయాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు. నగర అభివృద్ధి మా బాధ్యత. రాజకీయాలు దానికి అడ్డుకావద్దు అని హెచ్చరించారు. మొత్తంగా కేంద్రం నుండి నిధులు తీసుకురావడానికి బీజేపీ నాయకులు తమ సొంత నేత కిషన్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## హరీశ్ రావుకు అస్వస్థత

ఆసుపత్రిలో చేరిక

**హైదరాబాద్(జనంసాక్షి):**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో సికింద్రాబాద్ సన్ సైన్ ఆసుపత్రిలో చేరారు. సోమవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో స్వల్ప అస్వస్థతకు హరీశ్‌రావు గురయ్యారు. అక్కడే బీపీ పరీక్షించుకున్నారు. అనంతరం సికింద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చేరారు.



## యూపీ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

ఐదుగురు మృతి.. పలువురికి గాయాలు

**లక్నో(జనంసాక్షి):**ఉత్తర ప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది మంది మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరందరినీ హుటాహుటీన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు భారీగా చేరుకున్నారు. చనిపోయినవారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ ఘటన పై రాజబ్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ, 'ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు అటార్సిలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళా కార్మికులు మరణించారు. తొమ్మిదిమంది గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాం. మృతదేహాలకు మిగతా 2లో..

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాలు విడుదల


2లో

### గోదావరి - బనకచర్లపై హరీశ్ వ్యాఖ్యలు
# తెలంగాణకు నష్టం

**కృష్ణా జలాల్లో మనకు దక్కాల్సిన వాటాను పొందడంలో నాటి భారాస ప్రభుత్వం విఫలమైంది: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి): గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యల వల్ల తెలంగాణకు నష్టమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆల్ వాటర్స్ అనే పదం కింద ఏపీ 200 టీఎంసీలు తీసుకోగలదనే హరీశ్‌రావు వాదన తప్పని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " వరద నీటిని తీసుకోవడానికి ఏపీకి అనుమతి లేదు. చట్టబద్ధం కాదు. లింక్ ప్రాజెక్ట్‌లో పేర్కొన్న 200 టీఎంసీలు బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన నీటిలో భాగం కాదు. గోదావరిలో వరద నీటిని అధికారికంగా నిర్వచించలేదు. లెక్కించలేదు. బచావత్ ట్రైబ్యునల్ గతంలో ఉమ్మడి ఏపీకి 1,480 టీఎంసీలు కేటాయించింది. గోదావరి జలాల్లో తెలంగాణకు 970 టీఎంసీలు ఉన్నాయి. గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టు అన్నింటికీ విరుద్ధం. కృష్ణా జలాల్లో మనకు దక్కాల్సిన వాటాను పొందడంలో భారాస విఫలమైంది." అని ఉత్తమ్ తెలిపారు.

# ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర

మట్టుబెట్టారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉండకూడదని చాలా స్పష్టంగా చెప్పారు. అంటే వారు యురేనియంను శుద్ధి చేయకూడదు. ఈ నేపథ్యంలో ట్రంప్ కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ ప్రధాన శత్రువుగా మారారు. అందుకే ఆయనను చంపాలని చూస్తున్నదని చెప్పారు. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనే ఉద్దేశంతోనే ఇరాన్ అణు కార్యక్రమాలు చేపడుతున్నదని నెతన్యాహూ అన్నారు. తమ దాడులు ఇరాన్ అణు కార్యక్రమాన్ని చాలావరకు వెనక్కి నెట్టాయని చెప్పారు. ప్రపంచ దేశాలన్నింటికీ ఇరాన్ పెనుముప్పుగా మారుతున్నదని వెల్లడించారు. అందుకే, దాడులు చేయడం తప్ప తమకు మరో అవకాశం లేకుండా పోయిందని తెలిపారు.

**ఇరాన్ దాడుల్లో ధ్వంసమైన యూఎస్ ఎంబసీ**

ఇరాన్ ఆదివారంనాడు జరిపిన క్షిపణి దాడుల్లో టెల్ అవివ్ లోని అమెరికా రాయబార కార్యాలయం భవంతి దెబ్బతినడంతో తాత్కాలికంగా మూసివేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారి మైక్ మకబి సోమవారంనాడు ధ్రువీకరించారు. ఈ దాడిలో యూఎస్ దౌత్య సిబ్బంది మృతి చెందడం కానీ, గాయపడటం కానీ జరగలేదు. అయితే, పేలుడు ధాటికి యూఎస్ ఎంబసీ భవంతి దెబ్బతినట్టు సోషల్ వీడియోలో పోస్ట్ చేసిన వీడియోల్లో కనిపిస్తోంది. ఎంబసీ బ్రాంచ్ సమీపంలో ఇరాన్ క్షిపణి దాడితో స్వల్పమైన డ్యామేజ్ జరిగిందని, సిబ్బందికి అసౌకర్యం కలుగకుండా సోమవారంనాడు కార్యాలయానికి మూసివేశామని మకబి తెలిపారు. కాగా, భవంతి సమీపంలో క్షిపణి దాడితో యూఎస్ కార్యాలయ భవంతి విండో గ్లాసులు దెబ్బతిన్నాయి. ఎమ్జర్గ÷న్సీ ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఎంబసీ సిబ్బందిని సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు కోరారు.

## మాపై అణుదాడికి దిగితే.. పాక్ ప్రతిదాడి చేస్తుంది



**టెహ్రాన్(జనంసాక్షి):** ఇజ్రాయెల్ తమపై అణు బాంబును ప్రయోగిస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగి దానిపై న్యూక్లియర్ అటాక్ చేస్తుందని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ జనరల్ మొహసిన్ రెజాయి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ప్రభుత్వం అధీనంలోని టెలివిజన్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. "ఇజ్రాయెల్ మాపై అణు దాడి చేస్తే.. ఇస్లామాబాద్ కూడా టెల్‌అవీవ్‌పై అణుబాంబును ప్రయోగిస్తుందని పాక్ నుంచి హామీ లభించింది" అని మొహసిన్ వెల్లడించారు. ఆయన ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో సభ్యుడు కూడా. అంతేకాదు.. తుర్కియే, సౌదీ, పాకిస్థాన్ ఇతర దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటుచేయాలని మొహసిన్ అన్నారు. కానీ, ఆయా దేశాలు ఇరాన్ యూనిఫామ్ వేసుకోవడానికి సిద్ధంగా లేవన్నారు. వీటిల్లో ఒక్క దేశమైనా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే రాత్రికి రాత్రే ప్రాంతీయ బలాబలాలు మారిపోతాయన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అణ్వాయుధాలున్న దేశాల్లో ఇజ్రాయెల్, పాకిస్థాన్ స్థానం దక్కించుకొన్నాయి. ఈ జాబితాలో అమెరికా, రష్యా, ఫ్రాన్స్, భారత్, ఉత్తర కొరియా కూడా ఉన్నాయి.

## ఖమేనీ హత్యకు యత్నాలు

**బంకర్‌కు తరలించిన ఇరాన్ అధికారులు**

టెహ్రాన్,జూన్16(జనంసాక్షి): ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మరింత ముదురుతున్నది. క్షిపణులు, డ్రోన్లతో ఇరు దేశాలు దాడులు ప్రతిదాడులకు పాల్పడుతున్నాయి. ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. దీంతో టెహ్రాన్ సైన్యానికి చెందిన అత్యున్నత అధికారుల తోపాటు పదుల సంఖ్యలో అణు శాస్త్రవేత్తలు మృతిచెందారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని కూడా లక్ష్యంగా చేసుకొని ఐడీఎఫ్ దళాలు దాడులు చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత వారు ఈశాన్య టెహ్రాన్‌లోని అండర్‌గ్రౌండ్ బంకర్‌లో తలదాచుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. ఇక ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ కూడా అదేరీతిలో ప్రతిస్పదిస్తున్నది. ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తున్నది. ఈ బాలిస్టిక్ క్షిపణుల దాడిని ఇజ్రాయెల్ గొప్పగా చెప్పుకునే ఐరన్ డోమ్ కూడా అడ్డుకోలేకపోయింది. శత్రుదుర్భేధ్య రక్షణ వ్యవస్థగా చెప్పుకునే దానిని ఇరాన్ క్షిపణులు చీల్చుకుంటూ వెళ్లి ఇజ్రాయెల్ భూభాగంలో పడుతున్నాయి. దీంతో ప్రధాన నగరాలైన టెల్ అవీవ్, జెరూసలెంలో భారీ నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఇరాన్ క్షిపణి దాడులతో జెరూసలెంలో సైరెన్ మోతలు వినిపించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. అదేవిధంగా జెరూసలెం, టెల్ అవీవ్ మీదుగా క్షిపణులు దూసుకొచ్చాయని వెల్లడించింది. వాటిలో కొన్ని క్షిపణులను మధ్యలోనే తాము కూల్చివేశామని పేర్కొంది. సౌత్‌వెస్ట్ రీజియన్‌లో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను యాక్టివేట్ చేశామని ప్రకటించింది. అయితే హైఫా పట్టణంలో భారీగా మంటలు ఎగసిపడటం కనిపించిందని అంతర్జాతీయ మీడియా ఆర్టీ ఇంర్నేషనల్ వెల్లడించింది. ఈ దాడుల్లో నలుగురు గాయపడ్డారని తెలిపింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నట్టు మీడియా కథనాలు వెలువరించాయి. తమ తదుపరి లక్ష్యంగా ఆయన మారవచ్చునని ఒక సీనియర్ అధికారి వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. ఇరాన్ స్వచ్ఛందంగా తన అణు కార్యక్రమాన్ని తొలగించుకునే వరకు లేదా దానిని ఇరాన్ పునర్‌నిర్మించుకోవడం అసాధ్యంగా మారినప్పుడు మాత్రమే ఈ సంక్షోభానికి తెర పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హత్య చేయాలనే ఇజ్రాయెల్ ప్రణాళికను ట్రంప్ వీటో చేశారని ఇద్దరు అమెరికా అధికారులు తెలిపారు. .

## పొంగులేటిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలపై పొంగులేటి ప్రకటన చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. క్యాబినెట్‌లో చర్చించాల్సిన అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అని సీరియస్ అయ్యారు. పార్టీలో చర్చించకుండా అలాంటి ప్రకటనలు చేయొద్దన్నారు. ఒకరి మంత్రిత్వశాఖ అంశంపై వేరొకరు మాట్లాడటం ఏంటని మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై మంత్రులు మాట్లాడేటప్పుడు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మంత్రులు వారి శాఖల పరిధిలోని అంశాలపైనే మాట్లాడాలని.. సున్నిత, కోర్టు పరిధిలోని అంశాలపై మాట్లాడేప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

# రైతుభరోసా నిధులు విడుదల

ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతువేదికల్లో సీఎం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ప్రత్యక్షప్రసారం చేసింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..బీఆర్ఎస్ చేసిన విధ్వంసం వందేళ్లు కోలుకోలేనిదన్నారు వాళ్లు చేసిన తప్పులు సరి చేయడానికి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని చెప్పారు. రైతులను కాదనుకున్న వారు అధికారంలోకి రాలేరని చెప్పారు. రైతుల ఆశీర్వాదం ఉంటేనే పాలకుల కుర్చీలు పదిలంగా ఉంటాయన్నారు. సర్పంచ్ నుంచి సీఎం వరకు ఏ పదవి రావాలన్నా రైతులకు అండగా నిలవాల్సిందేనని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులని అన్నారు. 18 నెలలుగా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వీధి నాటకాలు ఆడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్టాన్ని అప్పుల కుప్పగా మార్చింది. బీఆర్ఎస్ చేసిన విధ్వంసం వందేల్లు కోలుకోలేనిది. రైతు రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నాం. గత పాలకులు వరి వేస్తే ఉరి అన్నారు. మేం వడ్లు పండించిన రైతులకు 500 బోనస్ ఇస్తున్నాం. రైతును రాజును చేయడమే కాదు..వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తున్నాం. మద్దతు ధరతో ధాన్యం కొంటున్నాం. సన్న వడ్లతో పేదల కడుపు నింపుతున్నాం. దేశంలో వరి పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. సర్పంచ్ లకు గత ప్రభుత్వమే బకాయి పడింది. గత ప్రభుత్వ బకాయిలు చెల్లిస్తున్నాం . రైతుల కోసం ఇప్పటి వరకు లక్ష కోట్లు ఖర్చు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రైతు భరోసా,రుణమాఫీ, రైతుల సమస్యలు,సన్నవడ్ల బోనస్ పై రైతులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా సన్న బియ్యం,రైతు భరోసా,బోనస్ పై ఆనందం వ్యక్తం చేశారు. ఇవాళే రైతు భరోసా నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎకరాల వారీగా కాకుండా అర్హులైన వారందరికీ ఒకేసారి రైతుభరోసా ఇస్తామన్నారు. ' 1 కోటి 49 లక్షల 35 వేల ఎకరాలకు రైతు భరోసా నిధులు వేస్తాం. పరిమితి లేకుండా అర్హులైన ప్రతిరైతుకు రైతుభరోసా ఇస్తున్నాం. ఎన్నికరాలు ఉన్నా అన్ని భూములకు సాయం అందజేస్తాం. 9 రోజుల్లోనే అందరికీ రైతుభరోసా పూర్తి చేస్తాం' అని భట్టి తెలిపారు. కాంగ్రెస్ కు వ్యవసాయానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నాను. హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని అగ్రి వర్శిటీలో రైతు నేస్తం ప్రారంభం సందర్బంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే రుణమాఫీ,మద్దతు ధర, బోనస్,. కాంగ్రెస్ అంటేనే ఉచిత కరెంట్. కాంగ్రెస్ కు రైతులకు విడదీయరాని సంబంధం ఉంది. 1034 వేదికల్లో రైతు నేస్తం ప్రోగ్రాం. రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేశాం. అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ చేశాం. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంట నష్టపోతే రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఐదేళ్లలో రైతుల కోసం మూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేస్తాం. ఆర్థిక పరమైన ఇబ్బందులున్నా ఒక్క పథకాన్ని ఆపలేదు. సీఎం రేవంత్ రైతు భరోసా నిధులు ఇక్కడి నుంచే రిలీజ్ చేస్తారు. ఎన్ని ఎకరాలున్నా వ్యవసాయ యోగ్యమైన భూములకు పూర్తి స్థాయిలో రైతు భరోసా ఇస్తామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. 9 రోజుల్లో ప్రతి రైతులందరి ఖాతాలో డబ్బులు పడతాయని చెప్పారు.

**పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా :భట్టి**



రానున్న తొమ్మిది రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని అన్నదాతల అందరి ఖాతాల్లోకి రైతు భరోసా డబ్బులు మొత్తం జమ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైతు నేస్తం సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీటనొక్కగానే రైతు ఖాతాల్లోకి టింగ్ టింగ్ మంటూ రైతు భరోసా నిధులు జమ అవుతాయని డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలోని సాగు యోగ్యమైన, రైతన్నలు సాగు చేసుకుంటున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్ని ఎకరాలు సాగు చేస్తే ఆ మొత్తం ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ అవుతాయి, ఎలాంటి లిమిట్ లేదు అన్నారు. రాష్ట్రంలో సాగులో ఉన్న 1.49 కోట్ల పైబడి ఎకరాలకు ఎకరాకు 12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతాయి అన్నారు. భూమిలేని నిరుపేదలు వారు వ్యవసాయ కూలీలుగా ఉంటూ రైతుల పక్షాన నిలబడుతున్న పేదలకు కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 12,000 చొప్పున ప్రజా ప్రభుత్వం చెల్లిస్తుంది అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూపాయి, రూపాయి పోగుచేసి రైతులు, రాష్ట్ర ప్రజల పక్షాన సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. రైతుల కోసం ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం 70 వేల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాలలో మొత్తం 3.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇలా ఒకటి తర్వాత ఒకటి సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటూ పోతే ఇక మాకు పుట్టగతులు ఉండవని పదేళ్లు పాలించిన వారు ప్రజా ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం రాష్ట్ర ప్రజలు గుర్తించాలి అన్నారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల కోసం ఈ ప్రభుత్వం నిటారుగా నిలబడింది అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు అరచేతిలో పెట్టుకొని ఆశీర్వదించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు కావాల్సిన సహాయ, సహకారాలు అందిస్తుంటే టిఆర్ఎస్ నేతలు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు.. వారు దయ్యాలు అని ఆ పార్టీ నేతలే చెప్పారు, ఆ దయ్యాలు నేడు వికట్టహాసం చేస్తున్నాయి, దయ్యాలు ఊర్లో ఉంటే అరిష్టం ఆ దయ్యాలను ఊరి పొలిమేరలోకి రానివ్వకుండా తరిమికొట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతులు సుభిక్షంగా ఉండాలి పంటలు పచ్చగా పండాలి రైతన్నలు ఆనందంగా ఉండేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది అని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అన్నారు.రైతులు అంటేనే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేనే రైతులు అని డిప్యూటీ సీఎం తెలిపారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలకు విడదీయరాని అనుబంధం ఉంది అని అన్నారు. ఉచిత కరెంటు, రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, మద్దతు ధరకు తో పాటు సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. ఎవరు ఊహించని విధంగా గత ప్రభుత్వాలు తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి ఆపకుండా రైతు సోదరుల కోసం అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నాం అన్నారు అధికారంలోకి వచ్చిన మూడు నాలుగు నెలల వ్యవధిలోనే రైతు రుణమాఫీ కింద 21 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసాం అన్నారు. ఇంతటి గొప్ప సాహసం భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదు అన్నారు. గత పాలకులు వెళ్లేముందు రైతు భరోసా వదిలేసి వెళ్లిపోతే క్యాబినెట్లో తీర్మానం చేసి రైతు భరోసా కింద 13,088 కోట్లు జమ చేసాం అన్నారు. సన్నధాన్యం సాగుచేసిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ కింద 1,199 కోట్లు విడుదల చేసాం అని తెలిపారు. టిఆర్ఎస్ నేతలు రైతుల భీమా గురించి మర్చిపోయారు, ఆ రాడు రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా పంట నష్టం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన పట్టించుకోలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడైనా పంట నష్టం జరిగితే లెక్క గట్టి రైతుల ఖాతాల్లో జమ చేశారు, కానీ 10 సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ నేతలు ఆలోచన చేయలేదని డిప్యూటీ సీఎం విమర్శించారు.

## రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి... ఎంత మేర నిధులు కావాలి.. తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు... ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో సోమవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, వైద్యారోగ్య శాఖ డైరెక్టరేట్ డాక్టర్ నరేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గర్జించిన గిరిపుత్రులు

గిరిజనులు కారం పొడి చల్లుతూ కర్రలతో దాడులకు దిగారు. ప్రాణ భయంతో అటవీ శాఖ అధికారులు పరుగులు తీశారు. జేసీబీ డ్రైవర్ పై కత్తితో దాడి చేయగా ఆయనకు గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఘర్షణను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై నార్త్ రేంజ్ డిప్యూటీ రేంజ్ అధికారి అప్సర్ ఉన్నిసా ను వివరణ కోరగా అటవీ ప్రాంతంలో గుడిసెలు వేసిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి గుడిసెలు తొలగించే ప్రయత్నం చేశాం. ఈ క్రమంలోనే గుడిసెలు వేసిన గిరిజనులు మాపై కర్రలు, కారం పొడితో దాడికి దిగారు. జేసీబీ డ్రైవర్ రమేష్ కు గాయాల య్యాయి. పోలీసుల సాయంతో అక్కడి నుండి ప్రాణాలతో బయటపడ్డాం అని తెలిపారు.

## 'జనగణన' ప్రక్రియ షురూ..

జన గణన. ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు తెలిపింది.సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని చేపట్టారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలోనే జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్ పెరగడం, కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి చేయడంతో కుల గణనకూ కేంద్రం సిద్ధమైంది. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కి పైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

## తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ ఏమైనా చేస్తారు

**ఫార్ములా ఈ-రేసు కేసులో ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్ కీలకమైన వ్యక్తి : ఎంపీ చామల**



**హైదరాబాద్(జనంసాక్షి):** ఫార్ములా ఈ-రేసు కేసులో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ కీలకమైన వ్యక్తి అని, కానీ ఇప్పుడు ఆయన కనిపించట్లేదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యే ముందు మీడియాతో మాట్లాడుతూ ఎన్నిసార్లయినా జైలు వెళ్లేందుకు సిద్ధమన్నారు. ఆయన వ్యాఖ్యలపై ఎంపీ స్పందించారు. "అరవింద్ కుమార్ ఎక్కడున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి. ఆయన లేరు కాబట్టి ఏమీ కాదని కేటీఆర్ భావిస్తున్నారు. తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ ఏమైనా చేస్తారు. గతంలో కేటీఆర్ మిత్రుడు కేదార్ విదేశాల్లో చనిపోయారు. కేటీఆర్ ప్లాన్‌తోనే ప్రభాకర్‌రావు అమెరికాకు వెళ్లి దాక్కున్నారు"అని ఎంపీ చామల ఆరోపించారు.

# అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పండి



### ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్
**భారాస నేతను 8 గంటలపాటు ప్రశ్నించిన అధికారులు**

**హైదరాబాద్ (జనంసాక్షి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఆయనతోపాటు మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ రామచందర్‌రావు కూడా విచారణకు హాజరయ్యారు. అంతకుముందు నందీనగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫార్ములా వన్ విచారణకు సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తున్నది. ఈ భేటీలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు కూడా పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనాయకులతో భేటీ అయ్యారు. అనంతరం తెలంగాణ భవన నుంచి నుంచి బంజారా హిల్స్‌లోని ఏసీబీ కార్యాలనికి చేరుకున్నారు.

ధైర్యం ఉంటే లైవ్‌డికెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి చెప్పుకోవడానికి చేసిందేమీ లేదని, విచారణలు.. కమిషన్లు అం టూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిప డ్డారు. తమకు చట్టాలు, న్యాయస్థానాలపై గౌర వం ఉందని.. ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వస్తానని చెప్పారు. తెలంగాణ కోసం ఇప్పటికే జైలుకు వెళ్లొచ్చానని, మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చినా భయపడేది తేల్చిచెప్పారు. ఏసీబీ విచారణకు హాజరయ్యేందకు తెలంగాణ భవన్ నుంచి బయల్దేరే ముందు కేటీఆర్ మీడియాతో మాట్లా డారు. 'నిజం నిలకడ మీద తెలుస్తుందని, చట్టాలు, న్యాయస్థానాలపై గౌరవం ఉందని తెలిపారు. కాబట్టే ఏసీబీ విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వస్తామని చెప్పారు. విచారణకు పిలవడం ఇది మూడోసారని.. మూడుసార్లు కాదు.. 30 సార్లు అయినా విచారణకు వస్తానని అన్నారు. మా మీద కేసులు బనాయించి మమ్మల్ని ఇబ్బంది పెట్టి, కమిషన్లు వేసి మమ్మల్ని వేధించినంత మాత్రాన ప్రజల తరఫున ప్రశ్నించకుండా బంద్ చేస్తామనుకుంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకం అజ్ఞానం అవుతుంది తప్పా ఇంకొకటి కానే కాదని ధ్వజమెత్తారు. కేసీఆర్, హరీశ్‌రావును కాళేశ్వరం కమిషన్ల ముందు కూర్చోబెట్టారు. వారిని కమిషన్ ముందు కూర్చోబెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నన్ను మళ్లీ ఏసీబీ విచారణకు పిలిచి రాక్షస ఆనందం పొందుతున్నారని, అవసరమైతే నన్ను అరెస్టు కూడా చేస్తారు కావచ్చు అని అనుమానం వ్యక్తంచేశారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో కూడా జైలుకు వెళ్లొచ్చా... ఫార్ములా ఈ రేసులో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్ చేశామని గుర్తుచేశారు. మీరు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. మీరు ఇచ్చిన 420 హామీలు, దొంగ ఆరు గ్యారెంటీలు, మీరిచ్చిన డిక్లరేషన్లను అమలుచేయాల్సిందేనని డిమాండ్‌చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తోందని స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తోందనిసంకేతాలు వస్తున్నాయని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని అన్నారు. ఏదో ఒక కమిషన్, ఎంక్వయిరీ అంటూ కాలయాపన చేస్తున్నాడు. కాంగ్రెస్, బీజేపీ దొంగనాటకాలు, దొంగ బాగోతం అంతా తెలంగాణ ప్రజలకు అంతా అర్థమయింది. ఒక కేసు కాదు ఇంకా వెయ్యి కేసులు పెట్టినా మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాం. మాలో ఒకరిద్దరినీ జైలులో పెట్టొచ్చు. కానీ లక్షలమంది కేసీఆర్ సైన్యాన్ని టచ్ చేసే ధైర్యం మీకు లేదని కేటీఆర్ అన్నారు.

# మోడీకి సైప్రస్ అత్యుత్తమ పురస్కారం

భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం. అవార్డు ప్రదానానికి సంబంధించిన వీడియోను ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సైప్రస్ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇరుదేశాల మధ్య స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నామని చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్న ప్రధానికి నికోస్ క్రిస్టోడౌలిడెస్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. సైప్రస్ పర్యటన అనంతరం కెనడాకు మోదీ పయనమవుతారు. అక్కడ జరుగనున్న జీ-7 సదస్సులో పాల్గొంటారు. చివరిగా క్రొయేషియాలో అధికారిక పర్యటన జరుపుతారు.

**ఇది యుద్ధాల శకం కాదు:మోదీ**

ఆపరేషన్ సిందూర్ సమయంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి నిరంతరం మద్దతు ఇచ్చినందుకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్‌కు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం వల్ల పశ్చిమాసియాలో తలెత్తుతున్న ఉద్రిక్తతలపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా, యూరప్‌లో కొనసాగుతున్న సంఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందవచ్చని అన్నారు. ఈయూ అధ్యక్షపదవి సైప్రస్‌కు రావడంపై ఆ దేశానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆ దేశ నాయకత్వంలో ఈయూతో భారత్‌కు మరింత మెరుగైన సంబంధాలు ఏర్పడతాయని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశం ఈయూ మద్దతు సాధిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనను ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం లిఖించేందుకు సువర్ణావకాశంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. సైప్రస్‌కు భారత్ అత్యంత విశ్వసనీయ దేశమని అన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై పరస్పర విశ్వాసం ఇరుదేశాల సంబంధాలకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. సైప్రస్ ప్రభుత్వంతో రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలలో సహకారం గురించి చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇరుదేశాలమధ్య సాంస్కృతిక సంబంధాలను ఎలా బలోపేతం చేయాలనే విషయాలపైనా తాము మాట్లాడుకున్నామన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను అధికారులు సోమవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో ఫస్టియర్ 67.4శాతం, సెకండియర్‌లో 50.82శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఫస్టియర్‌లో బాలికలు 73.88శాతం, బాలురు 61.75శాతం మంది పాసయ్యారు. ఇక సెకండియర్‌లో బాలికలు 54.47శాతం, బాలురు 48.54శాతం మంది పాసయ్యారు. మే 22 నుంచి 29 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలను నిర్వహించగా, 4,13,880 మంది మంది పరీక్షలు రాశారు. ఈ సారి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణత పెరిగింది. ఫస్టియర్, సెకండియర్ రెండింటిలోనూ ఉత్తీర్ణత శాతం పెరగడం గమనార్హం. ఈ సారి ఫస్టియర్లో 67.4శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. 2024లో 63.86శాతం, 2023లో 62.58శాతం విద్యార్థులు పాసయ్యారు. సెకండియర్‌లో ఈ సారి 50.82 శాతం పాసైతే.. 2024లో 43.77 శాతం, 2023లో 46.06 శాతం పాసయ్యారు. కోర్సుల వారిగా ఉత్తీర్ణత వివరాలను పరిశీలిస్తే ఎంపీసీలోనే అత్యధికులు పాసయ్యారు. ఎంపీసీ కోర్సులో ఫస్టియర్‌లో 78.26, సెకండియర్‌లో 59.06శాతం ఉత్తీర్ణులయ్యారు.

# అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తాం



**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**

**వరంగల్ ప్రతినిధి, జూన్ 16 (జనం సాక్షి):** అధికారులందరి సమష్టి కృషితో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సక్షేమ ఫలాలు అందించడంలో జిల్లాను ముందు వరసలో ఉంచుదామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. సోమవారం మాటికి వరంగల్ జిల్లా కలెక్టర్ గా డాక్టర్ సత్య శారద బాధ్యతలు చేపట్టి సోమవారానికి విజయవంతంగా సంవత్సర కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు జిల్లా అధికారులు, కలెక్టరేట్, వివిధ శాఖల ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో అధికారుల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను సాధించి జిల్లాను ముందు ఉంచడంలో కృషి చేశామన్నారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే, నేషనల్ హైవే, విమానాశ్రయం, నర్సంపేట జిల్లా ఆసుపత్రి తరతర ప్రతిష్టాత్మక కార్యక్రమాలను శ్రీకారం చుట్టి సునాయాసంగా తుది దశకు తీసుకురావడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో అధికారులు పని చేయాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ కలెక్టర్ డాక్టర్ సత్య శారద తన మెలకువలు, త్రికరణ శుద్ధి, ఏకాగ్రత, ప్రతి పనిలోనూ నిర్దిష్టంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడంలో కలెక్టర్ కనబడిచిన ప్రతిభ కారణంగానే జిల్లా అభివృద్ధి పథంలో వెళుతున్నదని అన్నారు. డిఆర్ఓ విజయలక్ష్మి టీజీవో ప్రెసిడెంట్ జెడ్పి సీఈఓ రాంరెడ్డి, జనరల్ సెక్రెటరీ ఫణి కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్, డిఏఓ అనురాధ వైస్ ప్రెసిడెంట్ డి సి ఓ నీరజ, డి ఆర్ డి ఓ కౌసల్యా దేవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు కలెక్టర్ కు అభినందలు తెలిపారు.

# వ్యాయామం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం

- దశల వారీగా ప్రతి పేదవాడికి ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత మాది
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో,జూన్16(జనం సాక్షి):** క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు, ఆందోళనలను నివారించవచ్చనీ రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని తోపు కుంట లో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ సెంటర్ ను రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లా కేంద్రం లో రెండు ఓపెన్ జిమ్ సెంటర్లు లు ఉన్నాయని జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని,ఆత్మగౌరవాన్ని మెరుగుపరుస్తుందని,వ్యాయామం అధిక బరువు పెరగకుండా నిరోధించడంలో, బరువు తగ్గకుండా ఉండటానికి సహాయపడుతుందని అన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొంది డబ్బు సంపాదించడమే ముఖ్యం కాదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ప్రతి మండలంలో ఒక జిమ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా లో ఇళ్లు లేని నిరుపేదలకు మొదటి విడత గా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందచేయడం జరిగినదని అన్నారు. ఇళ్ళు లేని నిరుపేదలు ఆందోళన చెందవద్దనీ స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవారికి సొంత ఇంటి నిర్మాణం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని, రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల మంజూరు నిర్మాణాలు కొనసాగుతున్నాయని, దశలవారీగా ప్రతి ఒక్కరికి సొంత ఇంటిని నిర్మించి ఇవ్వడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంక్షేమ పథకాలు సన్న బియ్యం, రైతు బంధు, రైతు భరోసా, బోనస్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, తదితర పేదల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో తెలంగాణ వాసులకు అండగా నిలువాలి

**అమెరికా న్యాయ నిపుణులకు చిన్నారెడ్డి సూచన**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అమెరికాలో ఇబ్బందులు ఎదురుకుంటున్న తెలంగాణ విద్యార్థులు, ఎన్.ఆర్.ఐ.లకు న్యాయపరంగా అండగా ఉండాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అమెరికా న్యాయ నిపుణుల బృందానికి సూచించారు. సోమవారం ప్రజా భవన్‌లో టీపీసీసీ ప్రవాసి విభాగం కన్వీనర్ బొజ్జ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా న్యాయ శాఖ ఆటార్నీలు జోషువా డాల్రైంపుల్, యహ్యా తాబిట్, సోమిరెడ్డి సంతోష్ రెడ్డి, విజయ్ ఎల్లారెడ్డిగారితో కూడిన న్యాయ నిపుణుల బృందం చిన్నారెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో నివాసం ఉంటున్న వారితోపాటు ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లిన విద్యార్థులు కూడా తీవ్ర భయాందోళనలతో ఉన్నారని అన్నారు. వారికి ఇమ్మిగ్రేషన్, వీసాలు, ఉద్యోగ అభద్రత, కార్పొరేట్ లీగల్ సపోర్ట్ అందించాలని చిన్నారెడ్డి అమెరికా న్యాయ నిపుణులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో న్యాయ సేవలు అందించే అమెరికా సంస్థ తెలంగాణలో తమ సేవలను ప్రారంభించడం రాష్ట్ర వాసులకు భరోసానిస్తుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రవాస భారతీయుల వీసా సమస్యలపై, అమెరికాలో వ్యాపారం చేయదలచిన సంస్థలకు న్యాయ సహాయం, లిటిగేషన్ సేవలు, విద్యార్థులకు యూఎస్ శిక్షణ అవకాశాలు – ఇవన్నీ హైదరాబాద్ నుంచే నిర్వహించేందుకు సోమిరెడ్డి లా గ్రూప్ సీఈవో సంతోష్ రెడ్డి ముందుకు రావడం హర్షణీయమని చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణను గ్లోబల్ లీగల్, టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది ఒక గొప్ప అడుగు అని ఆయన అన్నారు. అమెరికాలోని సోమిరెడ్డిలా గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈవో సోమిరెడ్డి సంతోష్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం చిన్నారెడ్డిని కలిసింది.



## ప్రజావాణిలో 185 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 185 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35, రెవెన్యూ శాఖకు సంబంధించి 45, ఇందిరమ్మ ఇండ్ల కోసం 46, విద్యుత్ శాఖకు 24, మున్సిపల్ శాఖకు 11 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 24 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ములుగు జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- లంచం తీసుకుంటూ డీఈఓ పాణిని, సీనియర్ అసిస్టెంట్ రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్




**ములుగు బ్యూరో (జనంసాక్షి) :** ములుగు జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈఓ) కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించి, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను రూ.20,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురంలో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు సిక్ లీవ్ పూర్తి చేసుకుని మళ్లీ పోస్టింగ్ కోసం జాయినింగ్ ఆర్డర్ కోరగా, ఈ అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధిత ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రహస్యంగా ఆపరేషన్ చేపట్టి, డీఈఓ పాణిని, సీనియర్ అసిస్టెంట్‌ను లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌ను ములుగు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో నిర్వహించారు. ప్రస్తుతం ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన జిల్లా విద్యాశాఖలో కలకలం రేపింది. లంచం వ్యవహారాలు వెలుగులోకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ అధికారులు ఈ కేసుపై మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

# కన్నడనాట వరుస ఎటిఎంల చోరీ

- ఎటిఎంలు పగులగొట్టి నగదు దోపిడీ

**బెంగళూరు, జూన్ 16 (జనంసాక్షి) :** కర్ణాటక రాష్ట్రంలో వరుసగా ఏటీఎమ్ సెంటర్లలో చోరీలు జరుగుతున్నాయి. దొంగలు ఏటీఎమ్‌లను బద్దలు కొట్టి డబ్బులు దోచుకెళ్లిపోతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎమ్‌లను టార్గెట్ చేసి మరీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా, కోలార్‌లోని ఓ ఎస్‌బీఐ సెంటర్‌లో దొంగతనం జరిగింది. దొంగలు ఏటీఎమ్‌ను బద్దలు కొట్టి డబ్బులు దోచుకెళ్లిపోయారు. దొంగతనం జరిగిన సమయంలో ఏటీఎమ్‌లో 27 లక్షల రూపాయలు ఉన్నట్లు తెలుస్తోంది. గాల్పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేపట్టారు. నెల రోజుల క్రితం కలబురిగిలోని రామనగర్ ఎస్‌బీఐ సెంటర్‌లో దొంగతనం జరిగింది. దొంగలు పక్కా ప్లాన్‌తో ఏటీఎమ్‌లోని డబ్బుల్ని దోచుకెళ్లిపోయారు. ఏటీఎమ్‌లో డబ్బులు నింపిన మరుసటి రోజు రాత్రి చోరీకి పాల్పడ్డారు. దొంగలు మొదటగా సీసీటీవీ కెమెరాలను పని చేయకుండా చేశారు. తర్వాత గ్యాస్ కట్టర్‌కు పని చెప్పారు. ఏటీఎమ్‌ను గ్యాస్ కట్టర్ సాయంతో కోసి అందులోని డబ్బుల్ని దోచేశారు. దొంగతనం జరిగిన సమయంలో ఏటీఎమ్‌లో 18 లక్షల రూపాయలు ఉన్నాయి. గత కొన్ని నెలల నుంచి జరుగుతున్న ఏటీఎమ్ సెంటర్ల లూటీని పరిశీలిస్తే.. దొంగలు సెక్యూరిటీ లేని ఏటీఎమ్ సెంటర్లను టార్గెట్ చేస్తున్నారు. అర్థరాత్రి తర్వాత వచ్చి దొంగతనాలు చేస్తున్నారు. పోలీసులకు దొరకకుండా ఉండటానికి సీసీటీవీ కెమెరాల్ని బ్లాక్ చేస్తున్నారు. ఏటీఎమ్ దొంగల్ని పట్టుకోవటం పోలీసులకు సవాలుగా మారింది. ఇది వరకు మంగళూరు, బీదర్‌లలోని ఏటీఎమ్ సెంటర్లలో కూడా దొంగతనాలు జరిగాయి. పోలీసులు ఇంకా ఆ దొంగల కోసం వెతుకుతున్నారు.

# సౌదీలో డ్రైవర్‌కు బదులు వ్యవసాయ పనులు

- సౌదీ నుంచి వాపస్ తెప్పించాలని ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించిన బాధితుడి భార్య




**హైదరాబాద్ (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన వ్యక్తి ఇంటి డ్రైవర్ పని కోసం సౌదీకి వెళ్ళగా అక్కడి యజమాని వ్యవసాయ కూలీపని చేయిస్తున్నందున ఆరోగ్యం క్షీనించిన సంఘటన జరిగింది. ముంబయికి చెందిన ఒక ఎజెంటు తన భర్త గుడిసె యాకూబ్ ను డ్రైవర్ పని అని చెప్పి సౌదీ లోని దమ్మాం కు పంపించాడని, యజమాని వ్యవసాయ పనులు చేయిస్తున్నాడని అతని భార్య గుడిసె అలేఖ్య శుక్రవారం హైదరాబాద్, ప్రజాభవన్ లోని ప్రవాసీ ప్రజావాణిలో సీఎం ఏ. రేవంత్ రెడ్డి పేరిట ఒక వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి లకు ఆమె తన గోడు వెళ్ళబోసుకున్నది. యాకూబ్ ను ఎక్కువ గంటలు పని చేయిస్తున్నారని, సరైన భోజన, వసతి సౌకర్యం కల్పించడం లేదని ఆమె వివరించారు. హామీ ఇచ్చిన ప్రకారం హౌజ్ డ్రైవర్ పని ఇవ్వాలని, వీలు కాకుంటే ఇండియాకు వాపస్ తెప్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు

# రైలు కిందపడి ప్రేమ జంట ఆత్మహత్య



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 16 (జనంసాక్షి) :** పెద్దలు ఒప్పుకుంటారో లేదో అనే భయంతో ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నమిలి గొండ గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలప్రకారం నమిలిగొండ గ్రామానికి చెంది న మచ్చ శృతి (23), కోటె వినయ్ కుమార్ (25)ఇద్దరు గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఈ మధ్యనే వారి ప్రేమ విషయం పెద్దలకు తెలిసింది. తమ పెండ్లిని పెద్దలు అంగీకరిస్తారో లేదో అనే భయంతో ఆదివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లారని, తమ ప్రేమ ను కాదంటే విడిపోయి బతకలేమనే నిర్ణయించుకున్న వారిద్దరూ యాదాద్రి జిల్లా భువనగిరి శివారులో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు.

# దాడి చేసి కొట్టిన కేసులో ముగ్గురి అరెస్ట్

**చెన్నారావుపేట, జూన్ 16 (జనం సాక్షి):** భూమి విషయంలో గొడవపడి దాడి చేసి కొట్టిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వట్టె సంపత్ రెడ్డికి పెండ్లి కొమురయ్యకు భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మే 17న భూమి విషయంలో పెండ్లి కొమరయ్య అతని ఇద్దరు కుమారులు సుధాకర్, ప్రభాకర్ లు ముగ్గురు కలిసి వట్టె సంపత్ రెడ్డి, అతని కుమారుడు మధుకర్ రెడ్డి లతో గొడవ పడి దాడి చేసి కొట్టారు. దీంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు వట్టె సంపత్ రెడ్డి ఫిర్యాదు మేరకు పెండ్లి కొమురయ్య, అతని ఇద్దరు కుమారులు సుధాకర్, ప్రభాకర్ లను ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు.

# రాజోలి నూతన ఎస్ఐగా గోకారి

**రాజోలి, జూన్ 16 (జనంసాక్షి) :** రాజోలి మండల నూతన ఎస్ఐగా కె.గోకారిని నియమిస్తూ మహబూబ్‌నగర్ డీఐజీ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఎస్ఐ జగదీశ్వర్ ఇథనాల్ ఫ్యాక్టరి విషయంలో, సివిల్ పంచాయతీలు, దళితులపై దాడిలో అత్యుత్సాహం ప్రదర్శించి ఆరోపణలు రావడంతో విఆర్‌ఓ అటాచ్ చేసిన విషయం తెలిసిందే. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎస్ఐగా ఉత్తర్వులు జారీ చేస్తూ, అక్కడ పనిచేస్తున్న గోకారిని రాజోలి ఎస్ఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఇటిక్యాల ఎస్ఐగా గోకారి పని చేశారు. త్వరలో రాజోలి ఎస్ఐగా గోకారి బాధ్యతలు చేపట్టనున్నారు.

# రైతు రుణమాఫీ చేయడం తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శం

- రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది




**వరంగల్ ప్రతినిధి, జూన్ 16 (జనం సాక్షి):** వ్యవసాయ విధానంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందని పరకాల ఎమ్మెల్యే రేవురీరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా సంఘం మండలం మొండ్రాయి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సంగెం మండలంలోని మొండ్రాయి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో అధికారులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. రైతు వేదిక నుండి వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం ద్వారా ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులతో కలిసి వీక్షించారు. సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ...రైతునేస్తం కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా ముఖాముఖి మరియు ఆదర్శరైతుల అనుభవాలు, వ్యవసాయరంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను రైతులకు తెలియజేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంన్నదని,అధికారంలోకి వచ్చిన ఒకటిన్నర సంవత్సరంలోనే దాదాపు 78వేల కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతాంగం సుభిక్షంగా ఉండేందుకు ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయని పథకాలను ఇప్పటికే అమలు చేసి వివిధ రాష్ట్రాలకు ఒక దశ, దిశ చూపించిందన్నారు. ప్రభుత్వం పంటసాగు చేసే సమయానికి రైతు భరోసా నిధులు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రైతు భరోసా పథకం కింద సంగెం మండలంలోని రైతులకు 15519 మంది రైతులకు 15కోట్ల37 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రైతు బీమా పథకం ద్వారా 69 మంది రైతులకు 3కోట్ల 45 లక్షలు పంపిణీ చేశామన్నారు.అలాగే దేశ చరిత్రలో 2 లక్షల లోపు రుణమాఫీ చేసి చారిత్రక నిర్మాణాన్ని సృష్టించామని అన్నారు. రైతు రుణమాఫీ ద్వారా సంగెం మండలంలోని 5401 మంది లబ్ధిదారులకు 41కోట్ల88 లక్షల రూపాయల రుణమాఫీ జరిగిందన్నారు.సన్న వడ్లకు రూ 500 బోనస్ ద్వారా 1510 మంది రైతులకు 3,19,09, 600రూ,అలాగే సబ్సిడీ ద్వారా 250 క్వింటాన్ల జీలుగా విత్తనాలను పంపిణీ చేశామన్నారు.వ్యవసాయ రైతుల యొక్క ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



# జిల్లా అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కలెక్టరుగా అభిలాష అభినవ్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారుల సమక్షంలో కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలన్నారు. ప్రజలకు ప్రభావవంతమైన సేవలందించడమే మన లక్ష్యంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు పైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇజ్రాయెల్ దాష్టీకాన్ని చోద్యంలా చూస్తున్న ప్రపంచం

ఇజ్రాయెల్ ఇటీవలి కాలంలో తన శత్రు దేశాలైన ఇరాన్, గాజా, లెబనాన్ వంటి దేశాలపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నా, ప్రపంచ దేశాలు మాత్రం చేష్టలుడిగి, నిశ్చేష్టులై చూస్తుండడం ఆందోళనకరం. అమెరికా అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ చర్యలు అంతర్జాతీయ న్యాయానికి పూర్తిగా విరుద్ధం. మానవ హక్కుల ఉల్లంఘనలకు నిలువెత్తు సాక్ష్యం. బాంబు దాడులకు, శిశువులు, మహిళలు, వృద్ధుల హత్యలకు కూడా మానవత్వం చంపుకొని కొందరి మద్దతు దొరుకుతుండటం, ఈ యుద్ధ రాజకీయాల వెనక ఉన్న ద్వంద్వ ధోరణిని బయటపెడుతుంది.

ఇరాన్ అణు శాస్త్రవేత్తల హత్యలు, అణు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొత్తవి కావు. కానీ, ఇటీవలి కాలంలో వాటి తీవ్రత మరింత పెరిగింది. అమెరికా నేరుగా దాడులు చేయకపోయినా, ఆయుధ సరఫరా, నిధుల పంపిణీ, అంతర్జాతీయ ఫోరాల్లో వీటో రక్షణ ద్వారా ఇజ్రాయెల్‌ను బలపరుస్తుంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వంటి సంస్థలు పూర్తిగా రాజకీయ ప్రయోజనాలకు పరితపిస్తూ, ఇజ్రాయెల్‌ను నియంత్రించడంలో విఫలమవుతున్నాయి.

ఇరాన్ పరిస్థితి చూస్తే, ఇది ఒంటరితనంతో బాధపడుతోందని స్పష్టమవుతుంది. చైనా, రష్యా, నార్త్ కొరియా, టర్కీ, పాకిస్తాన్ వంటి దేశాలు పరోక్ష మద్దతు ప్రకటించినా, కార్యాచరణలోకి దిగడం లేదు. వాటికి ఆర్థిక, వ్యాపార ప్రయోజనాలు, అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉండొచ్చు. అరబ్ దేశాల్లోనూ అంతర్ముఖంగా ఇజ్రాయెల్‌తో సంబంధాలు మెరుగుపడుతున్న నేపథ్యం ఉంది. ఐతే, పాలస్తీనా ప్రజల పట్ల ఈ మౌనం మానవతా విలువలకు ద్రోహం చేసినట్లే. గాజా పరిస్థితి అయితే ఘోరం. కొన్ని నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్ దాడుల్లో వేల సంఖ్యలో పసిపిల్లలు, మహిళలు, నిరాయుధ ప్రజలు మృతి చెందారు. విద్యుత్, నీరు, ఆహారం లేని పరిస్థితుల్లో శరణార్థ శిబిరాల్లో ఆకలితో అలమటిస్తున్నారు. ఈ స్థితిని చూసిన ప్రపంచ దేశాలు నిష్క్రియంగా ఉండటం అనేది అంతర్జాతీయ సమాజం నైతికతపై పెద్ద ప్రశ్నను లేవనెత్తుతోంది.

ఈ నేపథ్యంలో, ఇజ్రాయెల్ పై అంతర్జాతీయంగా "యుద్ధ నేరం మోపి" తగిన శిక్షా చర్యలు తీసుకోవటం" అవసరం. యుద్ధ నేరాలకు పాల్పడిన నేతలపై అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారణ జరగాలి. ఐక్యరాజ్యసమితి వహించే పాత్రను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది. అమెరికా వైఖరి గణనీయంగా మారకపోతే, న్యాయం చావుకబురు వింటుంది. ఇరాన్, పాలస్తీనా వలె దేశాలు తమ హక్కులను ప్రపంచ వేదికలపై సమర్థవంతంగా వినిపించేందుకు నూతన వ్యూహాలు తీసుకురావాలి. ఇజ్రాయెల్ ఒక చిన్న దేశమే అయినా, అంతర్జాతీయ రాజకీయంలో దిట్ట. ఆర్థిక శక్తిలో కూడా గట్టి పట్టు ఉన్నదనే వాస్తవాన్ని విస్మరించరాదు. కానీ అది యుద్ధం, నాశనం ద్వారా తమ లక్ష్యాలను సాధించాలని భావిస్తే, అది చరిత్రలోని అత్యంత ప్రమాదకరమైన మార్గంగా నిలుస్తుంది. శాంతి, న్యాయం, సమానత్వం కోసం ప్రపంచ దేశాలంతా కలిసికట్టుగా నిలబడాలి. లేకపోతే, ఇది మానవ సమాజం మౌన సమాధిగా మిగిలిపోతుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## మీదే రాజ్యం!



**నోట్లు పోసి**
**ఓట్లు కొని**
**సీట్లు ఎక్కి**
**పాట్లు పడేది**
**ప్రజల కోసమా?**
**వాళ్ళ రూట్లు -**
**మార్కెట్లు!**
**లాభాలు!**
**దొంగల దోపిడి!**
**దేశాన్ని**
**మార్చాలంటే**
**ప్రజల్ని**
**మార్చండి!**

**మార్చేవాళ్లెవరు?**
**ఎవరైనాసరే!**
**ముందు మీలో**
**ఐక్యతవుందా?**
**చూసుకోండి!**
**ఇదే సమయం!**
**ప్రజలంతా**
**ఈ కులం మతం**
**పార్టీలతోజి**
**విసిగిపోయారు!**

**కమ్యూనిస్టులూజి**
**ముందుకురండి!**
**అంబేడ్కరిస్టులూ**
**ఐక్యమవ్వండి!**
**వచ్చే ఎన్నికల్లో**
**విజయం మీదే!**
**ప్రయత్నించండి!**
**ఇది పేదల పార్టీ**
**లాల్ నీల్ మైత్రి**
**పులకించు ధాత్రి!**
**ఓట్లు మీవే**
**సీట్లు మీవే**
**మీదే రాజ్యం**
**మీరేలండి!**

**-తమ్మినేని అక్కిరాజు**
**హైదరాబాద్**

# నవోదయ సిబ్బందికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి



1986లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశంలో క్రమంగా జిల్లాకు ఒకటి చొప్పున నవోదయ విద్యాలయాలను స్థాపించారు. ప్రస్తుతం దేశంలో 654 విద్యాలయాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, విద్యార్థులలో చిన్నప్పటి నుండే జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించడానికి మైగ్రేషన్ విధానాన్ని అనుసరించడం, రాజ్యాంగం ప్రతిపాదించిన విధంగా త్రిభాషా సూత్రాన్ని పాటించడం, మిగతా విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలవడం అనేవి వీటి ప్రధాన లక్ష్యాలు. సెకండరీ విద్యా రంగంలో నవోదయ విద్యాలయాల స్థాపన ఒక విప్లవాత్మకమైన చర్యగా చెప్పుకొనవచ్చు.

నాలుగు దశాబ్దాలు కావస్తున్న ఈ విద్యాసంస్థల నుంచి వేలాది మంది విద్యార్థులు వివిధ వృత్తి ఉద్యోగాలలో, శాస్త్ర సాంకేతిక రంగాలలో, అన్నింటికీ మించి ఉత్తమ పౌరులుగా రాణిస్తూ సేవలను అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఈ విద్యా సంస్థలు సాధించిన ప్రగతిని గమనించి అచిర కాలంలోనే అటు సమాజంలోనూ దేశంలోనూ ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థలుగా పేరు తెచ్చుకున్నాయి. ఏటా సీబీఎస్ఈ నిర్వహించే వార్షిక పరీక్షల్లోనూ అలాగే నీట్ ,ఐఐటి, సివిల్స్ లాంటి పోటీ పరీక్షల్లోనూ ఇక్కడి విద్యార్థులు అద్భుతమైనటువంటి ఫలితాలు సాధిస్తున్నారు. ఇలాంటి ప్రతిష్టాకరమైన విద్యాసంస్థలో చేరడానికి గాను ఏటా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు.ఎనభై సీట్లకు గాను వేలాదిమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత భోజన వసతి సదుపాయాలతో పాటు పుస్తకాలు, యూనిఫారం అందిస్తారు. కార్పోరేట్ విద్యాసంస్థలు సాధించలేని ఫలితాలను, ప్రమాణాలను సాధిస్తూ పేరొందిన వీటి సంఖ్యను పెంచాలని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డిమాండ్ పెరుగుతూ వస్తున్నది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వీటి తరహాలోనే విద్యాలయాలను స్థాపిస్తున్నాయి. నవోదయ విద్యాలయాల పనితీరును గమనించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో వీటి సంఖ్యను పెంచుతూ వస్తున్నది.



నవోదయ విద్యాలయాలు ఆశ్రమ విద్యాలయాలు. బాల బాలికలు అక్కడే ఉంటారు కాబట్టి వాళ్ల బాగోగుల్ని చూసుకోవటానికి బోధన బోధనేతర సిబ్బంది అక్కడే ఉంటారు. ముఖ్యంగా వీటిని గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉద్దేశించి స్థాపించబడినవి కనుక వీటిలో 90 శాతానికి పైగా అక్కడి పరిసరాల లోనే ఏర్పాటు చేశారు. ఇందులో ఉద్యోగంలో చేరడానికి గాను ఇంటర్వ్యూ, పోటీ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులను నియమించిన వారికి పెన్షన్ సౌకర్యాన్ని కల్పించలేదు. 1986 నుండి 2004 వరకు నియుక్తులైన సుమారు 15 వేల మంది రెగ్యులర్ సిబ్బందికి న్యాయబద్ధంగా కల్పించవలసిన సి.సి.ఎస్ 1972పాత పెన్షన్ సౌకర్యాన్ని కల్పించలేదు. పెన్షన్ విషయమై వీరికి జరిగిన అన్యాయాన్ని గురించి వందలాది మంది పార్లమెంట్ సభ్యులు నవోదయ సిబ్బంది పనితీరును, క్రమశిక్షణను, అంకిత భావాన్ని, పరీక్ష ఫలితాలను, ప్రమాణాలను గమనించి పాత పెన్షన్ వర్తింప చేయమని లేఖలు రాసినా స్పందన లేదు. దీనితో ముప్పై, ముప్పైదేళ్ల సేవలందించి పదవి విరమణ చేస్తున్న సిబ్బందికి పెన్షన్ లేకపోవడం వలన వృద్ధాప్యం, అనారోగ్యం, కుటుంబ పోషణ తదితర సమస్యలతో నానా ఇబ్బందులు పడుతున్నారు. వాళ్ల చేతుల్లో పిల్లల బతుకులు బాగుపడ్డ తమ బతుకులు బాగు కాలేదని బాధపడుతున్నారు. ఆర్థిక "భద్రత" లేదని తెలిసినా విధులను "బాధ్యతతో" నిర్వహించిన వారికి "భవిష్యత్తు" పట్ల "భరోసాను" కల్పించవలసిన అవసరం ఉంది. 2004 తర్వాతి నుంచి నియుక్తమైన వారికి ఎన్.పి.ఎస్ ఉంది.అంతకు ముందు వారికి ఏదీ లేక రెంటికి చెడ్డ రేవడి అయ్యారు. విద్యా రంగానికి సంబంధించి ఎన్.జనార్ధన్ రెడ్డి కమిషన్ అలాగే చతుర్వేది కమిషన్ల అధ్యయన నివేదికలు నవోదయల పనితీరును మెచ్చుకున్నాయి చతుర్వేది కమిషన్ నవోదయ సిబ్బందికి పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరింది. మౌలిక సమస్య అయిన పాత పెన్షన్ సౌకర్య కల్పన గురించి నవోదయ సిబ్బంది ప్రతినిధులు పలుమార్లు అటు సమితి అధికారులతోనూ ఇటు ప్రభుత్వ అధికారులతోనూ నిరంతర చర్చలు, జరుపుతూ అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తూనే ఉన్నారు.

పెన్షన్ అనేది ఉద్యోగి జన్మహక్కు. వయోధికులైన సామాన్య ప్రజలకు ఆయా ప్రభుత్వాలు పెన్షన్ సౌకర్యం కల్పిస్తుండగా నవోదయ ఉద్యోగుల విషయమై సవతి తల్లి ప్రేమను కనబరచడం భావ్యం కాదు. ఐదు,పదేళ్లపాటు ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహించిన వారికీ పెన్షన్ సౌకర్యం ఉండగా ముప్పై,ముప్పైదేళ్ల పాటు నిరంతర సేవలు అందించిన నవోదయ సిబ్బందికి పాత పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ఉంది. నవోదయాలకు స్వయం ప్రతిపత్తి పేరుతో పింఛన్ సౌకర్యాన్ని నిరాకరించకూడదు. ఒకనాడు ముప్పై ఏళ్ల వయసులో నిరుద్యోగంతో యువకులుగా ఏ విధంగా బాధపడ్డారో ఇవాళ 60 ఏళ్లు నిండిన తర్వాత అదే జీవన భృతి లేక నిరుద్యోగాన్ని అనుభవిస్తున్నారు. కనుక 1986-2004 మధ్య నియుక్తులైన నవోదయ సిబ్బందికి జరిగిన అన్యాయాన్ని గుర్తించి పార్టీలకు రాజకీయాలకు అతీతంగా సమష్టిగా నిర్ణయం తీసుకొని వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని కోరుతున్నాను. ఇప్పటికే ఆలస్యం జరిగింది. "న్యాయాన్ని ఆలస్యం చేసినా అది అన్యాయం చేసినట్లే" అవుతుందని సూక్తి. కనుక ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొనగలదని ఆశిద్దాం.



**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
**99 891 48 305**

# బాలలే...భవిష్యత్ తరాలకు ధృవతారలు!

మహాకవి శ్రీశ్రీ తన మహాప్రస్థానంలోని శైశవగీతంలో పిల్లలను విశ్వరూపంలో విహరించే దైవత్వంగా, లోకానికి భాగ్యవిధాతలుగా కీర్తించారు. గరికపచ్చ మైదానాల్లో, తామర కొలనులలో, తల్లి కౌగిటిలో, తండ్రి సన్నిధిలో ఆడుకుంటూ వికసించాల్సిన బాల్యం, దురదృష్టవశాత్తూ, ఇటుక బట్టీలలో, హోటళ్లలో, బస్టాండ్లలో, పంటపొలాల్లో, రైల్వే స్టేషన్లలో బాల కార్మికుల రూపంలో నలిగిపోతోంది. మహాత్మా గాంధీజీ ఈ వ్యవస్థను మానవ హక్కుల ఉల్లంఘనగా గుర్తించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా, వికసిత భారత్ 2047 లక్ష్యంతో ఆత్మవిశ్వాసంతో, ఆశావాదంతో ముందుకు సాగుతున్న ఈ శుభ సమయంలో, మన దేశంలో కోటికి పైగా పిల్లలు బాల కార్మికులుగా జీవితపోరాటంలో ఉన్నారని శాస్త్రీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 160 మిలియన్ల మంది పిల్లలు ఈ వ్యవస్థలో చిక్కుకుని, తమ బాల్యాన్ని కోల్పోతున్నారు. ఈ వాస్తవం మనలోని మానవత్వం కేవలం మాటల్లోనే మిగిలిపోయిందని ఆలోచింపజేస్తుంది.

పేదరికం ఈ సమస్యకు మూల కారణం. నిరక్షరాస్యత, ఆర్థిక అసమానతలు, జనాభా పెరుగుదల, మానవ అక్రమ రవాణా వంటి సమస్యలు దీన్ని మరింత జటిలం చేస్తున్నాయి. ఓటు బ్యాంకు రాజకీయాలు, ప్రభుత్వ వైఫల్యాలు బాలల జీవితాలతో ఆటలాడుతున్నాయి. కలల రెక్కలతో అంతరిక్ష హద్దులను చేరాల్సిన పిల్లలు ఆకలి, అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. కలం పట్టి భవిష్యత్‌ను రాయాల్సిన చేతులు చిత్తుకాగితాలను వెతుకుతున్నాయి. ఇంద్రధనస్సు రంగులను సృష్టించాల్సిన బాలలు కన్నీటిలో వెట్టిచాకిరీ చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, బాణాసంచా, తోలు, గాజుల తయారీ వంటి ప్రమాదకర పనుల్లో పిల్లలు తమ ఆరోగ్యాన్ని వింత



వ్యాధులకు బలిచేస్తున్నారు. ఈ పనులు వారి శారీరక, మానసిక వికాసాన్ని దెబ్బతీస్తున్నాయి, వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టివేస్తున్నాయి.

మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 21A ప్రకారం, 6-14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య ప్రాథమిక హక్కు. 2009 విద్యా హక్కు చట్టం ఈ బాధ్యతను ప్రభుత్వాలకు అప్పగించింది. 1979లో గురుపాద స్వామి కమిటీ సిఫార్సుల ఆధారంగా, 1986లో బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టం రూపొందింది. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే సెక్షన్ 14 ప్రకారం శిక్ష ఉంటుంది. జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు బాల కార్మికులను విముక్తి చేసి, పునరావాసం కల్పిస్తూ, ప్రత్యేక పాఠశాలల్లో చేర్చే కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ వంటి పథకాలు ఈ దిశగా పనిచేస్తున్నాయి. 2002 నుంచి అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రతి జూన్ 12న అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నారు. 2021ని అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక సంవత్సరంగా ప్రకటించారు. నిజుఅస జష్టఆశ్రీస End child labour:A Milestone in 2025 థీమ్‌తో 100కు పైగా దేశాలు ఈ సమస్యను అంతం చేయడానికి కృషి చేస్తున్నాయి.

ప్రభుత్వ నివేదికల ప్రకారం, భారత్‌లోని బాల కార్మికుల్లో సగానికి పైగా ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్నారు. ఇది దేశ పురోగతికి అడ్డంకిగా మారుతు ంది. నోబెల్ శాంతి గ్రహీత కైలాష్ సత్యార్థి బాల బానిసత్వానికి వ్యతిరేకంగా 140 దేశాల్లో లక్షలాది మందిని ప్రేరేపించారు. నిప్రతి నిమిషం ముఖ్యం, ప్రతి బిడ్డ ముఖ్యం, ప్రతి బాల్యం ముఖ్యం్ల అన్న వారి సంకల్పం మనందరినీ కదిలిస్తుంది. ఈ సత్యాన్ని సాకారం చేయడానికి మనమంతా సామాజిక బాధ్యతతో, ప్రభుత్వాలతో కలిసి బాల కార్మిక వ్యవస్థను రూపుమా పాలి. పేదరికంపై సమిష్టి యుద్ధం చేయకపోతే, నిరక్షరాస్యత, అసమానతలు, అక్రమ రవాణా వంటి సమస్యలు మరింత బలపడతాయి. ప్రతి బిడ్డకు విద్య, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అందించే బాధ్యత మనందరిపై ఉంది.

సమాజంలో చిన్న చిన్న మార్పుల నుంచి ప్రారంభిద్దాం. బాల కార్మికులను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్చేందుకు స్థానిక సంస్థలతో కలిసి పనిచేద్దాం. అవగాహన కార్యక్రమాల ద్వారా పేదరికం, బాల కార్మిక వ్యవస్థ పరస్పర సంబంధాన్ని తెలియజేద్దాం. ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించి, అవసరమైన చోట సలహాలు, సూచనలు అందిద్దాం. బాల్యం వికసించే భారతాన్ని నిర్మించి, ప్రపంచానికి ఆదర్శంగా నిలవడంలో మన వంతు పాత్ర పోషిద్దాం. ఈ బృహత్ కార్యంలో నేనూ భాగమవుతానని, బాల కార్మిక వ్యవస్థను అంతం చేసే ఈ యజ్ఞంలో నా సహాయం అందిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

**అరుణ్ కుమార్, ఫిజిక్స్**
**9394749536**



## పాట

వొందనాలొందనాలే
వో ఉద్యమాల గడ్డా..

ఇథనాలు వొద్దని
ఊరూర్లు గదిలించి
ఫ్యాక్టరే రద్దాని పెద్ద
పోరయ్యి నావే నడిగడ్డా..
వొందనా లొందనాలే
వో ఉద్యమాల గడ్డా..
"ఇథ"

పేదోల్ల బతుకులు
పాడెల పాలయ్యే
తరాల దుఃఖము
తలరాత ఎట్లాని

ఎండీన కాల్వకు
నీళ్ళియ్య నోడు
మాడిన పంటకు
కరుణించ నోడు

పార్టీలు మారుతు
ఫోజిచ్చే లీడరు
పస్తులే మనకిచ్చి
ఆస్తులే బెంచానీ..
"ఇథ"

కలి గంజి దాగి
కన్నమ్మ కష్టాలు
దిగమింగు కుంట
రైతులే జస్తుంటే

మూటలకు మరిగి
నేతలే న్యాయాలు
తలకిందు జేస్తుంటే
జంగయ్య జనమంతా

పానాలు దీసేటి
విషాలు గక్కేటి
మిల్లులు మాకొద్దు
పానాల్తో సంపంటూ..
"ఇథ"

సుట్టున్న పల్లెలు
గుప్పంటు లేసిరి
దారి పైరలు గాసి
యంత్రాల గూల్చితే..

పిల్ల పాపలు గూడి
పిడికిల్లే గట్టుకోనీ
గీతగీసిన గుండాల
గుండెల్ల గుబులైరి

కంపెనీల ఊడిగాల్ల
రాటుదేలిన రాజ్యం
దొంగదాడుల జేపిచ్చి
పేదోల్ల జైళ్లకు బంపితే..
"ఇథ"

దేశాన్ని దోచేటి
గూండలెల్లా గల్సి
గద్దెల నెక్కిండ్రు
నిజ నేతలయ్యీ

ఏలేటి ఇగురము
గాలికి ఇడిసేసి
జనాల హింసించే
రాకాసులైరాని..

కాకుంటే ఇట్లాంటి
దేంజర్లు జేసేటి
దుర్మార్గ ప్యాక్టీలు
పల్లెలకు వొచ్చాని..
"ఇథ"

ఇథనాలు పోరుకు
ఇరుసయ్యి సాగి
బతికేటి హక్కా ను
బతికించు కుందాము..

రాజ్యాంగ విలువలు
రక్షించ లేనోళ్ళు
గద్దెలెక్కకుండా
గల్ల బట్టుదాము..

**- డా. ఇక్బాల్ పాషా**

## త్యాగశీలి నాన్న ప్రగతి సారథి నాన్న



నాన్న నీమనసే వెన్న
అమృతం కన్న అది
ఎంతో మిన్న అన్న
సినీ కవి మాటలు
అక్షరసత్యాలు
మనల్ని తెలుసుకొని
మసిలేది నాన్న
మన ఆశలు ఆకాంక్షలు
తీర్చేది నాన్న
గురువు దైవం
అన్నీ నాన్నే
నాన్న జీవధాత
నాన్న ఓర్పుకు అద్ద
మార్పుకు మార్గదర్శి
నీతికి నిదర్శనం
మన ప్రగతికి సోపానం
అమ్మ ఒడి గుడి
అయితేనాన్న భుజం
ఈ లోకాన్నిచూపే బడి
పేగు అమ్మదైతె
పేరు నాన్నది
అమ్మ అనురాగం
పంచుతే
నాన్న జీవిత
అనుభవాలు
చెబుతాడు
అమ్మ లాలి పాటలు
నాన్న నీతి పాటలు
ఉన్నత ఉజ్వల
జీవితానికి
సోపానాలు
కష్టాలే తన ఇష్టాలుగా
మార్చుకొని
సంసార నావికుడై
కష్టాల కడలిని ఈదుతు
నిరంతరం పిల్లల
సుఖం కోసం
పరితపిస్తూ
పరిశ్రమిస్తూ
ముళ్ల బాటలో
నడుస్తూ
పిల్లలకు
పూలబాట కోసం
త్యాగాల పునాదుల
మీదపిల్లల ఉజ్వల
భవిష్యత్తు
నిర్మాత నాన్న

జీవితానికి గమనం
గమ్యం నిర్దేశకుడు నాన్న
దుఃఖాన్ని దిగమింగి
కుటుంబ సభ్యుల
హితమే తన
అభిమతంగా
మలుచుకున్న
కుటుంబ సంక్షేమ
సారథి నాన్న

గురువై హిత బోధ చేస్తూ
దైవంలా ఆత్మవిశ్వాసాన్ని
బిడ్డల్లో కలిగిస్తూ
భద్రత భరోసా రక్షణ
కవచమై సరైన మార్గంలో
నడిపించే నాన్న
పిల్లలు తనకంటే
మించి ఉన్నత
శిఖరాలకు ఎదుగాలనే
నాన్న ఎప్పటికీ హీరోనే
వారసత్వ ప్రథాత
పిల్లల ప్రగతి సారథి నాన్న

నాన్నను అర్థం చేసుకుందాం
ఆప్యాయతతో చూసుకుందాం
నాన్న ప్రేమ అనంతం
అజరామరం అద్భుతం.

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు 'తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక**
**తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం**
**9440245771 కరీంనగర్**

# సామాజిక శాస్త్ర పరిశోధనలో అంతర్గత సవాళ్లు



సామాజిక శాస్త్ర పరిశోధనలో మనుషుల ప్రవర్తన, సమాజ నిర్మాణం, సంస్థాగత వ్యవస్థలపై లోతైన అవగాహన అందించడానికి కీలకమైన సాధనంగా ఉంది. అయితే, ఇది అనేక ప్రత్యేకమైన పద్ధతి(మెథడ్ )కుసంబంధిచిన సమస్యలను ఎదుర్కొంటుంది, ఇవి విశ్వసనీయత, సరైన నమూనా ఎంపిక, మరియు ఫలితాల చెల్లుబాటును సంక్లిష్ట చేస్తాయి. సహజ (న్యాచురల్ సైన్స్) శాస్త్రాల కంటే సామాజిక శాస్త్రాల్లో నియంత్రిత ప్రయోగాలు, ఖచ్చితమైన కొలమానాలు సాధ్యపడవు. మానవ సమాజం అనేక జటిలతల తో కూడినదైనందున పరిశోధకులు ఎప్పటికప్పుడు పద్ధతులను విధిగా పరిస్థితులకు తగినట్లుగా మెరుగు పరచుకోవాలి.

సామాజిక శాస్త్రీ పరిశోధనలో కీలకమైన సమస్యలలో ఒకటి విశ్వసనీయమైన ప్రయోగాలను రూపొందించడం. సహజ శాస్త్రాల్లో అనుసరించే నియంత్రిత ప్రయోగాలను (నియంతృత వాతావరణంలో లేబరెటరీలలో) పరిశోధన జరుపుతారు.కనకక ప్రయోగం ఫలితాలు 100శాతం సరైన ఫలితాలు ఇస్తాయి.సామాజిక శాస్త్రాల్లో డేటాను పునరావృతం చేయడం చాలా కష్టసాధ్యం. మానవ ప్రవర్తన అనేక అస్థిరమైన అంశాలతో ముడిపడి ఉండటం దీనికి ప్రధాన కారణం. అదనంగా, పరిశోధనలకు నైతిక పరిమితులు ఉండడం వల్ల అనేక కీలక ప్రయోగాలు సాధ్యం కావు. పాల్గొనే వ్యక్తుల గోప్యత, మానసిక సంక్షోభం లేకుండా ఉండేలా చూసే బాధ్యత పరిశోధకులపై ఉంటుంది. అంతేకాకుండా, సామాజిక ప్రభావాలు, వ్యక్తిగత అనుభవాలు, భావోద్వేగాలు పరిశోధన ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. వీటిని పూర్తిగా నియంత్రించలేకపోవడం వల్ల ప్రయోగ ఫలితాల్లో మార్పులు వస్తాయి.

మరొక ప్రధాన సవాలు ప్రాతినిధ్యప్రాయమైన నమూనా ఎంపిక. ఏ పరిశోధనలోనైనా ఫలితాలు సమాజానికి వర్తించాలంటే నమూనా (శ్యాం పిల్) సరైన ప్రాతినిధ్యాన్ని కలిగి ఉండాలి. కానీ, అనేక పరిశోధనల్లో ఈ సమస్య తలెత్తుతుంది. ఉదాహరణకు, చాలా మానసిక పరిశోధనలు ప్రధానంగా కళాశాల విద్యార్థులపై నిర్వహించబడతాయి. ఇవి మొత్తం ప్రజాసంఖ్యకు వర్తిస్తాయా? లేదా? అనే సందేహం ఉంటుంది. అదనంగా, కొన్ని సమూహాలను చేరుకోవడం కష్టం. నిరాదరణకు గురైన వర్గాలు, రాజకీయ నాయకులు, నేర చరితుల వంటి విభాగాలకు చెందిన వ్యక్తులను పరిశోధనలో భాగస్వామ్యం చేయడం కష్టతరం. కొన్ని సందర్భాల్లో, పరిశోధనకు స్పందించడానికి ఆసక్తి ఉన్నవారే ముందుకు రావడం వల్ల స్వయం-ఎంపిక పక్షపాతం (సబ్జెక్టువిటీ) ఏర్పడుతుంది. దీంతో ఫలితాలు మూల జనాభాను ప్రతిబింబించకపోవచ్చు.

చివరిగా, పరిశోధన ఫలితాలు నిజంగా సరైనవా అనే అంశం కూడా ఒక ప్రధాన సవాలుగా ఉంటుంది. సామాజిక పరిశోధనల్లో కారణ-ఫలిత సంబంధాన్ని నిర్ధారించడం చాలా కష్టం. అనేక అంశాలు ఒకే సమయంలో ప్రభావం చూపడం వల్ల 'సహసంబంధం కారణ సంబంధాన్ని' సూచించదు. (కార్ రిలేషన్ డజ్ నాట్ ఇంప్లయి కాజేషన్)(Correlation does not imply causation) అనే సమస్య తరచుగా ఎదురవుతుంది. సర్వేలు, ఇంటర్వ్యూల వంటి ఉపాయాల ద్వారా సమాచారం సేకరించడం కూడా పూర్తి విశ్వసనీయతను కలిగి ఉండదు. ఎందుకంటే, ప్రశ్నల రూపకల్పన, సమాధానదారుల(రెస్పాడెంట్స్) భావోద్వేగాలు, పరిశోధకుల నిర్దేశిత అంచనాలు ఫలితాలపై ప్రభావం చూపవచ్చు. అంతేకాకుండా, "ప్రచురణ పక్షపాతం" అనే సమస్య కూడా ఉంది. ముఖ్యంగా, ఆశించిన లేదా కొత్త విషయాలను వెల్లడించే పరిశోధనలు మాత్రమే ప్రచురితమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితి పరిశోధనలో అసంతులనాన్ని (ఇంబ్యాలెన్స్) ను పెంచుతుంది.

మరో విశేషమైన సవాలు దీర్ఘకాలిక పరిశోధనలు. మానవ సమాజం అనేక మార్పులను ఎదుర్కొంటూ ఉంటుంది. ఒక సుదీర్ఘ అధ్యయనం కొనసాగుతున్న సమయంలో ఆర్థిక, రాజకీయ, సాంకేతిక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇవన్నీ పరిశోధన ఫలితాలపై ప్రభావం చూపుతాయి. అంతేకాకుండా, సమకాలీన సాంస్కృతిక భిన్నతలను అర్థం చేసుకోవడం కూడా పరిశోధకులకు పెద్ద పరీక్షగా మారుతుంది. ఒక దేశానికి వర్తించే పరిశోధనా నమూనా (రీసెర్చ్ మోడల్)మరొక దేశానికి సరిగ్గా సరిపోదు.

ఈ సమస్యలను అధిగమించేందుకు కొత్త పరిశోధనా విధానాలు, మెరుగైన గణాంక పద్ధతులు, మరియు అధునాతన డేటా విశ్లేషణా సాధనాలు ఉపయోగపడుతున్నాయి. బహుళ శాస్త్రాల అనుసంధానం(ఇంటర్ డిసిప్లనరీ అప్రోచ్) , మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా, వంటివి సామాజిక శాస్త్ర పరిశోధనను మరింత పటిష్టం చేయగలవు. అయినప్పటికీ, నమూనా ఎంపికలో (శాంపిల్ ఎంపిక లో) అసమతుల్యత, ప్రయోగాల్లో సమస్యలు, పరిశోధన ఫలితాల విశ్వసనీయత వంటి బలహీనతలు ఇంకా పరిష్కారం కావాల్సిన అవసరం ఉంది. సమాజాన్ని మెరుగుపరిచే సమాచారాన్ని అందించాలంటే పరిశోధన విధానాలపై మరింత కఠినమైన సమీక్ష అవసరం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# వామ్మో..! ప్రైవేట్ బడుల దోపిడీ

- ఇష్టారాజ్యంగా ఫీజులు
- పాఠ్యపుస్తకాల పేరుతో నిలువు దోపిడీ
- ప్రభుత్వాధికారుల మౌనముద్ర
- తల్లిదండ్రుల ఆర్థిక అవస్థలు

**అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని అనేక ప్రైవేటు పాఠశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చే యత్నాలు పెట్టుతున్నాయి. విద్యా సంవత్సర ప్రారంభానికి ముందే వార్షిక ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, ఇతర పేర్లతో లక్షల రూపాయలు వసూలు చేయడం ఎప్పటిలాగే కొనసాగుతోంది.**




**అబ్దుల్లాపూర్మెట్, జూన్ 16 (జనంసాక్షి)**

**తామే ముద్రించిన పుస్తకాలే తప్పనిసరి..!**

పాఠశాలలు తమకే చెందిన ప్రచురణ సంస్థల పుస్తకాలను తప్ప వేరే బుక్స్‌ను కొనద్దని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న డిజిసెట్ గుర్తింపు పొందిన పుస్తకాలను ఉపేక్షించకుండా, ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలను కొనాల్సిందేనని చెప్పడం గమనార్హం. యూనిఫామ్‌ల విషయంలోనూ అదే పరిస్థితి స్కూల్ నుంచే కొనాలని నిబంధనలు విధిస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నారు.

**తనిఖీలు లేవు..చర్యలు లేవు**

ఇన్ని జరుగుతున్నా సంబంధిత అధికారులు, ముఖ్యంగా ఎంఈఓ, డీఈఓ మాత్రం మౌనంగా వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా, కొందరు అధికారులు ముడుపులు తీసుకుని ప్రైవేట్ పాఠశాలలకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తల్లిదండ్రుల ఆవేదన**

"విద్య హక్కు కాదు బాబోయ్... ఖరీదైన వస్తువైంది" అని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఫీజులు, బలవంతపు కొనుగోళ్లు, అధికారుల నిర్లక్ష్యం తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి.
"మా బిడ్డ భవిష్యత్తు కోసం మేం ఎన్నో త్యాగాలు చేస్తున్నాం. కానీ ఇది చదువా? లేక లూటా?" అని వారు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం

విద్యను సేవగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో, ప్రభుత్వ సంబంధిత శాఖలు నిద్రలేచి, ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఇది. విద్యా వ్యవస్థను ప్రైవేటు లాభాలకు గాక, సామాన్యుల ఆశలకు కట్టుబడి ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 16 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల యొక్క పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. అనంతరం ఇతర శాఖల యొక్క పనులపై ఆరా తీసి పూర్తిచేయాలని అన్నారు. భూ సమస్యలు రెండు పడకల గదుల ఇల్లు మంజూరు రైతు భరోసా పెన్షన్ల మంజూరు తదితర అంశాలపై అర్జీలు సోమవారం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో 135 అర్జీలు పలు శాఖలకు చెందిన దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ చందర్, కామారెడ్డి ఆర్ డి ఓ వీణ అలాగే జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



**హయత్‌నగర్, జూన్ 16 (జనం సాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యం లో హయత్ నగర్ డివిజన్ లోని ద్వారకమై నగర్ లో నిర్వహించిన ముందస్తు వర్షకాల శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ లో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని కాలనీ వాసులకు, పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం లో హయత్ నగర్ డివిజన్ వాసులందరు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త చెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో వెయ్యకుండా కేవలం స్వచ్ఛ ఆటోలో మాత్రమే వైయాలని వారు కోరారు. వర్ష కాలంలో ఇంటి పరిసరాల్లో ఏక్కడ కూడా వర్షపు నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు నిలువ ఉండడం వలన దోమలు వ్యాపించి అనారోగ్య బారిన పడే ప్రమాదం ఏర్పడుతుందని వారు తెలిపారు. జిహెచ్ఎంసి, శానిటేషన్ సిబ్బంది తో వారు విధులు సక్రమంగా నిర్వహించడంతో పాటు హయత్ నగర్ డివిజన్ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, వరద నీటి కాలువల వద్ద చెత్త చెదారం చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. కార్పొరేటర్ శానిటేషన్ అధికారుల తో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సరిపడా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య, సరైన యంత్రం గాలు లేకపోవడం తో నగరంలో చెత్త సమస్య రోజురోజుకు పెరుగుతుందని శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డి ఈ నీలిమ, జిహెచ్ఎంసి ఏ ఈ హేము నాయక్, ఎస్ ఎస్ చంద్ర శేఖర్, జవాన్ రాజు, కాలనీ అధ్యక్షులు ప్రభు లింగం, కాలనీ వాసులు ప్రవీణ్, సురేందర్, నాగేశ్వర్ రావు, రమణ, ఉమా, శానిటేషన్ సూపర్వైజర్లు మధు, శ్రవణ్, రాజ్ కుమార్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

- మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ ఆదివారము వేములవాడకు చేరుకొని సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం నిర్వహించగా ఆలయా ఇన్చార్జీ ఈవో రాధాబాయి స్వామి వారి శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేశారు. అనంతరం గెస్ట్ హౌస్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మా ఇంటి ఇలవేల్పు,కుల దైవం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారని,అమ్మవార్ల దర్శనం అనంతరమే ఏ కార్యక్రమమైన మొదలుపెట్టడం జరుగుతుందన్నారు. 1984 నుండి ఎన్ఎస్యుఐ నుండి మొదలుకొని నేటి వరకు కాంగ్రెస్ పార్టీలో ప్రయాణం కొనసాగుతుందన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాలను మార్చిందన్నారు. ఈ యాత్ర సామాజిక న్యాయానికి పునాది వేసిందనీ,ఎన్ని కష్టాలు ఎదురైనా, ప్రమాదం ఉందని తెలిసిన రాహుల్ యాత్ర కొనసాగించడం చారిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందనీ, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ, అగ్రనేత రాహుల్ గాంధీ,పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కే.సి వేణుగోపాల్ ల మార్గ నిర్దేశనంలో, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమంలో దూసుకు వెళ్తుందన్నారు. మిగులు రాష్ట్రంగా ఇచ్చిన రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన ఘనత గత ప్రభుత్వానిది అయితే ప్రతి నెల వడ్డీలు కడుతూ ప్రజా సంక్షేమ పథకాలను ఆపకుండా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన 18నెలల్లోనే రైతులకు రుణమాఫీ, సన్నబియ్యం,రికార్డ్ స్థాయిలో రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం,59వేల ఉద్యోగాలు ఇచ్చమన్నారు. అధికారం చేపట్టిన 18 నెలల్లోనే ఈ స్థాయిలో ప్రజల సంక్షేమానికి కృషిచేసిన రాష్ట్రం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. కనీసం బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇలాంటి పథకాలు అమలు చేస్తున్నారా,కాంగ్రెస్ పార్టీ అంటేనే సోషల్ జస్టిస్ కు కేరాఫ్ అడ్రస్ అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు బడుగు బలహీన వర్గాలకు చెందిన తనతో పాటు గడ్డం వివేక్, వాకిటి శ్రీహరిను మంత్రులుగా,డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రు నాయక్ లకు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం వచ్చిందన్నారు. స్వామివారి, అమ్మవారి ఆశీస్సులతో జీవితంలో ఎన్నడు ఊహించని అవకాశం, అదృష్టం నాకు కలిసి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో నాకు అప్పగించిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తనాని,ఆయా శాఖలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకు అందించలేని సేవలను అందిస్తూ, ప్రజా పాలనను ముందుకు తీసుకెళ్తమన్నారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్య బలోపేతానికి సీఎం ప్రత్యేక దృష్టి

- తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు డా. చారకొండ వెంకటేష్
- చారకొండ జడ్పిహెచ్ఎస్ పాఠశాల పరిశీలన



**చారకొండ, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వ విద్య బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు డా. చారకొండ వెంకటేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో నిర్లక్ష్యాన్ని గురైన ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసు మేరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేరుతో అన్ని వసతులతో కూడిన పాఠశాలలను నిర్మించడానికి పైలెట్ ప్రాజెక్టుగా నాగర్ కర్నూల్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి, రంగారెడ్డి జిల్లాలోని మంచాల, ఆరుట్ల గ్రామాలలోని ఒక్కో పాఠశాలకు రూ. 12 కోట్ల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. విద్యా వ్యవస్థలు విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విద్యా కమిషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించారు. ప్రతి ఒక్క విద్యార్థి భయంతో కాకుండా ఇష్టంగా చదువుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ టీచర్లు ఉంటారని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని కోరారు. ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని కోరారు. ప్రతి ఒక్క పదవ తరగతి విద్యార్థికి సొంత ఖర్చుతో ఇంగ్లీష్ వార్త పేపర్ వేయిస్తానని నిత్యం పేపర్ చదివి ఇంగ్లీష్ పై పట్టు సాధించాలని కోరారు. తాను చదువుకున్న చారకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణ సమస్యలైన టాయిలెట్లు, సైన్స్, సోషల్ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తానని, సిఎస్ఆర్ నిధులతో మంచినీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేయిస్తానని, ఆట స్థలంలో మట్టిని పోయించి క్రీడలకు అనువుగా ఉండే విధంగా చేయిస్తానని, పాఠశాల భవనానికి పెయింటింగ్ వేయిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువెళ్లి చారకొండకు రెండో విడతలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేటాయించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిహెచ్ఎం భగవాన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గురువయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకుడు శివ, ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి, కమలాకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, జూన్ 16 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని దేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. సోమవారం సీఎం రేవంత్రెడ్డి రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాల రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. అయితే చేవెళ్ల మండలంలో చేవెళ్ల, ఖానాపూర్, అలూర్ గ్రామాల్లో ఉన్న రైతు వేదికల్లో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం కొనసాగించారు. కాగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ బి.కృష్ణయ్య, ఏడిఏ సురేష్ బాబు, రైతులతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అర్హులైన రైతులందరికి రైతుబందు అందిస్తుందన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పదకాలను రైతులకు చేరవేసే భాధ్యత వ్యవసాయ అధికారులదే అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ లు దేవర వెంకటరెడ్డి, గొనే ప్రతాప్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, జే లక్ష్మా రెడ్డి, పాండు, మల్గారి మల్లా రెడ్డి, ఏవో శంకర్ లాల్, ఏఈవోలు, నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

## ఆర్ఎంపీపై చెప్పుతో దాడి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతంలో వైద్యం అందించే ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ డాక్టర్ మహిళల పట్ల ఆసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ సదరు మహిళ డిచ్ పల్లి వైద్యుడిపై చెప్పుతో దాడికి పాల్పడింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం నిజామాబాద్ గ్రామీణ ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పూలంగ్ చౌరస్తా నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పేద ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించే విధంగా అందించే రాత్రింబవళ్లు తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలో విఫలం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమం జరుగుతుండగా ఒక్కసారిగా ఓ మహిళ నిరసన కార్యక్రమంలోకి చొరబడి డిచ్ పల్లికి చెందిన అశోక్ కుమార్ అనే ఆర్ఎంపి వైద్యుడిపై చెప్పుతో దాడి చేసింది. ఈ సందర్భంగా మహిళ మాట్లాడుతూ వైద్యం కోసం వెళ్తే సదరు ఆర్ఎంపీ డాక్టర్ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. అందుకే సదరు ఆర్ఎంపీ డాక్టర్ పై చెప్పుతో డాడీకి దిగినట్లు తెలిపారు.

## మహావీర్ మెడికల్ కళాశాల విద్యార్థుల ధర్నా

- విధుల బహిష్కరణ
- నాలుగు నెలలుగా ఉపకార వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్పందించాలని విజ్ఞప్తి
- యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుంది
- మెడికోల ఆరోపణ

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి) :** రాత్రింబగళ్లు కష్టపడి పని చేస్తున్నాం.. చేసిన పనికి ప్రతిఫలం అందడం లేదు. యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుంది. తమ విజ్ఞప్తిని విస్మరిస్తుంది. తమ సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళాం. అయినా ప్రయోజనం శూన్యం. విధులు బహిష్కరించి ఆందోళన చేసి తమ హక్కు కోసం పోరాటం చేస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం మా సమస్య పరిష్కారం కోసం సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం.. రోగులు ఇబ్బంది పడవలసిన పరిస్థితి నెలకొంటుంది. అంటూ మెడికల్ కాలేజ్ విద్యార్థులు కళాశాల యాజమాన్యం. రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఆందోళన వికారాబాద్ పట్టణంలోని మహావీర్ ఆసుపత్రిలో సోమవారం రోజు జరిగింది. వివరాల్లోకి వెళితే వికారాబాద్ మహావీర్ ఆసుపత్రిలో హౌస్ సర్జరీ. పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కళాశాల విద్యార్థులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. దాదాపు 150 మంది మెడికల్ కళాశాల హౌస్ సర్జరీ గ్రాడ్యుయేట్ విద్యార్థులు రోజు పనిచేస్తున్నారు. వారత్త విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జీవో నెంబర్ 59. ఎన్ ఎం సి నిబంధనల ప్రకారం హౌస్ సర్జరీ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మహావీర్ ఆసుపత్రి కళాశాల యాజమాన్యం నెలకు 25 వేల906 రూపాయల ఉపకార వేతనం చెల్లించవలసి ఉందని వారు తెలియజేశారు. కానీ కళాశాల యాజమాన్యం తమకు నెల నెల ఉపకార వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందని వారు ఆరోపించారు. హౌస్ సర్జరీ మెడికల్ విద్యార్థులకు రెండు నెలలు. పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ విద్యార్థులకు నాలుగు నెలల ఉపకార వేతనాలు యాజమాన్యం చెల్లించవలసి ఉందని వారు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఉపకార వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉపకార వేతనాలు చెల్లిస్తామని ఆ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని కానీ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం ఎలాంటి హామీ ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని అన్నారు. 36 గంటలు పని చేస్తే నెలకు 2000 రూపాయలు చెల్లిస్తామని కళాశాల యాజమాన్యం ఉంటుందని ఐదేళ్లపాటు కష్టపడి చదివి డాక్టర్ అయితే వారికి 2000 రూపాయలు నెలసరి ఉపకార వేతనం చెల్లిస్తామని యజమాన్యం చెప్పడం సిగ్గుచేటని అన్నారు. వైద్య వృత్తిని నిర్వహించే వారిని దేవుడితో పోలుస్తారని అలాంటి వారికి గౌరవించే ఇదే నా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యను పరిష్కరించకపోగా విధులు నిర్వహించినందుకు గైర్హాజరు వేస్తామని ఆర్ఎంఓ విద్యార్థులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వలన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాల విద్యార్థులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఉపకార వేతనాలు చెల్లించని ప్రైవేట్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కళాశాల ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య అధికంగా ఉంటుందని ప్రైవేట్ కళాశాల ఆసుపత్రిలో రోగుల సంఖ్య తక్కువగా ఉన్న హౌస్ సర్జరీ గ్రాడ్యుయేట్ విద్యార్థులు యాజమాన్యం చెప్పిన విధంగా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. రోగుల సంఖ్య తగ్గిన పని దినాలు మాత్రం తగ్గలేదని ఇది ప్రైవేట్ మెడికల్ కళాశాల యాజమాన్యం గుర్తించాలని అన్నారు. తమకు ఉపకార వేతనాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



# కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి

**మాగనూర్, జూన్ 16 (జనం సాక్షి) :** :కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీజేపీ శాఖ ఇచ్చిన పిలుపుమేరకు రచ్చబండ కార్యక్రమం ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లే నర్సప్ప అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికసి త్ బారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన 11 సంవత్సరాల కాలంలో గ్రామస్థాయిలో అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు.అందులో భాగంగా మహిళలకు ఉజ్వల పథకం కింద సిలిండర్లు మహిళల ఆత్మగౌరవం కాపాడ విధంగా మరుగుదొడ్ల నిర్మాణము పుట్టిన బిడ్డకు సుకన్య సమృద్ధి యోజన అదే విధంగా గరీబ్ కళ్యాణ్ అన్న యేజన కింద ఉచిత బియ్యం పంపిణీ రైతుల సుభిక్షం కోసం కిసాన్ సామాన్ నిధి కింద ప్రతి రైతుకు సంవత్సరానికి ఆర్థిక సహాయం కీంద 6 వేల రూపాయలు అందిస్తున్నారనీ అన్నారు. అదేవిధంగా రైతులు



పండిం చిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇవ్వడం, రైతులకు 50 శాతం సబ్సిడీ కింద యూరియా, డిఏపి ఎరువుల పంపిణీ చేస్తున్నారని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సిసి రోడ్లు స్ట్రీట్ లైట్లు గ్రామా గ్రామాల్లో జరుగుతున్న వని, ఉపాధి హామీ పథకంలో అనేకమందికి పని కల్పించి వారికి జీవనోపాధి కల్పించడం జరిగిందనీ, రహదారులు నిర్మాణంఇలా అనేక కార్యక్రమాలు ఈ 11 సంవత్సరాల కాలంలో నిర్వర్తించి ప్రపంచానికే ఆదర్శవంతంగా నరేంద్ర మోడీ నిలిపారాన్నరు.బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గడపగడపకు తీసుకుపోయి పార్టీని మరింత పటిష్టం చేయవలసిన బాధ్యత ప్రతి కార్యకర్త పైన ఉందని అన్నారు. అదేవిదంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎండగడుతూ బీజేపీని బలపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, మండల మాజీ అధ్యక్షులు జయానంద రెడ్డి, నారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కనకరాజు ,జిల్లా కౌన్సిల్ సభ్యులు వాకిటి మల్లేష్,స్థానిక తాజా మాజీ సర్పంచ్ కొత్తపల్లి తిమ్మప్ప ఆంజప్ప గౌడ,సీనియర్ నాయకులు లోకపల్లి హనుమంతు, సోమప్ప గౌడ, ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర అశోక్ గౌడ్ గారు డాక్టర్ కృష్ణయ్య,భరత్ కుమార్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ భూత అధ్యక్షులు అశోక్ భీమప్ప సీనియర్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## భూ భారతితోనే భూ సమస్యలకు పరిష్కారం

- చేర్యాల తహశీల్దార్ దిలీప్ నాయక్



**చేర్యాల, జూన్ 16 (జనంసాక్షి) :** భూభారతితోనే భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని చేర్యాల తహశీల్దార్ దిలీప్ నాయక్ అన్నారు. సోమవారం చేర్యాల మండలం కడవేర్గు గ్రామంలో భూభారతి కార్యక్రమానికి చేర్యాల తహశీల్దార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతుల దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూమి సమస్యలు ఉన్నా రైతులన భూ భారతిలో దరఖాస్తు చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరుట్ల వినీత్, తాళ్ళపల్లి రమేష్, బాగోతం బాలచంద్రం, చల్ల నరసింహ రెడ్డి, ఇప్పల శ్రీను, గదరాజు నరేష్, జంగ శివ, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీరంగూడ గుట్టపై అక్రమాలను నివారించండి



**అమీన్‌పూర్, జూన్ 16 (జనం సాక్షి) :** అమీన్పూర్ పట్టణంలోని బీరంగూడ గుట్టపై అక్రమంగా జరుగుతున్న మట్టి డంపింగ్, బండరాల వ్యాపారాన్ని అరికట్టాలని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ కలెక్టర్ ప్రావీణ్య ను కోరారు. సోమవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరంగూడ గుట్టపై ఆలయ పరిసరాల్లో అక్రమంగా మట్టి డంపింగ్ చేసి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. సెల్లార్ గుంతల నుంచి పెద్దపెద్ద బండరాలను తీసుకుని వచ్చి గుట్టపైన వేస్తున్నారన్నారు. దాంతో ఆలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. స్థానికంగా ఎన్నిసార్లు చెప్పినా అక్రమార్కులు వినడం లేదన్నారు. అధికారులు వెంటనే అక్రమ వ్యాపారాలను ఆపి భక్తుల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

# యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ సురేష్ చౌహాన్

**జడ్చర్ల, జూన్ 16 (జనం సాక్షి) :** యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా ఆయుష్ శాఖ ప్రోగ్రాం డాక్టర్ సురేష్ చౌహాన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ చౌహాన్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం యోగ వాక్ ను నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ స్టేడియం నుండి తెలంగాణ చౌరస్తా స్పోర్ట్స్ స్టేడియం వరకు నిర్వహించిన యోగ వాక్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.పి వెంకటేష్ లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక శారీరిక రుగ్మతలకు గురవుతున్నారని, అందుకు ప్రతి ఒక్కరూ యోగ సాధన తో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని, జూన్ 21న జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవంలో అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. యోగా వాక్‌లో ఆయుష్ శాఖ, రిటైర్డ్ ఉద్యోగులు, ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగులు, విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు పెద్ద




ఎత్తున పాల్గొన్నారు. యోగా వాక్‌లో ఎల్.డి.ఎం. కల్వ భాస్కర్, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, డిప్యూటీ డి.ఎం.హెచ్. ఓ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఐ.ఎం. ఏ అధ్యక్షులు డా. రాంమోహన్, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ లు డా.ఎం.చంద్ర శేఖర్, డా.శ్రీమతి రూత్, డా పహీం, డా.ఆది శేషయ్య, డా.కే రాజేందర్, పతంజలి యోగ సమితి అధ్యక్షులు కె.వెంకట రాముడు, యోగా ట్రైనర్ మహిపాల్ రెడ్డి, ఎల్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

- నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ రాజిరెడ్డి



**శివ్వంపేట, జూన్ 16 (జనంసాక్షి) :** అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి స్పష్టం చేశారు. శివ్వంపేట మండలం రూప్లా తండాలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా ఆధ్వర్యంలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్ల కోసం ఎదురు చూడవద్దని, పేదవాడు సొంతింటి కలను సాకారం చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంపికైన లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఈ ప్రజాప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో అన్యాయం, అవినీతి, కర్కశత్వాలు రాజ్యమేలాయని, నాడు బిఆర్ఎస్ చేయలేని సంక్షేమ పథకాలను నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్ రాం రెడ్డి, వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల కరుణాకర్ రెడ్డి, మండల పార్టీ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా, లక్ష్మీ కాంతారావు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, కమలా పుల్ సింగ్, నాయకులు వారాల గణేష్, రాఘవరెడ్డి, యువ నాయకులు బుర్ర మురళి గౌడ్, పెద్దపులి సతీష్, పార్టీ మండల ఎస్టి సెల్ అధ్యక్షులు తిరుపతి రాథోడ్, నాయకులు, దుర్గ నాయక్, వంజరి గౌరీశంకర్, ఇసు గారి అరుణ్, ఈసారపు రాజు గౌడ్, నారాయణ, సారా శివరామ గౌడ్, సోను తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

- మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, జూన్ 16 (జనం సాక్షి) :** మండల పరిధిలోని కోడుగల్ గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం అయింది. మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సతీమణి కీర్తిశేషులు శ్వేతా రెడ్డి జ్ఞాపకార్థం కోడుగల్ గ్రామంలో ఏనుగొండ ఎస్.వి.ఎస్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 450 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 16 మందికి కంటి శుక్లాల చికిత్స నిమిత్తం వారిని గుర్తించి, ఆస్పత్రికి వచ్చి శుక్లాల చికిత్స చేసుకోవాలని సూచించారు. గంగాపూర్ యు.పి.హెచ్.సి డాక్టర్ ప్రతాప్ చౌహన్ కోడుగల్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్ నిర్వహించి వంద మందికి క్షయ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, నాయకులు శ్రీకాంత్, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

# పేద ప్రజల అండగా ప్రజా ప్రభుత్వం

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకూల రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి జూన్ 16 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల కు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని నాగర్కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు కారుకొండ, వట్టెం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారెంటీలు అమలు చేసిన ఘనత ప్రజ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రజా ప్రభుత్వంలో ఇండ్లు ఇచ్చి వారిని ఆదుకుంటామని ఆయన అన్నారు. రాష్ట్రంలోని పేదలను ఆదుకున్న ప్రభుత్వం ఏదైనా ఉంది అని అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటేనని గుర్తు చేశారు. రాబోయే రోజులలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుదాం అని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుకు సాగుతూ ఉందని ఆయన అన్నారు అదేవిధంగా రాబోయే రోజులలో అనేక సంక్షేమా పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మిద్దె రాములు, ఎంపీడీవో కథలప్ప, ఎంపీవో మహేష్, హౌసింగ్ ఏఈ, అమృత్ రెడ్డి, వెంకటస్వామి, దాసర్ల సైదులు, మాజీ ఎంపిటిసి అంజి, తిరుపతయ్య, తిరుపతయ్య, పండ్లపాష, వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్, నజీర్, సూరి, ఈశ్వర్, ఎర్ర రాములు, కోటయ్య, శ్రీనివాస్ గౌడ్, ఖలీల్, బాలరాజ్, బాలస్వామి, శ్రీశైలం, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను ఆపి శాంతి చర్చలు జరపాలి




**వనపర్తి టౌన్, జూన్ 16 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణ హెూమాన్ని ఆపి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. అడవుల్లో కాల్పులను విరమించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని రేపు హైదరాబాద్ ఇందిరా పార్క్ లో నిర్వహించనున్న మహా ధర్నా గోడపత్రికలను విడుదల చేశారు. మాట్లాడుతూ అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టి అందుకు అడవుల్లో ఉన్న మావోయిస్టులను ఆదివాసీలు గిరిజనులను తరిమి వేసేందుకే కేంద్రం ఆపరేషన్ కగారును చేపట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా నేడు ఇందిరా పార్క్‌లో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మహా ధర్నా జరుగుతోందని, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పృథ్వి నాదం, నేతలు శిరీష, జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి



**సంగారెడ్డి టౌన్, జూన్ 16 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులకు సూచించారు. ఐసిసి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 63 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ తెలిపారు. అందులో రెవెన్యూ 15 ,పౌరా సరఫరాల శాఖ 2, మార్క్ ఫెడ్ 1, సర్వే ల్యాండ్ 9, పంచాయతీ పి.టి. విభాగం 4, పంచాయతీ రాజ్ 2, డిఆర్‌డిఓ 4, మున్సిపల్ 9, వెల్ఫేర్ డిపార్ట్మెంట్ 10, విద్యాశాఖ 2 జిల్లా యువజన సంక్షేమ శాఖ 1, వ్యవసాయ శాఖ 4, ఉన్నాయన్నారు. మొత్తం 63 అందాయని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అదనపు కలెక్టర్ మాధురి డి ఆర్ ఓ పద్మజ రాణి ఆర్‌డిఓలు ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి

- మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు



**అమీన్‌పూర్, జూన్ 16 (జనం సాక్షి) :** రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు అన్నారు. సోమవారం రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలోని వెలిమెల, ఈదుల నాగులపల్లి రైల్వే గేట్ ను ఎంపీ రఘునందన్ రావు ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారుల విస్తరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈదుల నాగులపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఎండిఏ సమస్యల పరిష్కారానికి త్వరలోనే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు రాంబాబు గౌడ్, మాజీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలు, నాణ్యమైన విద్య

- సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు అందే అశోక్
- ఆకునూరు జడ్పీహెచ్ఎస్‌లో తన కుమారుడు చేరిక

**చేర్యాల, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుందని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అన్నారు. ఆయన కుమారుడు అశ్వంత్ ను సోమవారం ఆకునూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ 6వ తరగతిలో చేర్పించారు. వారిని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా నిరుపేద తల్లిదండ్రులు సైతం వారికి ఎంత కష్టమొచ్చినా తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని లక్షల్లో ఫీజులు కట్టి మరీ ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని, కానీ ప్రభుత్వ ఉపాధ్యాయులు




ఎంతో కష్టపడి ఉన్నత విద్యలు చదివి ఉద్యోగాలు పొంది అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఖర్చులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. త్రాగునీరు, మరుగుదొడ్లు సకల సౌకర్యాలు కల్పించడంతోపాటు విద్యార్థులకు మంచి విద్యను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆలోచన చేసి సర్కారు బడిలో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, అశోక్, సత్యనారాయణ, శ్రీశైలం, కవిత, పాషా, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు,రవీందర్, సంతోష్ రెడ్డి, శోభారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు సూర సంపత్, అమరగొండ అయ్యల్లం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు

- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ ప్రతినిధి, జూన్ 16 (జనం సాక్షి):** పేదవారి ఆత్మగౌరవ ప్రతిక సొంత ఇల్లు అని, వారి కలలను సాకారం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ నగరంలోని ఓ సిటీ లోని మంత్రి క్యాంప్ కార్యాలయ ఆవరణలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఉత్తర్వుల జారీ చేసే కార్యక్రమంలో మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్పాయ్ , మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావులతో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ లో అందిస్తామని పేదవారికి అందజేయలేదని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రతి నిరుపేద బిడ్డకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేస్తూ, ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదవారి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రాష్ట్రంలో కోట్ల రూపాయలు వెచ్చించి 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధికి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు.వరంగల్ తూర్పు నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అందులో 1659 ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వుల పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్టు తెలిపారు. మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. అత్యంత నిరుపేద అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా ప్రభుత్వం పారదర్శకంగా పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంజూరి పత్రాలు స్వీకరించిన లబ్ధిదారులు త్వరగా ఇళ్ళను నిర్మించుకొని గృహ ప్రవేశానికి ఆహ్వానించాలని మంత్రి కోరారు. నగరంలో స్లమ్ ప్రాంతాల్లో గుడిసెలు నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని ఇంచార్జ్ మంత్రిని కోరగా లేఅవుట్ ప్రతిపాదన సిద్ధం చేయాలని కలెక్టర్లకు ఆదేశించారని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ కలలను సాకారం చేసి ఇందిరమ్మ రాజ్యాన్ని తేవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షా అని అన్నారు. నిరుపేదలు గుడిసెలలో, అద్దెకు ఉంటూ సుదీర్ఘ కాలంగా ఇండ్ల నిర్మాణాలకు వేచిచూస్తున్నారని, వారి కలలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తున్నదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం నిరంతరమని, ఇల్లు రాని నిరుపేదలు నిరుత్సాహపడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతినిరుపేదకు తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి సంక్షేమాన్ని జోడుగుర్రాల ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇల్లు మంజూరు చేస్తామని, పథకం అమలులో ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ ఇల్లు నిర్మించుకోవాలని, విడతల వారీగా మూడు విడతల్లో లబ్ధిదారుని ఖాతాలో నేరుగా 5 లక్షల రూపాయలు జమ అవుతాయని తెలిపారు. నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. లబ్ధిదారుల కేవలం రవాణా చార్జీలు మాత్రమే భరించాల్సి ఉంటుందన్నారు. ఇది నిర్మాణ వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తూ ఉందని, తద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఇంచార్జ్ మంత్రి, మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు వరంగల్ నగరంలో స్లం ఏరియాస్ లో ఉన్న గుడిసె వాసులకు ఇండ్ల పట్టాల మంజూరు నేపథ్యంలో లేఅవుట్ చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ లబ్ధిదారులు త్వరగా గృహాలను నిర్మించుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురలీధర్ రావు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రతి పేదవానికి ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. వరంగల్ పట్టణంలో లెనిన్ నగర్, బిఆర్‌నగర్ తదితర స్లమ్ ఏరియాలలో గుడిసెలలో నివసిస్తున్న పేదవారికి పట్టాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, కార్పొరేటర్లు వస్కుల బాబు, సోమిశెట్టి ప్రవీణ్ పల్లం పద్మ ముష్కమల్ల అరుణ చింతాకుల అనిల్ కుమార్ భోగి సువర్ణ పోశాల పద్మ కావేటి కవిత బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్ గుండు చందన పూర్ణ చందర్ ఓని స్వర్ణ లత పూర్కాన్ బాల్నే సురేష్ బస్వరాజు కుమార స్వామి సురేష్ జోషి ఇందిరమ్మ ఇళ్ల జిల్లా నోడల్ అధికారి రామీ రెడ్డి, పిడి హౌజింగ్ గణపతి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి ఆర్ డి ఓ సత్య పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు అండగా 'ఇందిరమ్మ' పాలన

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**రేగొండ(కొత్తపల్లిగోరి),జూన్ 16(జనం సాక్షి):** పేదలకు అండగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.సోమవారం భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంతో పాటు సుల్తాన్ పూర్, వెంకటేశ్వర్లపల్లి, కోనరావుపేట, కొత్తపల్లి(కే), నిజాంపల్లి,రాజక్కపల్లి, చిన్నకోడెపాక గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలను జిల్లా అదనపు కలెక్టర్,జడ్పీ సీఈవో విజయలక్ష్మీ, జిల్లా హౌసింగ్ పీడీ లోకీలాల్, ఎంపీడీఓ, ఎమ్మార్వో లతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై మంజూరీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా వేంకటేశ్వర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుడైన పాలకుర్తి తిరుపతి - స్వప్నల ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టెంకాయ కొట్టి, మట్టి తీసి నిర్మాణ పనులను మొదలుపెట్టారు. అనంతరం సుల్తాన్ పూర్, కొత్తపల్లి(కే) గ్రామాలల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రాజక్కపల్లి, చిన్నకోడెపాక గ్రామాలల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపల్లిగోరిలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య నాయకులు విజ్ఞాన్ రావు, పత్తి ప్రభాకర్యు,యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులు

- పట్టణంలో కొనసాగుతున్న ప్రైవేటు ఫైనాన్స్‌ల దోపిడీ

**ఖానాపూర్ జూన్ 16 (జనం సాక్షి) :** నియోజకవర్గ కేంద్రంలోని చిరు వ్యాపారులే లక్ష్యంగా పెట్టుకుని కొందరు ధనార్జనే ధ్యేయంగా ఇష్టారీతిలో వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నారు. చిరు వ్యాపారుల అవసరాలను ఆసరాగా తీసుకొని ఇదే అదునుగా అందినంత లాక్కొని పైసకు పైసా వడ్డీ రూపంలో వసూలు చేస్తున్నారు. కాదు కూడదు అంటే వ్యాపార కేంద్రానికి తాళం వేసి మరి పట్టిపీడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం పై పలువురు చర్చించుకుంటున్నారు. కాగా ఇటీవల శివాజీ నగర్ కాలనీకి చెందిన సింగు నరసయ్య స్థానికంగా ఉంటున్న ఒక వడ్డీ వ్యాపారి వద్ద తన అవసరానికి 20 వేల రూపాయలు వడ్డీకి తీసుకున్నాడు. తీసుకున్న రూపాయల నుండి 12 వేల రూపాయలు నగదు చెల్లించి మిగతా డబ్బులు తన వ్యాపారం సరిగా నడవకపోవడంతో చెల్లించడంలో జాప్యం జరిగినట్లు సింగు నరసయ్య తెలిపారు. జరిగిన జాప్యాన్ని వడ్డీ రూపంలోకి మార్చుకున్న సదరు వడ్డీ వ్యాపారి చెల్లించిన 12 వేల రూపాయలు వడ్డీ కిందికే కట్ చేస్తాను ఇంకా మిగతా అసలు 20 వేల రూపాయలు చెల్లించాలని భీష్మించుకు కూర్చున్నాడు. అది పోను చిరు వ్యాపారం దర్జీ పని చేస్తున్న సింగు నరసయ్య వద్దకు వెళ్లి నానా రభస చేసి దర్జీ దుకాణానికి తాళం వేసినట్లు సింగు నరసయ్య తెలిపారు. చేసేది ఏమీ లేక స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించనున్నట్లు సింగు నరసయ్య తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు ఖానాపూర్ పట్టణంలో చిరు వ్యాపారులే లక్ష్యంగా పెట్టుకొని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా వడ్డీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్న పలువురిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీవి దొంగ హామీలు

- రాబోయేది బిజెపి ప్రభుత్వమే...
- మాజీ ఎంపీ సీతరాం నాయక్...



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 16 (జనం సాక్షి):** భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి 11 ఏళ్ల పాలనపై గూడూరు మండల కేంద్రంలో గూడూరు మండల అధ్యక్షులు వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మోసపూరిత పాలన నడుస్తుందని 2023 ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అములు చేయాలనీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పొలిటికల్ చేస్తున్నారని వారు మండిపడ్డారు, నిజంగా రేవంత్ రెడ్డి కి ప్రజలపట్ల చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను నెరవేర్చి ఎన్నికలకు రావాలని అన్నారు రైతుబంధు కోసం రైతు ఎదురుచూస్తున్నారని రేవంత్ రెడ్డి మహిళాలకు ఇస్తామన్న 2500 కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని దుయ్యాబట్టారు గిరిజన నియోజవర్గాలల్లో రోడ్డు సౌకర్యం లేక గిరిజన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ప్రారంభించి గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించింది అప్పటి ప్రధాని వాజ్పేయి గారి ప్రభుత్వమని గిరిజన యూనివర్సిటీలలో గిరిజనులకు కేవలం ఏడు శాతం మాత్రమే సీట్లు కేటాయించినప్పుడు అది గిరిజన యూనివర్సిటీ ఎలా అవుతుంది గిరిజన విద్యార్థులు బహుజన వర్గాల పిల్లల భావితరాల భవిష్యత్తును మార్చాలనే లక్ష్యంతో ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించింది వాజ్పేయి గారని గుర్తుచేశారు ప్రజా సంక్షేమం కోసం పనిచేసే పార్టీ భారతీయ జనతా పార్టీ అని స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇస్తే గ్రామాల నుంచే అభివృద్ధిని ప్రారంబిస్తామని వారు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు గిరిజన ముర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోతు రాంబాబు గూడూరు మాజీ జెడ్పిటిసి ధర్మారెడ్డి మాజీ ఎంపీపీ చెల్పురి వెంకన్న మాజీ సర్పంచ్ మోతిలాల్ మాజీ ఎంపీటీసీ సోము నాయక్ మాజీ సర్పంచ్లు భవుసింగ్ విజయ రెడ్డి కొమ్మలు సీనియర్ నాయకులు శ్రీశైలం మల్లన్న దేవేందర్ తదితరులు నాయకులు పాల్గొనారు



## గిరిజన దర్బార్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్ర మిశ్రా

**ఏటూరునాగారం, జూన్ 16(జనంసాక్షి) :** సోమవారం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్ర ఆదేశించారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు 25 దరఖాస్తులు చిత్ర మిశ్ర కి స్వయంగా గిరిజనులు సమర్పించారు. ఈ కార్యక్రమం లో జె వసంత రావు అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఎం రాజ్ కుమార్ పరిపాలన అధికారి (ఏఓ), క్రాంతి కుమార్ డిప్యూటి డిఎంహెచ్ఓ, ఏ అనిల్ డిప్యూటి తహసిల్దార్ ఎస్డీసి, ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆర్ఐటిఐ ఏటూరునాగారం, కె.వాని డిఎం జిసిసి ఏటూరునాగారం, సంబందిత అధికారులు గ్రీవెన్స్ సెల్ లో పాల్గొన్నారు.

## పాఠశాల గేటుకు తాళం

- బిల్లుల జాప్యంపై కాంట్రాక్టర్ ఆగ్రహం



**ఖానాపూర్ జోన్ 16 (జనం సాక్షి) :** మండలంలోని రాజురా ప్రభుత్వ పాఠశాల గేటుకు తాళం వేసి కాంట్రాక్టర్ గడ్డం శ్రీనివాస్ నిరసన తెలిపారు. సోమవారం పాఠశాల సమయంలో పాఠశాల గేటుకు తాళం వేసి తను చేపట్టిన అభివృద్ధి పనులు నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల మరమ్మత్తులకు 40 లక్షల రూపాయలు వెచ్చించానని వాపోయాడు. సంవత్సరాల కాలం గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తాను చేసిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని తన నిధులు తనకు విడుదల చేయడం లేదని వాపోయారు. ప్రభుత్వం 40 లక్షల నిధులు విడుదల చేసే వరకు కదిలే ప్రసక్తే లేదని పాఠశాలలోకి ఎవరు వెళ్లే ప్రసక్తి లేదని పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకుంటానని భీష్మించుకు కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న పెంబి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కాంట్రాక్టర్ కు నచ్చజెప్పి పాఠశాల గేటు తాళం తీయించి నిరసన విరమింప చేశారు.

## మేడిపెల్లి, తాండ్రకు బస్సు సౌకర్యం

**నిర్మల్ రూరల్, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రయాణికుల చిరకాల కోరికగా మిగిలిపోయిన అనంతపేట, నీలాయిపేట, మేడిపెల్లి,బూర్గుపెల్లి, మొండిగుట్ట, తాండ్ర గ్రామాలకు పల్లెవెలుగు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే పందరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు నిర్మల్ నుండి ఉదయం 07.20 నిమిషాలకు బయలుదేరి 08.05 నిమిషాలకు తాండ్రకు చేరుకుంటుంది.తిరిగి 08.20 తాండ్రనుండి బయలుదేరి 09.05 నిమిషాలకు నిర్మల్ చేరుకుంటుంది.తిరిగి సాయంత్రం నిర్మల్ నుండి 04.50 నిమిషాలకు తాండ్ర వెళుతుంది. ఈ సదవకాశాన్ని గ్రామ ప్రజలు, విద్యార్థులు సద్వినియోగ పరచుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా నూరు శాతం మొక్కలు నాటాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జూన్ 16(,జనంసాక్షి)** జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన వన మహోత్సవం జిల్లా స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విరివిగా పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 69,55,268 మొక్కల నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఇప్పటికే అన్ని శాఖలకు టార్గెట్‌లు కేటాయించామని, ప్రతి శాఖ లక్ష్యం మేరకు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్లు, పాఠశాలలు, కార్యాలయాలు, రహదారుల ఇరువైపులా, ఇరిగేషన్ కాలువల వెంబడి ఖాళీ ప్రదేశాలను గుర్తించి విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటేందుకు ముందస్తు చర్యలు తీసుకొని, సమీప నర్సరీల నుంచి అవసరమైన మొక్కలు సమకూర్చుకోవాలి అన్నారు. నాటిన ప్రతి మొక్కకు కంచె లేదా ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి వారం బుధవారం, శుక్రవారం రోజుల్లో మన ఊరూ – మన పచ్చదనం ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా 8089 ఇళ్లకు ఆమోదం లభించిందని తెలిపారు. త్వరితగతిన మార్కౌట్ పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు వందశాతం యూనిఫాంలు పంపిణీ చేయాలని, ప్రతి విద్యార్థి యూనిఫాంలోనే స్కూల్‌కి హాజరు కావాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, డ్రై డే యాక్టివిటీలు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జిల్లా అటవీ సంరక్షణ అధికారి నాగిని బాను, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటు ఆవశ్యకతపై లఘుచిత్రం

- లోగో ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో పిడుగు పాట్లు అధికం అవ్వడం, వాటి పట్ల మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో పిడుగు పాటు నుంచి ఎలా రక్షించుకోవడం, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. అనే అంశంపై సోమవారం లఘు చిత్రం లోగోను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో లఘు చిత్రం లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ కారుమబ్బులు కమ్ముకుని.. భారీ శబ్దాలతో ఉరుములు.. కళ్లు మిరుమిట్లు గొలిపే మెరుపులు వస్తున్నాయంటే పిడుగులు పడతాయని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పిడుగుపాటుకు ఎన్నో పశువులు, ఎంతోమంది మనుషులు మరణిస్తున్నారని, ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో, చెట్లకింద ఉన్నవారే ఈ పిడుగుపాటుకు గురవుతున్నట్లు పలు ఘటనల ద్వారా తేటతెల్లమవుతుందన్నారు. పిడుగుల బారి నుంచి రక్షణ కోసం కొన్ని జాగ్రత్తలు బయట ఉండకూడదు. ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. లోహపు వస్తువులను చేతిలో పట్టుకోవడం మంచిది కాదు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండకూడదు పిడుగులు చెట్లపై లేదా విద్యుత్ స్తంభాల దగ్గర పడే అవకాశం ఉంది, కాబట్టి వాటికి దూరంగా ఉండాలి. నీటిలో ఉండకూడదు ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు నదుల్లో, వాగుల్లో, చెరువుల్లో స్నానం చేయడం మంచిది కాదు. భూమి మీద అరికాళ్లు పూర్తిగా పెట్టకుండా వేళ్ల మీద కూర్చోవాలి. పిడుగు పడినప్పుడు విద్యుత్ ప్రభావం తక్కువగా పడే అవకాశం ఉంటుంది. ముడుచుకుని కూర్చోవాలి. మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చోవడం వల్ల పిడుగు పడినప్పుడు వెలువడే విద్యుత్ ప్రభావం తక్కువగా ఉంటుంది. ల్యాండ్ ఫోన్ మాట్లాడకుడదు. సెల్ ఫోన్ వినియోగించవచ్చు (అది కూడ ఇంట్లో ఉన్నపుడు మాత్రమే). స్విచ్ బోర్డ్ నుండి అన్ని కనెక్షన్లు తీసివేయాలి. షవర్ క్రింద స్నానం, చేతులు, గిన్నెలు కడగడం వంటివి చేయకూడదు. ఇంటి తలుపులు, కిటికీల వద్ద నిలబడకుడదు. ఎక్కువగా పిడుగుపాటుకు వ్యవసాయ పనులు చేసే రైతులు, ఆరు బయట పనిచేసే భవన కార్మికులు , నీటి గొట్టాలు బిగించే వారు , విద్యుత్ టవర్ల వద్ద పనిచేసే వారు, వాహనదారులు, పాదచారులు పిడుగుపాటుకు ఎక్కువగా గురవుతున్నారని పైన తెలిపిన కొన్ని జాగ్రత్తలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ప్రజలను కోరారు.

## ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూన్ 16(జనంసాక్షి):** ప్రజావాణి లో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జడ్పీ సీఈఓ రామి రెడ్డి, డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, హౌజింగ్ పిడి గణపతిలతో కలసి ప్రజావాణి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ రకాల సమస్యల సంబంధించిన 127 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.రెవెన్యూ శాఖ 51, పిడి హౌసింగ్ 12, జి డబ్ల్యూ యం సి వరంగల్ 13 దరఖాస్తులు రాగా మిగత వివిధ శాఖలకు సంబంధించినవి 51 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలను పరిష్కరించాలని, సమస్య పరిష్కరించలేని సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని దరఖాస్తుదారునికి అర్థం అయ్యేలా చెప్పాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నిర్వహించిన గ్రీవెన్స్ లో స్వీకరించిన మొత్తం 11,221 దరఖాస్తులలో 10,349 దరఖాస్తులు పరిష్కరించగా 872 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వారిని కూడా త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, డిపిఓ కల్పన డిఎంహెచ్ఓ సాంబశివరావు, డీఈవో జ్ఞానేశ్వర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కదం తొక్కిన మోర్తాడ్ గ్రామస్తులు

- జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో..
- 24 గంటల్లో న్యాయం చేస్తానని సీఐ హామీ



**ఆర్మూర్, జూన్ 16 (జనం సాక్షి) :** ఆర్మూర్ డివిజన్ పరిధిలోని మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన రొయ్యల సురేష్‌పై జరిగిన దాడికి నిరసనగా మోర్తాడ్ గ్రామస్తులు పెద్ద ఎత్తున ర్యాలీగా కదిలారు. ఒక వర్గానికి చెందిన యువకులు అకారణంగా దాడి చేయడాన్ని ఖండించారు. పోలీసులు కేవలం ఆరుగురిని అరెస్టు చేయడం, మిగతా నిందితులను తప్పించారని మోర్తాడ్ కుల సంఘాలు,గ్రామస్తులు సోమవారం 63 వ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు, గ్రామస్తుల మధ్య కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.మిగతా నిందితులను కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.పరిస్థితులు ఉద్రిక్తతకు దారి తీయగా సీఐ పొన్నం సత్యనారాయణ చొరవ తీసుకొని గ్రామస్తులతో మాట్లాడారు.24 గంటల్లో మిగతా నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని చెప్పారు. మోర్తాడ్ మండల కేంద్రంగా కారిడార్ సెర్చ్,ఆధార్ కార్డు వివరాలను సేకరిస్తామన్నారు. రాత్రి 10 గంటల తర్వాత గుంపులుగా తిరగరాదన్న నిబంధనను, పరిధిలోని షాపులను మూసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా చూస్తామని హామీ ఇచ్చారు.సీఐ హామీతో గ్రామస్తులు పాక్షికంగా రాస్తారోకోను విరమించారు.రాస్తారోకో కారణంగా జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాడి పాల్పడిన మిగతా నిందితులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

## మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తీవ్రమైన పోటీ

- రేసులో.. రేగటి.. చింతకుంట్ల... దొంగరి .. నల్లు..
- గాంధీభవన్ కు చేరిన డజనుకు పైగా దరఖాస్తులు.. ఎవరికి వారే
- పదవిపై ధీమా...







**తుంగతుర్తి, జూన్ 16 (జనం సాక్షి) :** మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావడం ఎమ్మెల్యేగా మందుల సామేలు భారీ మెజార్టీతో గెలవడంతో మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవిని దక్కించుకోవడానికి తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో డజన్ మందికి పైగా మండల అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు ఎవరికి వారే పదవిని దక్కించుకోవడం కోసం ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఈనెల 17వ తేదీ లోపు గాంధీభవన్లో అందజేయాలని అఖిలభారత కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఇంచార్జ మీనాక్షి నటరాజన్ నేతలకు సూచించారు. దీంతో ఇప్పటికే మండలంలో దరఖాస్తు చేసుకున్న వివరాలు గాంధీ భవన్ కు వెళ్లినట్లు సమాచారం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం త్వరితగతిన మండల గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం దీంతో పార్టీ కోసం కృషి చేస్తున్న వివరాలు కూడా నేతలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత మండల పార్టీ అధ్యక్షుడు అన్నారం గ్రామానికి చెందిన దొంగరి గోవర్ధన్ ఎలాగైనా మళ్లీ పదవి దక్కించుకోవడం కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు ఈయన మాజీ మంత్రి దామోదర్ రెడ్డి అనుచరుడు కావడంతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యేకు సైతం సన్నిహితుడుగా ఉన్నారు గత ఎమ్మెల్యే ఎంపీ ఎలక్షన్లలో ఎమ్మెల్యే గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. అలాగే మరో బీసీ సామాజిక వర్గానికి చెందిన బంద రామారం గ్రామానికి చెందిన రేగటి రవి సైతం మండల అధ్యక్ష పదవి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు ఈయన సైతం మందుల సామేలు గెలుపు లో చురుకైన పాత్ర వహించి తన ప్రత్యేకతను చాటుకున్నారు ముఖ్యంగా గ్రామంలో ఎంపీటీసీ గా గెలిచి తన సొంత గ్రామంలో తన సొంత ఖర్చులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు అంతేకాక ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు మండలంలో అత్యధిక ఓట్లు గౌడ సామాజిక వర్గానికి చెందినవి కావడంతో ప్రస్తుతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. బీసీ నాయకుడిగా పనిచేస్తూ మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి. రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ చెవిటి వెంకన్న యాదవ్ తో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామెల్ కు కూడా ప్రత్యేక అనుచరుడిగా ఉంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చింతకుంట్ల వెంకన్న కూడా మండల అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు ఇది ఇలా ఉండగా ఎన్నికల అనంతరం టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్లో చేరిన సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నల్లు రామచంద్ర రెడ్డి కూడా అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు ఈయన కూడా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకొని పదవిని దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం ఇప్పటికే దరఖాస్తులు గాంధీభవన్ కు చేరాయి అక్కడ వడబోసి మండల అధ్యక్ష పదవి ఎంపిక చేస్తారు దీంతో ఎమ్మెల్యే అనుగ్రహం ఎవరిపై ఉందో వారికే మండల అధ్యక్ష పదవి వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నారు.

## పరిశుభ్రత, ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం

- చెత్త నిర్వహణపై ఫోకస్
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 16 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీలలో 100 రోజుల ప్రణాళిక రూపొందించిందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.సోమవారం సూర్యాపేట పట్టణంలోని 14వ వార్డులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, ఏలాంటి విపత్తులైనా ఎదుర్కొనే విధంగా పట్టణ ప్రాంతాలను నిర్మించే దిశగా ప్రతిరోజు ఒక చర్చ-ఒక మార్పు అనే నినాదంతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి ప్రజలే ముందు అనే విధానంతో స్థిరమైన పట్టణాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. మున్సిపాలిటీలో ఆదాయం పెంచుకోవడంతో పాటు అభివృద్ధి జరగాలని అన్నారు.ఇందులో మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, వివిధ శాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.మురుగు కాలువలు, నాలాలు, ఓపెన్, భూగర్భ డ్రైనేజీల్లో పూడికతీత పనులు, ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీలు శుభ్రం



చేయడంతోపాటు మ్యాన్ హోల్స్ గుర్తించి మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.నాళాల నిర్వహణను మెరుగుపర్చాలని అన్నారు.మున్సిపల్ రికార్డుల్లో ఉన్న తాగునీటి కనెక్షన్లతో పాటు కొత్త కనెక్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు.ఇంటి పన్ను తక్కువ మదింపు చేసిన ఆస్తులను, అసలు పన్ను వేయని ఆస్తులను భువన్ సర్వే ద్వారా గుర్తించి వాటిపై సరైన ఆస్తి పన్నును వసూలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ డీఈ సత్యారావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరెని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధారవత్ వీరన్న నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, వాటర్ సిబ్బంది సమ్మి, చెరుకు వేణు, జవాన్ శ్రీను,వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## హస్తకళల కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



**చౌటుప్పల్, జూన్ 16 (జనం సాక్షి) :** దండు మల్కాపురం (చౌటుప్పల్) భారతీయ ప్రాచీన హస్తకళలు అద్భుత మనీ ట్రైనీ ఐఏఎస్ అధికారులు అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం టెక్స్ టైల్ పార్కులోని మినీ క్రాఫ్ట్ హస్తకళల కేంద్రాన్ని ఐదు రాష్ట్రాలకు చెందిన సౌరబ్ శర్మ, సలోని చాబ్రా, హర్ష చౌదరి, కర్లాన్ చిగ్తి యాన్వి, కొయ్యడా ప్రణయ్ కుమార్ లు సందర్శించారు. భారతీయ ప్రాచీన హస్తకళలైనా బ్లాక్ ప్రింటింగ్ స్క్రీన్ ప్రింటింగ్ బాతిక్ ప్రింటింగ్, టై అండ్ డై పద్ధతిలో నూలు వస్త్రాలను తయారు చేసే పద్ధతిని పరిశీలించారు. తెలంగాణ క్యాడర్కు కేటాయించిన 2024 ట్రైనీ ఐఏఎస్ ల బృందం హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణలో తెలంగాణ దర్శన్‌లో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో ఇక్కడికి వచ్చారు.పర్యావరణానికి హాని కలగకుండా నూలుతో తయారైన వస్త్రాలపై, ప్రకృతి నుంచి సేకరించిన రంగులతో తయారైన వస్త్రాలు ధరించడం వల్ల ప్రజల ఆరోగ్యానికి సైతం మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు ప్రాచీన భారతీయ హస్తకళలకు పూర్వవైభవం తీసుకురావాలనే సంకల్పంతో టెక్స్టైల్ పార్కులో మిమి క్రాఫ్ట్ పేరుతో హస్తకళల కేంద్రాన్ని ప్రారంభించామని మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నామని ఈ కేంద్రం వ్యవస్థాపకుడు ఫ్యాషన్ డిజైనర్ కే కృష్ణమూర్తి వారికి వివరించారు. కేంద్ర నిర్వాహకురాలు పుష్పలత, మర్రి చెన్నారెడ్డి మానవ వరులు అభివృద్ధి సంస్థ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పెద్ద బోయిన, చేనేత జోలి శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రామ్ రెడ్డి, మల్కాపురం పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



**సంగారెడ్డి టౌన్ జూన్ 16 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పిసిసి ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన తోపాజి అనంత కిషన్ అన్నారు. సోమవారం హైదరాబాదులో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లాకు చెందిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహను పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన తోపాజీ అనంత కిషన్ కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. తనకు పిసిసి పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో కూడా పార్టీ పటిష్టతకు కృషి చేశానని, ఈసారి కూడా పార్టీ నిర్ణయం మేరకు నడుచుకుంటానని ఆయన పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కూడా తోపాజి అనంత కిషన్ కలిశారు. వారికి శాలువా తో సత్కరించారు. ఆయన వెంట సుధాకర్, గంగేరి శ్రీహరి ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణి కార్యక్రమానికి 102 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రజాభవన్- హైదరాబాద్,ప్రతి సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పెండింగ్ లో లేకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజాభవన్ హైదరాబాద్ నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మూడు రోజులలో పరిష్కారం చూపాలని, తదుపరి నివేదికలు అందజేయాలని ఆదేశించారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం పంపినట్లు తెలిపారు.ప్రజావాణిలో 102 దరఖాస్తులు వచ్చాయని వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపినట్లు చేసినట్లు తెలిపారు.ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల ఫిర్యాదులను స్వీకరించి త్వరితగతిన పరిష్కారం చేయడమేనని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి .రాంబాబు, డిఆర్డిఓ పిడి వివి అప్పారావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భారీ పోలీసుల మధ్య కూల్చివేతలు..

- 144 సెక్షన్ అమలు..




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతి, జూన్ 16 (జనంసాక్షి) :** వేములవాడ మూలవాగు నుండి రాజన్న ఆలయం వరకు రహదారి విస్తరణ పనులకు భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇండ్లు,కూల్చి వేశారు. భూ నిర్వాసితులకు రూ 47 కోట్లు మంజూరు కాగా 250 మంది భూ నిర్వాసితులకు గాను 80 మంది చెక్కులు తీసుకున్నారు. ఇండ్లు,దుకాణాలు ఖాళీ చేయాలని గత 15 రోజుల క్రితమే అధికారులు నోటీసులు జారీ చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసిన గడువు ముగియగానే ఆదివారం మున్సిపలు దుకాణాలు కూల్చి వేశారు. సోమవారం బ్రిడ్జి నుండి దేవాలయం వరకు రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నారు. 210 దుకాణాలు కూల్చివేసేందుకు 250 పోలీసుల భారీ బందోబస్తుతో కూల్చివేతలు చేపడుతున్నారు.బ్రిడ్జి నుండి దేవాలయం వరకు నష్టపరిహారం తీసుకున్న వారి 70 ఇళ్ళను ముందుగా తొలగిస్తున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం ఇక్కడ తిష్ట వేసి పనులు చేపడుతున్నారు. కూల్చివేత ప్రక్రియలో 15 జెసిబిలు నాలుగు కట్టర్ మిషన్లు, అంబులెన్స్లు,అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేశారు. నేడు కూడా కూల్చివేత పనులు నిర్వహిస్తామని ఆర్డిఓ రాధా బాయ్ తెలిపారు. వీటిలో 88 మంది ఇండ్లు, దుకాణాలకు హైకోర్టు నుండి స్టే ఆర్డర్ ఉన్నట్లు అధికారులు స్టే ఆర్డర్ ఉన్న ఇండ్లను, దుకాణాలను వదిలేసి మిగతా నిర్మాణాలను తొలగించే పనిలో అధికారులు నిర్మగ్నమయ్యారు. రోడ్ల విస్తరణలో భూనిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ 47 కోట్లు మంజూరు చేశారు. పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఆర్డీవో రాధాబాయ్ పరిశీలించారు. కూల్చివేత కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బి,వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.

## సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ ఆర్డీవో రమాదేవి



**పాపన్నపేట, జూన్ 16 (జనంసాక్షి) :** భూభారతి రెవెన్యూ సదస్సులను ఆయా గ్రామాల లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు.సోమవారం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన సదస్సు తీరును ఆమె పరిశీలించారు.స్వీకరించిన దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు.పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.ఈసందర్భంగా స్థానిక తహసీల్దార్ సతీష్ కుమార్,ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంలో జాప్యం చేయరాదు

- కమిషనర్ ఆర్‌వి కర్ణన్


**హైదరాబాద్ సిటీ, జూన్ 16 (జనంసాక్షి) :** ప్రజావాణి సందర్భంగా ప్రజల నుండి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయరాదని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో నగరం నలువైపుల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... గ్రేటర్ వ్యాప్తంగా తమ సమస్యలను తెలియజేయడానికి, ఫిర్యాదు అందజేసిన నేపథ్యంలో అధికారులు కూడా వారి విన్నవించిన సమస్యను బాధ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కారంలో సంబంధిత హెచ్ఓడి లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 74




ఫిర్యాదులు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ 35, ట్యాక్స్ సెక్షన్ 07, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలకు 05 చొప్పున, ఎలక్ట్రికల్ విభాగం 04, యుబిడి 03, హెల్త్, అడ్మినిస్ట్రేషన్, ట్రాన్స్ పోర్ట్ విభాగాలకు రెండు చొప్పున, ఎసి రెవెన్యూ, లేక్స్, యుసిడి, ప్రాజెక్ట్స్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బి, ఎసి లీగల్ చార్మినార్ జోన్ ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 2 ఫిర్యాదులు అందాయి.జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 91 ఫిర్యాదులు వచ్చాయి. అందులో కూకట్ పల్లి 47, శేరిలింగంపల్లి 18, సికింద్రాబాద్ 14, ఎల్బీనగర్ 07, చార్మినార్ 04, ఖైరతాబాద్ కి ఒక ఫిర్యాదు అందింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, యాదగిరి రావు, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, నళినీ పద్మావతి, గీతా రాధిక, మంగతాయారు, సిఇ రత్నాకర్, విజిలెన్స్ అడిషనల్ ఎస్ పి శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సి సి పి శ్రీనివాస్, ఆడిషనల్ సి సి పి లు వెంకన్న, గంగాధర్, ప్రదీప్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, యు బి డి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సి ఈ పనస రెడ్డి, హౌసింగ్ ఈ ఈ లు పివి రవీందర్, రాజేశ్వర రావు, అడ్వర్టైజ్మెంట్ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

# విపణి


## ఇక బ్యాంక్ బ్యాలెన్స్ చెకింగ్..
# పదే పదే కుదరదు



యూపీఐ లావాదేవీల విషయంలో కొత్త మార్పులు అమల్లోకి వచ్చాయి. యూపీఐ చెల్లింపులకు ప్రతిస్పందన సమయాన్ని 10 సెకన్లకు తగ్గిస్తూ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. దీంతో సోమవారం (జూన్ 16) నుండి యూపీఐ ద్వారా లావాదేవీలు మరింత వేగవంతం కానున్నాయి.యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్) అనేది మొబైల్ ఫోన్ల ద్వారా అంతర్-బ్యాంకు లావాదేవీలను సులభతరం చేయడానికి ఎన్‌పీసీఐ అభివృద్ధి చేసిన రియల్-టైమ్ చెల్లింపు వ్యవస్థ. ఎన్‌పీసీఐ ఇటీవలి సర్క్యులర్ ప్రకారం నగదు బదిలీ, స్టేటస్ చెక్స్, రివర్సల్స్‌తో సహా లావాదేవీలు ఇక 10 నుంచి 15 సెకన్లలో పూర్తవుతాయి. ఇంతకు ముందు దీనికి 30 సెకన్ల వరకూ సమయం పట్టేది. ఎన్‌పీసీఐ మరో సర్క్యులర్ ప్రకారం, వినియోగదారులు తమ యూపీఐ యాప్‌ల ద్వారా రోజుకు గరిష్టంగా 50 సార్లు మాత్రమే తమ బ్యాంక్ అకౌంట్ బ్యాలెన్స్‌ను చెక్ చేసుకోగలరు. ఇంతకు ముందు దీనిపై ఎలాంటి పరిమితి ఉండేది కాదు. రోజులో ఎన్ని సార్లైనా ఖాతా బ్యాలెన్స్ చెక్ చేసుకునే అవకాశం ఉండేది. సిస్టమ్ సామర్థ్యం, లోడ్‌ను సులభతరం చేయడానికి ఎన్‌పీసీఐ బ్యాలెన్స్ చెక్‌పై పరిమితి రోజులో ఎన్ని సార్లైనా ఖాతా బ్యాలెన్స్ చెక్ చేసుకునే అవకాశం ఉండేది. సిస్టమ్ సామర్థ్యం, లోడ్‌ను సులభతరం చేయడానికి ఎన్‌పీసీఐ బ్యాలెన్స్ చెక్‌పై పరిమితి విధించినట్లు తెలుస్తోంది.మే నెలలో యూపీఐ ద్వారా లావాదేవీల సంఖ్య 33 శాతం పెరిగి 1,868 కోట్లకు చేరుకోగా, వాటి విలువ 23 శాతం పెరిగి రూ.25.14 లక్షల కోట్లకు చేరింది. సరైన లబ్ధిదారునికి డబ్బు పంపుతున్నట్లు వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంపొందించడానికి, ప్రమాదాన్ని నివారించడానికి యూపీఐ యాప్‌లు లావాదేవీల కోసం అంతిమ లబ్ధిదారుని పేరును మాత్రమే ప్రదర్శించాలని ఎన్‌పీసీఐ ఇదివరకే ఆదేశించింది.

# స్థిరంగా సూచీలు

## ఆటుపోట్ల మధ్య స్టాక్ మార్కెట్లు..




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే సోమవారం స్థిరంగా కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 09:52 సమయానికి నిఫ్ట 13 పాయింట్లు లాభపడి 24,729కు చేరింది. సెన్సెక్స్ 47 పాయింట్లు పెరిగి 81,164 వద్ద ట్రేడవుతోంది.అమెరికా డాలర్ ఇండెక్స్ 98.32 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 75.08 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.42 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో నష్టాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 1.13 శాతం నష్టపోయింది. నాస్‌డాక్ 1.3 శాతం దిగజారింది. అనూహ్యంగా ఆర్‌బీఐ రెపో రేటును 0.5 శాతం తగ్గించడంతో తొలుత జోరందుకున్న దేశీ స్టాక్ మార్కెట్లు గత వారం చివర్లో డీలా పడ్డాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ భయాలు సెంటిమెంటును దెబ్బతీశాయి. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ఈ వారం సైతం మార్కెట్లపై ప్రభావం పడనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.మధ్యప్రాచ్యంలో ఆందోళనలు తలెత్తడంతో ఇప్పటికే ముడిచమురు ధరలు బలపడ్డాయి. వారాంతాన బ్రెంట్ చమురు బ్యారెల్ 78 డాలర్లను తాకగా.. పసిడికి డిమాండ్ పెరిగింది. విదేశీ మార్కెట్లో ఔన్స్ బంగారం 3450 డాలర్లను దాటేసింది. 3,500 డాలర్ల చరిత్రాత్మక గరిష్టంవైపు పరుగు తీస్తోంది. దీంతో ప్రధానంగా విదేశీ అంశాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్ల మధ్య కదలవచ్చని అంచనా వేశారు.

## కోతల రాయుళ్లకు ఇక వాతలు తప్పవు!



ఐటీఆర్ 1, ఐటీఆర్ 4లలో కొన్ని మార్పులు చేశారు. ఈ మార్పులన్నీ మీరు ఐటీఆర్ దాఖలు చేసే 2024-25 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తాయి. ఈ మార్పుల ప్రకారం క్లెయిం చేసే ప్రతి డిడక్షన్‌కి సంబంధించిన పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఇన్నాళ్లు డిడక్షన్ ఎంతో రాసిస్తే వదిలేసేవారు. ఇక నుంచి పూర్తి వివరాలు ఇవ్వాల్సిందే. దీని ప్రకారం ఒక్కొక్క డిడక్షన్, దానికి సంబంధించిన కాగితాలు/వివరాలు ఏమిటో తెలుసుకుందాం. మీ దగ్గర పూర్తి వివరాలు లేనిదే ఫారం నింపలేరు. ఇంటి అద్దె అలవెన్సు.. బేసిక్ జీతం. ఇంటి అద్దె అలవెన్సు ఎంత చేతికి వచ్చింది. మీరు అద్దె ఎంత చెల్లించారు. అద్దె ఎవరికి ఇచ్చారు. ఎలా ఇచ్చారు. అంటే నగదా..? బ్యాంకు ద్వారానా..? రశీదులు మొదలైనవి. 80 సీ.. ఇంతకుముందే తెలుసుకున్నాము. ఈ సెక్షన్ క్రింద ఎన్నో అంశాలున్నాయి. ముఖ్యంగా పాలసీ నెంబరు చెప్పాలి. అలాగే మిగతా ఇన్వెస్ట్‌మెంట్లకు, డాక్యుమెంటు ఐడెంటిఫికేషన్ నెంబరు రాయాలి. మిగతా వాటి గురించి ఇక్కడ ప్రస్తావించలేదు కానీ క్లెయిం చేసే ముందు కాగితాలు సిద్ధంగా పెట్టుకోవాలి. చెల్లింపు తేదీలు, అది ఏ సంవత్సరానికి సంబంధించినదో చాలా ముఖ్యం. ఈ సెక్షన్‌లో డిడక్షన్లు చెల్లింపు జరిగిన సంవత్సరంలోనే బెనిఫిట్ ఇస్తారు. 80 డీ.. ఇది మెడికల్ ఇన్సూరెన్స్‌కి సంబంధించినది. ఇన్సూరెన్స్ కంపెనీ పేరు, పాలసీ నెంబరు వివరాలు ఇవ్వాలి. 80 ఈ... ఇది విద్యా రుణానికి సంబంధించినది. ఏ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు..? లోన్ అకౌంటు నెంబరు.., మంజూరు తేది ..ఎంత రుణం తీసుకున్నారు.. ఇంకా ఎంత రుణం చెల్లించాలి .. ఇలా వివరాలన్నీ తెలియపరచాలి. 80 ఈఈ... ఇంటి కోసం రుణం తీసుకుంటే కొన్ని షరతులకు లోబడి రూ.50,000 డిడక్షన్ ఇస్తారు. ఈ రుణానికి సంబంధించి బ్యాంకు, లోన్ అకౌంటు నెంబరు, మంజూరు లెటర్ తేదీ, ఎంత రుణం తీసుకున్నారు..? ఇంకా ఎంత రుణం మిగిలి ఉంది. ఇవన్నీ వివరాలు చెప్పాలి.80 డీడీబీ... ఇది కొన్ని నిర్దేశిత జబ్బుల ట్రీట్‌మెంట్‌కి సంబంధించినది. ఆ నిర్దేశిత జాబితాలోంచి ఏ జబ్బు వచ్చింది? దానికైన ఖర్చు.., హాస్పిటల్‌కి చెల్లించిన మొత్తం ఎంత? తదితర పూర్తి వివరాలు తెలిపాలి.ఈ మార్పులతో అన్ని విషయాలు సేకరిస్తున్నారన్నమాట. ఒకప్పుడు మన మీద అభిమానం, నమ్మకం, మంచి విశ్వాసంతో మొత్తాన్ని తెలియజేయమనేవారు. అద్దె ఇంట్లో లేకుండా అద్దె క్లెయిమ్ చేసే ఉద్యోగస్తులు ఎందరో ఉన్నారు. భార్య భర్తలు ఒకే ఇంట్లో ఉంటూ ఇద్దరూ విడిగా వారి వారి అస్సెస్‌మెంట్లలో హెచ్‌ఆర్‌ఏ క్లెయింలు చేసే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' ఎంతోమందో చెప్పాలి




## జియోకి యూజర్ల గగ్గోలు




ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ రిలయన్స్ జియో నెట్‌వర్క్ సేవల్లో అంతరాయాలు తలెత్తాయి. ఇంటర్నెట్ కనెక్టివిటీ, మొబైల్ సిగ్నల్, జియో ఫైబర్ సేవలకు సంబంధించిన సమస్యల గురించి వేలాది మంది నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో జియో నెట్‌వర్క్ ద్వారా కాల్స్, ఇంటర్నెట్ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురైనట్లు అనేక మంది సోషల్ మీడియా వేదికగా నివేదిస్తున్నారు. ఇప్పటివరకు 12,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయని అంతరాయాల ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ తెలిపింది. ఇందులో ఎక్కువ ఫిర్యాదులు మొ బైల్ డేటా వైఫల్యాలకు సంబంధించినవే. 32 శాతం మంది యూజర్లు కాల్ సంబంధిత సమస్యలను నివేదించగా, 12 శాతం మంది వినియోగదారులు జియో ఫైబర్ సేవల్లో అంతరాయం కలిగినట్లు ఫిర్యాదు చేశారు.మధ్యాహ్నం 1:45 గంటలకు ఈ సమస్య ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఆ సమయానికి దాదాపు 400 మంది వినియోగదారులు జియో సేవలను యాక్సెస్ చేసేటప్పుడు సమస్యలను నివేదించారు. తర్వాత మధ్యాహ్నం 2:15 గంటలకు కేరళ, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి గణనీయమైన సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు తెలు స్తోంది. వినియోగదారుల ఫిర్యాదులు పెరుగుతున్నప్పటికీ, రిలయన్స్ జియో దీనిపై స్పందించలేదు.

## ఏఐఎఫ్ ఏయూఎం రూ.5.38 లక్షల కోట్లు
### 2024-25 క్యూ4లో 32 శాతం పెరుగుదల

ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలకు (ఏఐఎఫ్/ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్) ఆదరణ పెరుగుతోంది. వీటి నిర్వహణలోని ఆస్తులు 2025 మార్చి త్రైమాసికం చివరికి రూ.5.38 లక్షల కోట్లకు దూసుకెళ్లాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం చివరికి ఉన్న రూ.4.07లక్షల కోట్లతో పోల్చి చూస్తే 32 శాతం పెరిగినట్టు సెబీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధిక ధనవంతులు, ఫ్యామిలీ ఆఫీస్‌ల అసెట్ అలోకేషన్‌లో (పెట్టుబడుల కేటాయింపులు) స్పష్టమైన మార్పును ఈ గణంకాలు సూచిస్తున్నాయి. ఈక్విటీ మార్కెట్లో అస్థిరతలు పెరిగిపోవడం, అంతర్జాతీయంగా స్థూల ఆర్థిక పరిస్థితుల్లో మార్పు నేపథ్యంలో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను మరింత వైవిధ్యం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వడమే ఏఐఎఫ్ ఆస్తుల వృద్ధికి దోహదపడినట్టు పెట్టుబడి సలహా సేవల సంస్థ 'మల్టీ యాక్ట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్' వెల్లడించింది. సంప్రదాయ ఈక్విటీ, డెట్ పెట్టుబడులకే పరిమితం కావడం నుంచి ఇతర సాధనాల వైపు ఇన్వెస్టర్లు మళ్లుతున్నారనడానికి నిదర్శనంగా పేర్కొంది. ముఖ్యంగా హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్లు (హెచ్‌ఎన్‌ఐలు/ధనవంతులు), అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలు ఏఐఎఫ్ విభాగం వైపు మొగ్గు చూపిస్తున్నారని తెలిపింది. ఏఐఎఫ్ ఫండ్స్ కిందకు ప్రైవేటు ఈక్విటీ, హెడ్జ్ ఫండ్స్, ప్రైవేటు క్రెడిట్, ఇతర సంప్రదాయేతర పెట్టుబడి సాధనాలు వస్తాయి. మార్కెట్లు అస్థిరతలకు గురైన సందర్భాల్లో ఏఐఎఫ్ పెట్టుబడులు స్థిరత్వంతోపాటు, అధిక రాబడులు అందించడం వీటి పట్ల ఆసక్తి పెరగడానికి కారణంగా మల్టీ యాక్ట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ నివేదిక తెలిపింది. 'ఫ్యామిలీ ఆఫీసులు పెట్టుబడులను దీర్ఘకాల దృష్టిలో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కనుక ఇతర ఇన్వెస్టర్లతో పోలిస్తే ప్రైవేటు పెట్టుబడుల్లో వీరి భాగస్వామ్యం ఎక్కువగా ఉంటోంది' అని ఈ నివేదిక తెలిపింది. ముఖ్యంగా వైవిధ్యంతోపాటు ద్రవ్యోల్బణం నుంచి పెట్టుబడులకు హెడ్జింగ్ వంటివి ఏఐఎఫ్ పెట్టుబడుల వృద్ధికి కారణాలుగా పేర్కొంది. సాధారణంగా ఏఐఎఫ్‌లను కేటగిరీ -1, 2, 3లుగా విభజిస్తుంటారు. ఆరంభ స్థాయి వెంచర్ క్యాపిటల్, ప్రైవేటు ఈక్విటీ, ప్రైవేటు క్రెడిట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాంగ్-షార్ట్ హెడ్జ్ వ్యూహాలతో ఏఐఎఫ్‌లు పనిచేస్తుంటాయి. ఈ భిన్నమైన అవకాశాల ద్వారా ఈక్విటీ, డెట్ మార్కెట్లలోని అస్థిరతలను హెచ్‌ఎన్‌ఐలు అధిగమించగలుగుతారని, రిస్క్‌ను మెరుగ్గా నిర్వహించగలరని ఈ నివేదిక వివరించింది. భిన్న మార్కెట్ సైకిల్స్‌ను సమర్థవంతంగా అధిగమించే విధంగా వారి పోర్ట్‌ఫోలియో నిర్మాణం ఉంటుందని తెలిపింది. భారత్‌లో 10 మిలియన్ డాలర్లకు పైగా ఆస్తులు కలిగిన వారు 85,698 మంది ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ 2025 ఇటీవలే వెల్లడించింది.

# హెూర్ముజ్ జలసంధి మూసివేత..?



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఇరాన్ ఆధ్వర్యంలోని హెూర్ముజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన చెక్ పాయింట్లలో ఒకటిగా నిలుస్తుంది.అయితే యుద్ధం నేపథ్యంలో దీని గుండా చేసే చమురు సరఫరాను నిలిపేస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది. ఈ జలసంధి ప్రపంచంలోని ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 20% రవాణాను సులభతరం చేస్తుంది.ఇరాన్-గల్ఫ్ దేశాల మధ్య ఉన్న ఈ హెూర్ముజ్ జలసంధి 33 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలుపుతుంది. చమురు ఉత్పత్తి చేసే దేశాలకు ప్రధానంగా సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ, ఇరాక్, కువైట్‌లకు ఒక ముఖ్యమైన సప్లై కారిడార్‌గా పనిచేస్తుంది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సైనిక సంఘర్షణలు, ఆర్థిక ఆంక్షలకు గురవుతుంది. దీని గుండా చమురు ట్యాంకర్లు స్వేచ్ఛగా ప్రయాణించడానికి ఏదైనా అంతరాయం ఏర్పడితే తీవ్రమైన సరఫరా గొలుసు అవరోధాలకు దారితీస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ముడి చమురు ధరలను పెంచుతుందని చెబుతున్నారు.అమెరికా, ఇతర గల్ఫ్ దేశాలతో ఇరాన్‌కు ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో హెూర్ముజ్ జలసంధి గుండా చమురు సరఫరాను నిలిపేస్తామని హెచ్చరించింది. ఈ ప్రాంతంలో ఆంక్షల వల్ల ప్రపంచ క్రూడ్ ఎగుమతులకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఇది చమురు ధరలు పెరగడానికి, ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడటానికి దారితీస్తుంది.ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఇటీవలి సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే బ్రెంట్ క్రూడ్ 10% పైగా పెరగడానికి దారితీశాయి. ఇది దీర్ఘకాలిక సంక్షోభంతో కూడిన మార్కెట్ భయాలను ప్రతిబింబిస్తుంది. పశ్చిమాసియాలో అస్థిరతపై పెట్టుబడిదారులు వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. దాంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. పెరుగుతున్న ముడి చమురు ధరలు పరిశ్రమలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా పెయింట్స్, కెమికల్స్ పరిశ్రమలు క్రూడ్ ఆయిల్ డెరివేటివ్స్‌పై ఆధారపడతాయి. టైర్లు, రబ్బరు తయారీ సంస్థలు పెట్రోలియం ఆధారిత ఉత్పత్తులతో ప్రభావితమవుతాయి. ఏవియేషన్, షిప్పింగ్ పరిశ్రమ పెరిగిన ఇంధన ఖర్చులతో రవాణా వ్యయాన్ని పెంచే అవకాశం ఉంటుంది. హెూర్ముజ్ జలసంధి దిగ్బంధం చేస్తారనే భయాలతో రష్యన్ క్రూడాయిల్‌కు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికా, యూరప్ ఆంక్షల తరువాత ఇప్పటికే రష్యన్ చమురు రాయితీతో లభిస్తుంది. దాంతో భారతదేశం, చైనా వంటి దేశాలు కొనుగోళ్లను పెంచాయి. ఈ పరిస్థితి ప్రపంచ ఇంధన మార్కెట్లను ప్రభావితం చేస్తుంది. ఇరాన్ ఇలాగే హెూర్ముజ్ జలసంధి గుండా సరఫరాను నిలిపేస్తామని ఇరాన్ భయాలు సృష్టిస్తే గల్ఫేతర చమురు సరఫరాదారులకు ప్రయోజనం చేకూరుతుందనే వాదనలున్నాయి.ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన దాడులకు సమర్థంగా సమాధానం చెబుతామని ఇరాన్ ప్రతిస్పందించింది. అందులో భాగంగా హెూర్ముజ్ జలసంధిని నిలిపేయడం దాని వ్యూహాత్మక ఎంపికల్లో ఒకటి. ఈ జలసంధి ముఖ్యమైన చమురు రవాణా మార్గం. ఇది ప్రపంచ ముడి చమురులో 20% రవాణాకు తోడ్పడుతుంది. దీనికి విఘాతం కలిగిస్తే చమురు ధరలు పెరుగుతాయి. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతుంది. ఇరాన్ చారిత్రాత్మకంగా హెూర్ముజ్‌ను మూసివేస్తామని బెదిరింపులకు పాల్పడుతూ బేరసారాలు సాగించింది. కానీ ఎన్నడూ దాన్ని నిలిపేయలేదు.ఇరాన్ కూడా తన చమురును ఎక్కువగా హెూర్ముజ్ జలసంధి ద్వారానే ఎగుమతి చేస్తుంది. దీన్ని అడ్డుకోవడం వల్ల సొంత ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది. యూఎస్ నేవీ ఐదో ఫ్లీట్ యూకే, ఫ్రెంచ్ మిత్రదేశాలతో కలిసి ఆ జలమార్గంలో గస్తీ నిర్వహిస్తుంది. దీన్ని పూర్తిగా నిలిపేస్తే పాశ్చాత్య దేశాల సైనిక జోక్యం పెరుగుతుందనే వాదనలున్నాయి.

## ఐఆర్‌సీటీసీ అకౌంట్‌కు ఆధార్ లింక్ తప్పనిసరి




తత్కాల్ రైలు టికెట్ బుకింగ్ విధానంలో భారతీయ రైల్వే కొత్త నిబంధనలు తీసుకొస్తోంది. జూలై 1 నుంచి ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) యాప్, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో తత్కాల్ టికెట్లను బుక్ చేసుకోవాలంటే ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రక్రియలో ఏఐ బోట్‌లు, ఏజెంట్ల బెడదను నివారించేందుకు తత్కాల్ టికెట్ బుకింగ్ వ్యవస్థలో భారీ మార్పులు చేస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. తత్కాల్ అనేది ఇండియన్ రైల్వే ఫాస్ట్ ట్రాక్ టికెట్ బుకింగ్ వ్యవస్థ. దీని ద్వారా అప్పటికప్పుడు ప్రయాణానికి ఒక రోజు ముందు తక్కువ సమయంలో రైలు టికెట్లను బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇండియన్ రైల్వే అమలు చేస్తున్న కొత్త రూల్ ప్రకారం.. ఆన్‌లైన్‌లో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే.. ఐఆర్‌సీటీసీ అకౌంట్‌కు యూజర్ ఆధార్ లింక్ చేసుకోవడం తప్పనిసరి. ఇందుకోసం కావాల్సినవి యాక్టివ్ ఐఆర్‌సీటీసీ అకౌంట్, ఆధార్ నెంబర్ లేదా వర్చువల్ ఐడీ, ఓటీపీ వెరిఫికేషన్ కోసం మొబైల్ ఫోన్.

**ఆధార్ లింక్ చేసుకోండిలా..**

ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్ లోకి లాగిన్ అవ్వాలి.'మై అకౌంట్'పై క్లిక్ చేసి 'అథెంటికేట్ యూజర్' ఎంచుకోండి.మీ ఆధార్ నెంబర్ లేదా వర్చువల్ ఐడీ ఎంటర్ చేయండి.'వెరిఫై డీటెయిల్స్ అండ్ రిసీవ్ ఓటీపీ'పై క్లిక్ చేయాలి.మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయాలి.సమ్మతి బాక్సును టిక్ చేసి 'సబ్మిట్' నొక్కండి. మీ ఆధార్ విజయవంతంగా లింక్ అయిన తర్వాత ధ్రువీకరణ కన్పిస్తుంది.

## కాళేశ్వరం ఇక నిరూపయోగం

మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం తర్వాత తొలిసారి బీసీ జనాభా సేకరణ జరుగుతోందని పేర్కొన్నారు. జనగణనలో వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. మోదీ 11 ఏళ్ల పాలనపై బీజేపీ చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు విశేషంగా స్పందిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం సమయం తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే ఎన్నికలు ఆలస్యం అయ్యాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో జరగాలే కానీ తూతూ మంత్రంగా కాకూడదని హితవు పలికారు. అన్ని స్థానాల్లో బీజేపీ స్వతంత్రంగా పోటీ చేస్తుందని చెప్పారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హైకోర్టులో బీజేపీ పిటిషన్ వేసిందని, అది పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం సీబీఐకి కేసు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తమ ఫోన్లను ట్యాప్ చేశారన్నది హైకోర్టుకు ఇచ్చిన ప్రభుత్వ నివేదికలో కూడా ఉందని వెల్లడించారు. అలాగే గోదావరి జలాల విషయంపై రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరిపి పరిష్కారం వెతుకుతామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రెండు ప్రభుత్వాలు కలిసి చర్చించుకోవాలన్నది ఆయన అభిప్రాయం. రెండు రాష్ట్రాల ప్రజలు 'మనవారే' అనే భావనతో కలిసి పనిచేయాలన్నారు. కేసీఆర్ గతంలో 'బేసిన్లు లేవు, భేషజాలు లేవు' అని అన్నారని, ఇప్పుడు మాత్రం ఆయనే మౌనంగా ఉన్నారని విమర్శించారు. మూడు టీఎంసీలు పోతున్నా, కేసీఆర్ తన ఫార్మ్‌హౌస్‌లో నిద్రిస్తున్నారని ఎద్దేవా చేశారు.

## ఇరాన్‌కు 'అణు' సాయం.. నాలుక మడతేసిన పాక్
### అబ్బే.. అలా అనలేదన్న దయాది దేశం



ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట తమపై ఇజ్రాయెల్ అణ్వాయుధాలు ఉపయోగిస్తే.. మద్దతుగా పాకిస్తాన్ అణు దాడులకు దిగుతుందని ఇరాన్ సంచలన ప్రకటన చేసింది.ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ జనరల్ మొహ్సెన్ రెజాయ్ స్వయంగా ఈ ప్రకటన చేయడం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అయితే ఈ ప్రకటనపై ఇప్పుడు పాక్ యూటర్న్ తీసుకుంది.ఇజ్రాయెల్ తమపై అణుబాంబును ప్రయోగిస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగి దానిపై న్యూక్లియర్ అటాక్ చేస్తుందని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ జనరల్, ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్ మొహ్సెన్ రెజాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ప్రభుత్వం నడిపించే ఓ టీవీ చానెల్‌తో ఆయన మాట్లాడుతూ. "ఇజ్రాయెల్ మాపై అణు దాడి చేస్తే.. ఇస్లామాబాద్(పాక్) కూడా టెల్‌అవీవ్‌పై అణుబాంబును ప్రయోగిస్తుందది. ఈ మేరకు పాక్ నుంచి స్పష్టమైన హామీ లభించింది" అని మొహసిన్ వెల్లడించారు.అంతేకాదు.. తుర్కియే, సౌదీ, పాకిస్థాన్ ఇతర దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటుచేయాలని మొహసిన్ అన్నారు. కానీ, ఆయా దేశాలు ఇరాన్ యూనిఫామ్ వేసుకోవడానికి మొహ్సెన్ రెజాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ప్రభుత్వం నడిపించే ఓ టీవీ చానెల్‌తో ఆయన మాట్లాడుతూ. "ఇజ్రాయెల్ మాపై అణు దాడి చేస్తే.. ఇస్లామాబాద్(పాక్) కూడా టెల్‌అవీవ్‌పై అణుబాంబును ప్రయోగిస్తుందది. ఈ మేరకు పాక్ నుంచి స్పష్టమైన హామీ లభించింది" అని మొహసిన్ వెల్లడించారు.అంతేకాదు.. తుర్కియే, సౌదీ, పాకిస్థాన్ ఇతర దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటుచేయాలని మొహసిన్ అన్నారు. కానీ, ఆయా దేశాలు ఇరాన్ యూనిఫామ్ వేసుకోవడానికి సిద్ధంగా లేవన్నారు. వీటిల్లో ఒక్క దేశమైనా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే రాత్రికి రాత్రే ప్రాంతీయ బలాబలాలు మారిపోతాయన్నారు.ఇరాన్ ఇచ్చిన ప్రకటనను పాక్ ఖండించింది. తాము అలాంటి కమిట్‌మెంట్ ఏదీ ఇవ్వలేదని పాకిస్తాన్ రక్షణ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అయినప్పటికీ ఇరాన్‌కు తమ విస్తృత మద్దతు ప్రకటించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్ని పాక్ ఇదివరకే ఖండించింది. యూదు దేశం ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్‌కు తాము మద్దుగా నిలుస్తామని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా అసిఫ్ జూన్ 14వ తేదీన పాక్ జాతీయ అసెంబ్లీలో ప్రకటించారు. ఇరాన్, యెమెన్, పాలస్తీనాలకు ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. ఇప్పటికైనా ఇస్లాం దేశాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఆ దేశాలకు పట్టిన గతే రేపు మనకూ పడుతుంది. ఓఐసీ దేశాలు ఇజ్రాయెల్ దాడులపై వ్యూహరచన కోసం ఓ సమావేశం నిర్వహించాల్సి ఉంది" అని ఖ్వాజా చేసిన వ్యాఖ్యలను తుర్కియే టుడే ప్రముఖంగా ప్రచురించింది.

భగ్గుమన్న పశ్చిమాసియా

ఇరాన్ నుంచి ప్రపంచ దేశాలకు అణు ముప్పు పొంచి ఉందని, ఇప్పటికే కీలక పరీక్షలు నిర్వహించిందని చెబుతూ ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట ఇజ్రాయెల్ దాడులకు దిగింది. అయితే ఇరాన్ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ప్రతిగా.. ఇజ్రాయెల్‌పైనా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ ఉద్రిక్తతలతో పశ్చిమాసియా భగ్గుమంటోంది.ప్రపంచంలో ప్రస్తుతం అణ్వాయుధాలున్న దేశాల్లో ఇజ్రాయెల్, పాకిస్థాన్ స్థానం దక్కించుకొన్నాయి. ఈ జాబితాలో అమెరికా, రష్యా, ఫ్రాన్స్, భారత్, ఉత్తర కొరియా కూడా ఉన్నాయి.

## బంగారం ధరల్లో స్వల్ప ఊరట..



ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర సోమవారం కాస్తా ఊరటనిచ్చింది. వివిధ ప్రాంతాల్లో ఈ రోజు గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.93,050 (22 క్యారెట్స్), రూ.1,01,510 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. క్రితం రోజు ముగింపు ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.150, రూ.170 తగ్గింది.చెన్నైలో సోమవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.150, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.170 తగ్గింది. దీంతో గోల్డ్ రేటు రూ.93,050 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.1,01,510 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.దేశ రాజధాని నగరం ఢిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే తగ్గింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.150 దిగి రూ.93,200కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.170 తగ్గి రూ.1,01,660 వద్దకు చేరింది.బంగారం ధరలు సోమవారం తగ్గినట్లుగానే వెండి ధరలు(%ూఱశ్రీఙవతీ ుాతీఱఎవ%) కూడా వినియోగదారులకు కొంత ఊరట కల్పించాయి. క్రితం ముగింపు ధరలతో పోలిస్తే కేజీ వెండి ధరపై రూ.100 తగ్గింది. దాంతో కేజీ వెండి రేటు రూ.1,19,900 వద్దకు చేరింది.

# వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో మరింత వేగం పెరగాలి

- సోలార్, పవన, జియో థర్మల్ విద్యుత్తు, బొగ్గు నుంచి కెమికల్స్‌పై ప్రత్యేక సమీక్ష
- పనులు మందకొడిగా సాగితే ఉపేక్షించేది లేదు
- అన్ని విభాగాల అధిపతులకు సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరిక
- 28 రకాల విస్తరణ ప్రతిపాదనలపై సుదీర్ఘంగా సమీక్షించిన ఛైర్మన్




గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టుల ను, పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని, మందకొడిగా పనులు కొనసాగితే ఉపేక్షించేది లేదని సీఎండీ ఎన్.బలరామ్ వివిధ విభాగాల అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో సమావేశంలో సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన సోలార్ విద్యుత్, పవన విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, జియో థర్మల్ విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, కీలక ఖనిజాల ఉత్పత్తి, జాయింట్ వెంచర్ల ఏర్పాటు, కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ, సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్ తదితర 28 రకాల ప్రాజెక్టులు, పనులపై ఆయన సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

కొన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రాథమిక అవగాహనకు రావడం, కొన్ని పనుల పట్ల ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని, మరికొన్ని పనులపై ఏజెన్సీల ద్వారా అధ్యయనం జరుగుతుందని, సింగరేణి సంస్థకు ఈ వ్యాపార విస్తరణ చర్యలు ఎంతో అవసరం కనుక ఈ పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు. వివిధ విభాగాల వారు తమకు కేటాయించి న పనులపై వివరించగా ఆయన పనులలో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. మరో 10 రోజులకల్లా ప్రతీ పనిలో ప్రగతి కనిపించాలన్నారు. ఇకపై ప్రతీ వారం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా ప్రత్యేకం గా వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై సమీక్ష ఉంటుందని స్పష్టంచేశారు.

సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కూడా సింగరేణి వ్యాపార విస్తరణ చర్యల పట్ల సానుకూల ధోరణితో ఉన్నాయని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యాపార విస్తరణ చర్యలు త్వరగా అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశంలో ఇంకా కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు కార్యాలయాలు, క్వార్టర్ల పైన చేపట్టాల్సిన రూఫ్ టాప్ సోలార్ పవర్ గురించి, కోల్ వాషరీల ఏర్పాటు, హైడ్రాలిక్ కన్వేయర్ల ఏర్పాటు వంటి విషయాలపై లోతుగా చర్చించారు. సమావేశంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, ఇంకా జీఎం సిపిపి ఎ.మనోహర్, జీఎం మార్కెటింగ్ ఎన్. వి.రాజశేఖర్ రావు, సింగరేణి థర్మల్ పవర్, సోలార్ పవర్, రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్, సింగరేణి సివిల్, బిజినెస్ డెవలప్ మెంట్, తదితర 20 శాఖల జనరల్ మేనేజర్లు కూడా పాల్గొన్నారు.



# ప్రజలకు మరింత సేవ చేస్తా..!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్విఫ్ చేయాలి
- టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు
- దారి పొడవుతా ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

మంథని, (జనంసాక్షి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు నియామకం అయిన తర్వాత తొలిసారిగా మంథని నియోజక వర్గానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. మంథని నియోజక వర్గం పొలిమేర గొల్లపల్లి వద్ద నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజ మాలలు వేసి శాలువాలు, పార్టీ కండువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలకు చేసిన సేవలను అధిష్టానం గుర్తించి రాష్ట్రస్థాయిలో తనకు కీలకమైన పార్టీ పదవిని ఇవ్వడం జరిగిందన్నారు. తన తండ్రి శ్రీపాద రావు ఆశ సాధన కోసం, తన అన్నయ్య మంత్రి శ్రీధర్ బాబు చూపిన బాటలో పయనిస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకే కాకుండా పెద్దపెల్లి జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా అందరికీ మరింత సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ పదవి బాధ్యతలు అప్పగించిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలను క్లీన్ స్లీప్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని శ్రీను బాబు పిలుపునిచ్చారు.

# నాలాలు, పాత లే ఔట్ల ఆక్రమణలపై ఫిర్యాదులు

హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) : వర్షాల వేళ.. నగరంలో నాలాల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నాలాల మీద స్లాబులు వేసి.. ఇంటి ఆవరణగా మార్చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. అక్కడ నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం సాధ్యం కాక అవి పూడుకుపోతు న్నాయని పలువురు పేర్కొన్నారు. మల్కాజిగిరి, బాచుపల్లి, సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్, మాధాపూర్ ఇలా నగరం నలువైపుల నుంచి నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులందాయి. వీటితో పాటు.. ఒకప్పటి గ్రామపంచాయతీ లే ఔట్లను తిరిగి వ్యవసాయ భూములుగా చిత్రీకరి ంచి తప్పుడు పాస్ పుస్తకాలతో కొంతమంది వారసులు, కబ్జా దారులు కాజేస్తున్నారని పలువురు వాపోయారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి వచ్చిన 47 ఫిర్యాదుల్లో ఎక్కువ మొత్తం పాత లే ఔట్లు, నాలాల ఆక్రమణలపైనే ఉన్నాయి. గూగుల్, ఎన్ ఆర్ ఎస్‌సీ, గ్రామీణ మ్యాప్స్‌తో ఫిర్యాదులను శ్రీ ఏవీ రంగనాథ్ గారు క్షుణ్ణంగా పరిశీలించారు. పాత లే ఔట్లలో రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశి ంచిన స్థలాలను కాపాడుతూనే.. అమాయకులు మోసపోకుండా చర్యలు తీసుకుంటున్నామని ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో మాదిరే నాలాలు ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, అపార్టుమెంట్లు కొనేటప్పుడు అన్నీ సరిచూసుకోవాలన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి

# తల్లిదండ్రులు ముందుకు రావాలి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




కరీంనగర్ బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి తల్లి దండ్రులు ముందుకు రావాలని, ప్రభుత్వ పాఠశాలలో పోటీ పరీక్షలలో అర్హత సాధించిన ఉపాధ్యాయులు మంచి బోధన అందిస్తారన్న విషయం తల్లి దండ్రులు గ్రహించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి మండలం కమాన్ పూర్ గ్రామంలో ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం పిల్లలకు ఇస్తున్న ప్రోత్సాహాలను తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, అన్ని వసతులతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తుందని ప్రైవేట్ పాఠశాలలో చదివితేనే బాగా చదువుకుంటారన్న అపోహను వీడాలని నరేందర్ రెడ్డి సూచించారు. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు నరేందర్ రెడ్డి బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆనందం, హెడ్ మాస్టర్ నారాయణ స్వామి, ఉపాధ్యాయురాలు సుధారాణి, స్థానిక నాయకులు స్వామి గౌడ్, మడుపు మోహన్, శ్రవణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) : కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవా ల్లో భాగంగా, జిల్లా కలెక్టర్ ఆశిష్ షాంగ్వాన్ యోగా సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 21న ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు కామారెడ్డి పట్టణంలోని సరస్వతి విద్యా మందిరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు జరుగనున్నట్లు తెలిపారు. అధికారు లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, అడిషనల్ కలెక్టర్ చందర్, ఆర్‌డిఓ వీణ, డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, ఆయుష్ నోడల్ ఆఫీసర్ డా. వెంకటేశ్వర్లు, ప్రకృతి వైద్యాధికారి డా. దేవయ్య, ఆయుష్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఆకుల శ్రీకాంత్, ఎన్ఎచ్ఎమ్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పద్మజ, యోగా శిక్షకులు లింగమూర్తి తదితర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అధికారులు.. నా ఫోన్ ట్యాపింగ్ చేశారు

- కోర్టులో సాక్ష్యం ఇస్తా... సిట్ నిజాలు నిగ్గు తేల్చాలి
- ట్యాపింగ్ వ్యవహారం..సిట్ ఎదుట మహిపాల్ రెడ్డి సాక్ష్యం
- బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి

వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 16 (జనం సాక్షి): రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యా పింగ్ వ్యవహారం లో నిజాలు నిగ్గు తేల్చడానికి సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు మరిన్ని సాక్షాలు సేకరించడానికి సిట్ మరింత లోతుగా విచారణ జరుగుతుంది . అందులో భాగంగానే జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. సిట్ పిలుపు మేరకు ఆ నాయకుడు అధికారుల ముందు సాక్ష్యం ఇచ్చారు. సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిట్ అధికారులను కోరినట్లు విచారణ అనంతరం అ నాయకుడు మీడియాకు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి పట్లోళ్ల మైపాల్ రెడ్డి సోమవారం నాడు సిట్ అధికారుల ముందు ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్ష్యం ఇచ్చినట్లు మీడియాకు తెలియజేశారు. గత ప్రభుత్వ హాయంలో కొందరు అధికారులు తన ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆయన ఆరోపించారు. అప్పటి రిటైర్డ్ ఐజి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ట్యాపింగ్ జరిగినట్లు ఆధారాలను చూయిస్తూ సిట్ అధికారుల ముందు సాక్ష్యం ఇచ్చినట్లు తెలియజేశారు. ఈ కేసులో సిట్ అధికారుల ముందే కాకుండా కోర్టుకు వెళ్లి సాక్ష్యం ఇస్తానని ఆయన వివరించారు. 1988 టెలికం ఆక్ట్ ప్రకారం ఒక వ్యక్తి ఫోన్ ట్యాపింగ్



చేయాలంటే కేంద్ర హోం శాఖ సెక్రటరీ అనుమతి తీసుకొని పోలీసులు ఫోన్ పై నిఘా పెట్టవలసి ఉంటుందని నిబంధనలకు వ్యతిరేకంగా తన ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు తెలియజేశారు. అప్పట్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో తోపాటు ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి. బండి రమేష్ మైనంపల్లి హనుమంతరావు తిరుపతిరెడ్డిల తో సంభాషించిన 20 కాల్స్ ను అప్పట్లో అధికారంలో ఉన్న పెద్దల ఆదేశాల మేరకు అధికారులు తన తన ఫోన్ ట్యా పింగ్ కు పాల్పడినట్లు తెలియజేశారు. సంఘ విద్రోహ శక్తులు నక్సలైట్లు తీవ్రవాదుల పోలీసులు సెల్ ఫోన్ ట్యా పింగ్ చేయాలి కానీ నీతి నిజాయితీగా ఉంటూ వ్యవసాయ చేసుకొని జీవనోపాధి సాగిస్తున్న తమపై నిఘా వేయడం దుర్మార్గమైన చర్యని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు తమపై నిఘా వేసి నానా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు పోలీసులు వాహనాల తనిఖీల కోసం చెక్ పోస్ట్ ఏర్పాటు చేస్తారని వాటిలో మాత్రమే వాహనాల తనిఖీ ఉంటుందని కానీ పోలీసులు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి తమ వాహనాన్ని వెంబడించి నానా ఇబ్బందులు గురిచేసారని తెలియజేశారు.

# దేశంలో అతిపెద్ద ఆట బొమ్మల ప్రదర్శన

న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జూలై 4 నుంచి 7వ తేదీ వరకు..



హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) : భారతదేశంలో అతిపెద్ద ఆట బొమ్మల వ్యాపార ప్రదర్శన 'టాయ్ బిజ్ ఇంటర్నేషనల్ 2025' ను న్యూఢిల్లీలో ప్రగతి మైదాన్ లో జూలై 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టాయ్ అసోసియే షన్ ఆఫ్ ఇండియా (టీఏఐ) మాజీ ఉపాధ్యక్షుడు, అధికార ప్రతినిధి పవన్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శనలో 350 పైగా భారతీయ ఆట బొమ్మల బ్రాండ్లు ఉంటాయన్నారు. 25 దేశాల నుంచి పది వేలకు పైగా బయ్యర్లు పాల్గొననున్నారని పేర్కొన్నా రు. అంతర్జాతీయ రీటైల్ దిగ్గజాలు అయిన వాల్ మార్ట్, హామ్లీస్ ఇండియా, ల్యాండ్‌మార్క్, లులూ గ్రూప్ వంటి సంస్థలు కూడా ఈ ఈవెంట్‌లో భాగం కానున్నాయని తెలిపారు. ఆట బొమ్మల పరిశ్రమ 2015 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023లో ఎగుమతులు 239 శాతం పెరుగుదల కనిపించిందన్నారు. ఈ ప్రదర్శనలో బ్యాటరీతో పనిచేసే ఆటబొమ్మలు, ఎలక్ట్రానిక్ ఆటబొమ్మలు, బోర్డ్ గేమ్స్, పజిల్స్, హాబీ కిట్లు, పటాలు, ప్లష్ టాయ్స్, క్రాఫ్ట్ టాయ్స్, రైడ్-ఆన్లు, సైకిళ్ళు/ట్రైసైకిళ్లు, అవుట్‌డోర్ గేమ్స్, సంప్రదాయ భారతీయ ఆటబొమ్మలు, బేబీవేర్, బాలల ఫర్నిచర్ ఉంటాయన్నారు. ఆట బొమ్మల తయారీ రంగంలో ప్రపంచ స్థాయిలో భారత్ ప్రాముఖ్యత పెరుగుతుందని తెలిపారు. దీనికి దేశీయ విధానాలు, అంతర్జాతీయ వాణిజ్య మార్పులు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. చైనా నుంచి దిగుమతయ్యే మూడు వందల బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై అమెరికా ప్రభుత్వం 25 శాతం టారిఫ్ విధించిందన్నారు. వియత్నాం, ఇతర ఆగ్నేయాసియా దేశాల దిగుమతులపై పర్యవేక్షణను కఠినతరం చేసిందన్నారు. ఈ అవకాశాన్ని భారతీయ ఆట బొమ్మల తయారీదారులు అందిపుచ్చుకునేందుకు ముందుకు వస్తున్నారన్నారు.

# గంజాయి విక్రేతరుల అరెస్ట్

తిమ్మాపూర్ సర్కిల్ ఇస్పెక్టర్ సదన్ కుమార్.



కరీంనగర్ బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి) : గంజాయిని విక్రయించడానికి తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ తెలిపారు. సోమవారం పోలీసులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు తెలియజేస్తూ.. ఈ నెల 15న సాయంత్రం కొత్తపల్లి ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేసిన సమయంలో ముగ్గురు వ్యక్తులు బైక్ మీద కరీంనగర్ వస్తుండగా బైక్ ని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద గల బ్యాగులో ఐదు కేజీల గంజాయి స్వాదిన పరుచుకోవడం జరిగిందని తెలిపారు. వారు వేములవాడ మండలం నాగయ్య పల్లి గ్రామంకు చెందిన గొంటి నగేష్ ఏ బన్నీ, కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామంకు చెందిన చెప్యాల సాత్విక్ ఏ సన్నీ, వేములవాడ అర్బన్ కాలనీకి చెందిన కుత్తడి భరత్ @ చింటూ అనే ముగ్గురు నిందితులు గంజాయి తాగుడు కు అలవాటు పడినారని అయితే గంజాయిని అమ్మి డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో వారు ముగ్గురు 4 రోజుల క్రితం టు వీలర్ మీద ఒడిస్సా కు వెళ్లి అక్కడ గంజాయి కొనుక్కొని తిరిగి వస్తున్న క్రమంలో కొత్తపల్లి ఎక్స్ రోడ్ వద్ద పట్టుకోవడం జరిగిందని, వారి వద్ద నుంచి ఐదు కేజీల గంజాయ, బైక్, ఒక మొబైల్ స్వాధీనం పరుచుకుని అరెస్టు చేసి రిమాండ్ చెయ్యడం జరిగిందని తిమ్మాపూర్ సిఐ తెలిపారు. ఈ సమావేశంలో తిమ్మాపూర్ ఎస్ఐ కదిరే శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.



# వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

డిప్యూటీ డిఎం, హెచ్ఓ డాక్టర్ చందు

జమ్మికుంట, జూన్ 16 (జనంసాక్షి): జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ చందు సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మసీ, ల్యాబొరేటరీ, రికార్డులను సమీక్షించి, సిబ్బందికి ముఖ్యమైన సూచనలు అందజేశారు. తనిఖీ అనంతరం డాక్టర్ చందు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఈ క్రింది చర్యలపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు: ఎన్‌సిడి క్లినిక్‌లు: హైపర్‌టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధుల కోసం ఎన్‌సిడి క్లినిక్‌లను క్రమం తప్పక నిర్వహించాలి. ఈ పరీక్షలు సకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలి. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో కుష్ఠ వ్యాధి సర్వేలు నిర్వహించి, ప్రాథమిక దశలోనే రోగాన్ని గుర్తించాలి. స్పుటం శాంపిల్స్ సేకరణ కోసం ఏసిఎఫ్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలి. అవసరమైన వారికి ఎక్స్-రే పరీక్షలు నిర్వహించాలి. ప్రతి మంగళవారం, శుక్రవారం మహిళల కోసం ఆరోగ్య కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలి. ఈ కార్యక్రమాల్లో మహిళలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు అందజేయాలి. జిల్లా కలెక్టర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే శుక్రవారం సభలను మహిళలు తప్పక సద్వినియోగం చేసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. దీనివల్ల తల్లీబిడ్డ ఆరోగ్యం కాపాడబడుతుంది.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సిబ్బంది ఈ విషయంలో చురుకుగా వ్యవహరించాలి. డాక్టర్ చందు సిబ్బందికి సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. రికార్డుల నిర్వహణను మెరుగుపరచాలని, ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో డాక్టర్ రాజేష్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సూపర్వైజర్ సదానందం, ఫార్మసిస్ట్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : వేములవాడ రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం నుండి పట్టణంలో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తు న్న రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయన్నారు. మూలభాగం నుండి రాజన్న ఆలయం వరకు 80 ఫీట్స్ రోడ్డు వెడల్పు పనులు కొనసాగుతు న్నాయన్నారు.గత సంవత్సరం నవంబర్ 20 న సీఎం రేవంత్ రెడ్డి తో పాటు 8 మంత్రుల సమక్షంలో రూ 76 కోట్లతో ఆలయ విస్తరణ,రూ 47 కోట్లతో రోడ్డు వెడల్పు కోసం, రూ 35 కోట్లతో అన్న సత్ర నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ 50 కోట్లు,25-26 బడ్జెట్లో రూ100 కోట్లు రాజన్న ఆలయ, పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయి ంచడం జరిగిందన్నారు.ఆలయ అభివృద్ధి,పట్టణ అభివృద్ధి సమాంతరంగా చేస్తున్నమన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాతో పాటు స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తుల రద్దీకి అనుగుణంగా పట్టణ అభివృద్ధిని చేస్తమ న్నారు. 30 సంవత్సరాలుగా ప్రజలు కోరుకుంటున్న రోడ్డు వెడల్పు, ఆలయ అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు తీసుకుపోతున్నమన్నారు.

గత ప్రభుత్వం లాగా కేవలం శంకుస్థాపనలకు పరిమితం కాకుండా పనులు ప్రారంభం చేస్తున్నమన్నారు.వేములవాడ ఆలయాన్ని 4 ఎకరాల్లో విస్తరణ చేయడం కోసం శృంగేరి పీఠనికి 4 సార్లు వెళ్లి వారి సూచనలు సలహాలు తీసుకొని ఆలయ అభివృద్ధిపై ముందుకు పోతున్నామన్నారు. భవిష్యత్తులో కూడా రాజన్న ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు ఖర్చు చేస్తామన్నారు. మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కలిగేలా ఏర్పాటు చేస్తనన్నారు. మాజీ సీఎం కేసీఆర్ గతంలో రాజన్న ఆలయ మెట్లమీద మీద ఇచ్చిన మాట తప్పడని,

కేసీఆర్ నా లగ్గం ఇక్కడే అయ్యింది, అని నా అత్తగారు కోదురుపాక అని ప్రజలను మభ్యపెట్టి తక్షణమే ఏటా బడ్జెట్లో రూ 100 కోట్లు విడుదల చేస్తానని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ప్రస్తుతం కూడా అలానే ఉందన్నారు.

గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిలో ఒక్క ఇటుక తీసి పెట్టలేదని,వారు రంగురంగుల బ్రోచర్లలో మాత్రమే అభివృద్ధి చూపెట్టారన్నారు. మూలవాగు పై 3వ బ్రిడ్జి లేకున్నా ఉన్నట్లు వారు వీడియోల్లో చూపెట్టారనీ,నేడు ప్రజా ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. రోడ్డు వెడల్పులో భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరి హారం ఇవ్వడం జరిగిందని,భూ నిర్వాసితుల త్యాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న దుకాణదారులకు ప్రభు త్వం చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. అనాడు పిసిసి అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటలకు నేడు అడుగులు పడుతున్నాయని, భవిష్యత్తు లో మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు.

*ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.*





# ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళ

హైదరాబాద్ సిటీ, జూన్ 16(జనంసాక్షి): ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళ పీజీ లా కళాశాలలో నిర్వహించడం జరిగినది. దీనికి ముఖ్య అతిథిలుగా కేంద్ర మంత్రి జయంతి చౌదరి,ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పార్లమెంట్ సభ్యులు ఆర్ కృష్ణయ్య,ఎంపీ ఈటెల రాజేందర్ హాజరయ్యారు. దీనిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, 85 ప్రయివేటు సంస్థలు పాల్గొన్నారు. వీటిలో 3,540 ఖాళీలకు గాను 3,750 విద్యార్థిలు హజరు అయ్యారు. వీరిలో 2890లో పరిశీలనలో ఉన్నారు. ఈ మేళ దిగ్విజయం చేయడానికి మా ఉద్యోగులంద రూ వారి వారి యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించి ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కో కుండా చూశారు. ఇలాంటి ప్రధానమంత్రి అప్రెంటిషిప్ మేళ ప్రతి సంవత్సరము నిర్వహిస్తామని తెలుపుతూ విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగు పరుస్తామని ఐటీఐ మల్లెపల్లి దోవ శైలజ ప్రిన్సిపాల్ ప్రభుత్వ ఐటిఐ తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రాజా, ట్రైనింగ్ ఆఫీసర్లు ఎం బి కృష్ణ యాదవ్, మల్లేష్, శ్రీనివాస్, సోమ శ్రీనివాస్, బలమని సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ,సూపరెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ నుంచి రిటైర్ అవమన్నారు



## నా లక్ష్యం తిరిగి భారత జట్టులో ఆడటమే

### భారత క్రికెటర్ కరుణ్ నాయర్

భారత క్రికెటర్ కరుణ్ నాయర్ ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ భారత జట్టులోకి రీ-ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఈ నెల 20 నుంచి ఇంగ్లాండ్‌తో జరిగే ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ కోసం టీమ్ ఇండియా ప్రకటించిన 18 మంది సభ్యుల బృందంలో అతడు చోటు దక్కించుకున్నాడు. తాజా ఇంటర్వ్యూలో కరుణ్ నాయర్ రెండేళ్ల క్రితం జరిగిన ఒక సంఘటనను పంచుకున్నాడు. ఓ ప్రముఖ భారత క్రికెటర్ తనను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవమని, ఆర్థికంగా లాభదాయకమైన విదేశీ టీ20 లీగ్‌లలో ఆడమని సూచించాడని వెల్లడించాడు. "అతడు చెప్పినట్లు చేయడం సులభమే, కానీ నా లక్ష్యం ఎప్పుడూ భారత జట్టులో తిరిగి ఆడటమే. ఇప్పుడు నేను ఆ లక్ష్యాన్ని సాధించాను," అని నాయర్ తెలిపాడు.

ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్న కరుణ్, ఇటీవల ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు తరపున డబుల్ సెంచరీ సాధించాడు. గత 2023-2024 కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్‌లో నార్తాంప్టన్‌షైర్ తరపున 10 మ్యాచ్‌లలో 736 పరుగులు, ఒక డబుల్ సెంచరీతో సహా రాణించాడు. అలాగే, 2024-2025 రంజీ ట్రోఫీలో విదర్భకు ప్రాతినిధ్యం వహిస్తూ 16 ఇన్నింగ్స్‌లలో 863 పరుగులు (4 సెంచరీలు, 2 అర్ధ సెంచరీలు), విజయ్ హజారే ట్రోఫీలో 8 ఇన్నింగ్స్‌లలో 779 పరుగులు, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (2024-2025)లో 6 ఇన్నింగ్స్‌లలో 255 పరుగులు సాధించాడు. భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ కరుణ్‌కు మద్దతుగా నిలిచాడు. "ఎన్ని పరుగులు చేసినా, వదులుకోని మనస్తత్వమే నిన్ను తిరిగి జట్టులోకి తెచ్చింది. ఇది ప్రపంచానికి స్ఫూర్తిదాయకం," అని గంభీర్ అన్నాడు. కరుణ్ నాయర్ కౌంటీ క్రికెట్‌లో సమకూర్చిన అనుభవం టీమ్ ఇండియాకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన వ్యాఖ్యానించాడు.

# శార్దూల్ ఠాకూర్

## అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు

భారత టెస్ట్ జట్టు ప్రాక్టీస్ మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్ ఊహించని ఆటతీరుతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. బౌలింగ్‌లో 4 వికెట్లు పడగొట్టి, బ్యాటింగ్‌లో 68 బంతుల్లో 122 పరుగులు సాధించి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ప్రముఖ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయలేకపోగా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలు తలా రెండు వికెట్లు మాత్రమే సాధించారు. ఈ నేపథ్యంలో శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో అదరగొట్టడమే కాక, బ్యాటింగ్‌లోనూ తన సత్తా చాటాడు. ప్రాక్టీస్ మ్యాచ్ మూడో రోజు ఆటలో అతడు 122 పరుగులతో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శన ద్వారా శార్దూల్ ఠాకూర్ టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకునే అవకాశాన్ని సృష్టించాడు. ఇది ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిపై ఒత్తిడిని పెంచింది. ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన మునుపటి ప్రాక్టీస్ మ్యాచ్‌లో నితీష్ ఒక అర్ధ సెంచరీ సాధించినప్పటికీ, అతడి బౌలింగ్ పేలవంగా ఉంది. ఇటీవలి ఐపీఎల్ సీజన్‌లోనూ నితీష్ బ్యాటింగ్, బౌలింగ్ రెండూ నిరాశపరిచాయి. ఆస్ట్రేలియాలో ఒక సెంచరీ తప్ప, అతడు నిలకడగా ప్రదర్శన చేయలేకపోయాడు.

ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత జట్టు ఇంగ్లాండ్‌లో ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతోంది. శార్దూల్ ఠాకూర్ ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టులో స్థానం కోసం బలమైన పోటీని ఇస్తున్నాడు. అతడిని ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చాలంటే, నితీష్ కుమార్ రెడ్డిని లేదా మరో ఫాస్ట్ బౌలర్‌ను తొలగించాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నితీష్ స్థానంలో శార్దూల్‌ను ఎంచుకునే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

# వరుస వివాదాల్లో దిగ్గజ స్పిన్నర్..



భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వరుసగా వివాదాల్లో నిలుస్తున్నాడు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్‌లో మహిళా అంపైర్‌తో గొడవ పడిన అశ్విన్.. వారం తిరగకుం డానే తాజాగా మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. ఈసారి ఈ దిగ్గజ స్పిన్నర్ బాల్ ట్యాంపరింగ్ ఆరోపణులు ఎదుర్కొంటున్నా డు. టీఎన్‌పీఎల్‌లో దుండిగల్ డ్రాగన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అశ్విన్ బంతి స్వరూ పాన్ని మర్చేందుకు ప్రయత్నించాడని సైచెమ్ మధురై పాంథర్స్ జట్టు ఫిర్యాదు చేసింది. తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో భాగంగా జూన్ 14న సేలంలోని ఎస్‌సీఎఫ్ క్రికెట్ మైదానం లో దుండిగల్, మధురై పాంథర్స్ తలపడ్డాయి. అయితే.. ఈ మ్యాచ్‌లోనే అశ్విన్, అతడి జట్టు సభ్యులు బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డారని మధురై పాంథర్స్ యాజమాన్యం టీఎన్‌పీఎల్ నిర్వాహకులకు లేఖ రాశారు.

'అశ్విన్, అతడి సహచరులు రసాయనాల్లో ముంచిన టవల్లతో బంతిని పదే పదే తుడిచారు. తద్వారా బంతి ఆకారాన్ని మార్చే ందుకు ప్రయత్నించారు. అలా చేయడం తప్పని వారించినా కూడా వినకుండా బాల్ ట్యాంపరింగ్‌ను కొనసాగించారు' అని మధురై పాంథర్స్ తమ ఫిర్యాదులో రాసుకొచ్చింది. అయితే.. టీఎన్‌పీఎల్ సీఈవో ప్రసన్న కన్నన్ మాత్రం బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలను కొట్టిపారేయ లేదు. అశ్విన్, అతడి జట్టు సభ్యులు ఈ నేరానికి పాల్పడ్డారనడానికి తగిన ఆధారాలను సమర్పించాలని మధురై పాంథర్స్‌ను ఆదేశించింది. 'మధురై పాంథర్స్ యాజమాన్యం బాల్‌ట్యాంపరింగ్‌పై ఫిర్యాదు చేసింది. వాళ్ల లేఖను మేము స్వీకరించాం. అయితే.. ఎవరైనా సరే మ్యాచ్ జరిగిన 24 గంటల్లోనే కంప్లైట్ చేయాల్సి ఉంటుంది. అయినా కూడా మేము ఆ ఫ్రాంచైజీ లెటర్‌ను తీసుకున్నాం. అందుకు తగిన ఆధారాలు చూపించాల్సిందిగా కోరాం. ఒకవేళ వాళ్ల ఆరోపణలు నిజమైతే.. ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేస్తాం. ఎందుకంటే.. ఎవిడెన్స్ లేకుండా క్రికెటర్లపై నిందలు వేయడం క్షమించరాని నేరం అవుతుంది. మధురై పాంథర్స్ గనుక ఆధారాలను చూపకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం' అని ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు.



# అక్టోబర్ 5న భారత్, పాకిస్తాన్ మ్యాచ్

### మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 షెడ్యూల్ విడుదల

మహిళల క్రికెట్ వన్డే ప్రపంచ కప్ 2025 షెడ్యూల్ వచ్చేసింది. ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్, పాక్ తొలిసారిగా తలపడనున్నాయి. కొలంబో వేదికగా భారత్, పాకిస్తాన్ మ్యాచ్ షెడ్యూల్ చేశారు. సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 2 వరకు భారతదేశం, శ్రీలంక వేదికలలో మహిళల వన్డే వరల్డ్ కప్ జరగనుంది. 8 జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్ లో మొత్తం 31 మ్యాచ్‌లు ఆడతారు. వన్డే వరల్డ్ కప్ పూర్తి షెడ్యూల్ వివరాలు వెల్లడించారు. భారత్-పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్ ఎప్పుడు జరుగుతుందో పూర్తి వివరాలు ఇక్కడ అందిస్తున్నాం. ప్రతి మ్యాచ్ వేదిక మరియు సమయం వివరాలు ఇక్కడ ఉన్నాయి. మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 మొదటి మ్యాచ్ మంగళవారం, సెప్టెంబర్ 30న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత్, శ్రీలంక జట్లు తలపడనున్నాయి. హైబ్రిడ్ మోడల్‌లో జరిగే ఈ ఐసీసీ మెగా టోర్నమెంట్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు తమ అన్ని మ్యాచ్‌లను కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఆడేలా ప్లాన్ చేశారు నిర్వాహకులు. ప్రపంచ కప్‌లో ఆతిథ్య భారత జట్టుతో పాటు ఆస్ట్రేలియా, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక జట్లు పాల్గొంటాయి. ఫార్మాట్ గురించి చెప్పాలంటే ఇది రౌండ్-రాబిన్ మెథడ్‌లో జరుగుతుంది. తర్వాత 2 సెమీ-ఫైనల్స్ ఉంటాయి. సెమీఫైనల్ విజేతలు ఫైనల్లో వరల్డ్ కప్ కోసం తలపడతారు. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మహిళల ప్రపంచ కప్ మ్యాచ్ అక్టోబర్ 5న జరగనుంది. శ్రీలంకలోని కొలంబోలోని. ప్రేమదాస స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది.

పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరితే అక్టోబర్ 29న జరిగే మొదటి సెమీఫైనల్ మ్యాచ్ కొలంబోలో జరుగుతుంది. సెమీస్ గెలిచి పాక్ ఫైనల్ కనుక చేరితే ఫైనల్ కూడా అక్కడే జరుగుతుంది. పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరకపోతే మొదటి సెమీఫైనల్ గౌహతిలో, ఫైనల్ మ్యాచ్ బెంగళూరులో నిర్వహించేలా ప్లాన్ చేశారు.

#### ప్రపంచ కప్‌లో భారత జట్టు షెడ్యూల్

| | |
|---|---|
| సెప్టెంబర్ 30: | భారత్ - శ్రీలంక - బెంగళూరు - మ.3గం.లకు |
| అక్టోబర్ 5: | భారత్ - పాకిస్తాన్ - కొలంబో - మ. 3గం.లకు |
| అక్టోబర్ 9: | భారత్ - దక్షిణాఫ్రికా - వైజాగ్ - మ. 3గం.లకు |
| అక్టోబర్ 12: | భారత్ - ఆస్ట్రేలియా - వైజాగ్ - మ. 3గం.లకు |
| అక్టోబర్ 19: | భారత్ - ఇంగ్లాండ్ - ఇండోర్ - మ. 3గం.లకు |
| అక్టోబర్ 23: | భారత్ - న్యూజిలాండ్ - గౌహతి - మ. 3గం.లకు |
| అక్టోబర్ 26: | భారత్ - బంగ్లాదేశ్ - బెంగళూరు - మ. 3గం.లకు |

# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా నెంబర్ వన్

### ర్యాంకింగ్స్‌లో నాల్గో స్థానంలో భారత్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 విజేత దక్షిణాఫ్రికా, 27 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐసీసీ ట్రోఫీని గెలుచుకుంది. ఫైనల్‌లో గత ఛాంపియన్ ఆస్ట్రేలియాను దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. ఇప్పుడు త్వరలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ప్రారంభం కానుంది, దీనికి ముందు టెస్ట్ ఫార్మాట్‌లో తాజా ర్యాంకింగ్‌లను చూడవచ్చు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 రన్నరప్ ఆస్ట్రేలియా ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్‌లలో మొదటి స్థానంలో ఉంది, ప్రస్తుతం ఆ జట్టుకు 123 పాయింట్లు ఉన్నాయి. ఐసీసీ 2025 ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు ర్యాంకింగ్‌లలో ప్రయోజనం చేకూరింది, ఇది రెండో స్థానానికి చేరుకుంది, ఇప్పుడు ఆ జట్టు 114 పాయింట్లతో ఉంది. ఇంగ్లాండ్ 113 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. కొన్ని నెలల క్రితం వరకు భారత జట్టు టెస్ట్ ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో ఉంది, అయితే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో వరుస సిరీస్‌లలో ఓడిపోవడంతో నాల్గో స్థానానికి పడిపోయింది, ప్రస్తుతం 105 పాయింట్లు ఉన్నాయి. ఐసీసీ 2021 విజేత న్యూజిలాండ్ ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో ఉన్నాయి. పాకిస్తాన్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, బంగ్లాదేశ్ తొమ్మిదో, ఐర్లాండ్ పదో స్థానంలో ఉన్నాయి. భారత్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ఇంగ్లాండ్‌తో సిరీస్‌తో ప్రారంభం కానుంది. భారత జట్టు 2025లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లు ఆడనుంది. ఐసీసీ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్ గురించి చెప్పాలంటే, ఈ ఫార్మాట్‌లో భారత్ అత్యుత్తమ బౌలర్. జస్ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో నంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. రవీంద్ర జడేజా కూడా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్ బౌలింగ్ విషయానికి వస్తే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ 10 బౌలర్లలో ఒక్క ఇంగ్లాండ్ ఆటగాడు కూడా లేదు.

# అరంగేట్రంలోనే లియామ్ మెక్‌కార్తీ చెత్త రికార్డు!

ఐర్లాండ్ జట్టు ఫాస్ట్ బౌలర్ లియామ్ మెక్‌కార్తీ వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేశాడు. లియామ్ మెక్‌కార్తీ టీ20 చరిత్రలోనే రెండో అత్యంత చెత్త బౌలింగ్ రికార్డును నమోదు చేశాడు. అయితే ఈ అరంగేట్ర మ్యాచ్ అతనికి ఓ పీడకలగా మారింది. ఐర్లాండ్‌లోని బ్రెడీ నగరంలో జరిగిన ఈ మ్యాచ్‌లో అతను వేసిన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 81 పరుగులు ఇచ్చాడు. దీంతో టీ20లలో అత్యధిక పరుగులు సమర్పించుకున్న రెండో బౌలర్‌గా లియామ్ మెక్‌కార్తీ చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఈ లిస్ట్‌లో గాంబియాకు చెందిన మూసా జోబర్తే 93 పరుగులతో మొదటి స్థానంలో ఉన్నాడు. జింబాబ్వేపై మూసా జోబర్తే ఈ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. అతని తర్వాత లియామ్ మెక్‌కార్తీ రెండో స్థానంలో నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ క్రమంలో వెస్టిండిస్ బ్యాటర్లు లియామ్ మెక్‌కార్తీని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో వెస్ట్ ఇండీస్ జట్టు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు, ఐదో ఓవర్‌లో లియామ్ మెక్‌కార్తీకి బౌలింగ్ అప్పగించారు. ఆ ఓవర్‌లో వెస్ట్ ఇండీస్ జట్టు 24 పరుగులు చేసింది. తర్వాత అతని మూడో ఓవర్‌లో 18 పరుగులు వచ్చాయి. అతని చివరి ఓవర్‌లో ఒక ఫోర్, రెండు సిక్సర్లు కొట్టబడ్డాయి. దీని ద్వారా లియామ్ మెక్‌కార్తీ నాలుగు ఓవర్లలో 81 పరుగులు సమర్పించుకున్నాడు. దీనికి ముందు, గాంబియా దేశానికి చెందిన మూసా జోబర్దే 4 ఓవర్లలో 93 పరుగులు ఇచ్చాడు.

# భారత్, ఇంగ్లండ్ ట్రోఫీకి నా పేరు పెట్టకండి

### దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్



భారత్, ఇంగ్లాండ్ మధ్య 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జూన్ 20 నుండి ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్‌లో జరగనున్న ఈ సిరీస్ కోసం టీం ఇండియా పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తోంది. ఇంతలో, ఇండియా-ఇంగ్లాండ్ సిరీస్‌ను కొత్త పేరుతో తెరపైకి తీసుకురావడానికి బీసీసీఐ, ఈసీబీ సన్నాహాలు చేస్తున్నాయి. దీనిలో భాగంగా, ఇండో-ఇంగ్లాండ్ సిరీస్‌కు 'టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీ' అని పేరు పెట్టాలని నిర్ణయించారు. గతంలో, ఇంగ్లాండ్‌లో జరగనున్న ఈ ఇండియా-ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌ను 'పటౌడీ ట్రోఫీ' అని పిలిచేవారు. పటౌడీ ట్రోఫీని మొదటిసారి 2007లో ఆడారు. భారత క్రికెట్ దిగ్గజాలు ఇఫ్తికార్ అలీ ఖాన్ పటౌడీ, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీల గౌరవార్థం ఇండో-ఇంగ్లాండ్ సిరీస్ కోసం ట్రోఫీకి పటౌడీ అని పేరు పెట్టారు. ఇండియా-ఇంగ్లాండ్ సిరీస్ కోసం పటౌడీ పేరును సచిన్ టెండూల్కర్, జేమ్స్ ఆండర్సన్ పేరును ఉంచాలని ఇంగ్లండ్ ×ఐసీసీ ఇప్పుడు నిర్ణయించింది. ఈ నిర్ణయం తర్వాత, సచిన్ టెండూల్కర్ దిగ్గజ క్రికెటర్ వారసత్వాన్ని కొనసాగించాలని ఐసీసీకి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, సచిన్ టెండూల్కర్ బీసీసీఐ, ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు అధికారులతో మాట్లాడి, ఇండియా-ఇంగ్లాండ్ సిరీస్‌కు తన పేరు పెట్టవద్దని అభ్యర్థించారు. అలాగే, మునుపటి పటౌడీ ట్రోఫీని ఇండో-ఇంగ్లాండ్ సిరీస్‌లో కొనసాగించాలని కూడా ఆయన అభ్యర్థించారు.

ఇదిలా ఉండగా, గతంలో బీసీసీఐ కార్యదర్శిగా, ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడిగా ఉన్న జై షాకు సచిన్ టెండూల్కర్ కూడా భారత్-ఇంగ్లాండ్ సిరీస్‌లో పటౌడీ వారసత్వాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జే షా ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుతో చర్చించారని, తదనుగుణంగా, ఇండో-ఇంగ్లాండ్ సిరీస్‌లో ఇచ్చే అవార్డుకు పటౌడీ పేరు పెట్టే అవకాశం ఉందని తెలిసింది. అంటే, ఇక్కడ టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీతో పాటు, ఒక అవార్డుకు పటౌడీ పేరు పెట్టనున్నారు. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే టెస్ట్ సిరీస్ కోసం కొత్త ట్రోఫీని జూన్ 14న ఆవిష్కరించాల్సి ఉంది. అయితే, అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం తర్వాత ఈ కార్యక్రమం వాయిదా పడింది. ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం జూన్ 20కి ముందే జరిగే అవకాశం ఉంది.

# పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం



**ఖమ్మం/నేలకొండపల్లి, జూన్ 16 (జనం సాక్షి):** రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచి, వారి కన్నీరు తుడిచేలా పాలన సాగిస్తుందని అన్నారు. సోమవారం మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి నేలకొండపల్లి మండలంలో పర్యటించి, పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

గువ్వలగూడెం గ్రామంలో ఎస్సీ ప్రాంతంలో 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి, రావెళ్ల భూలక్ష్మి -నరేష్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి, వారికి కొత్త బట్టలు అందజేశారు. ఇంటి ముందు అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్‌ను తరలించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం, కోరట్లగూడెం గ్రామంలో షుగర్ ఫ్యాక్టరీ రోడ్డు నుంచి పాత కోరట్లగూడెం వరకు 2.5 కోట్ల రూపాయలతో, మోటాపురం గ్రామంలో మోటాపురం నుంచి జీళ్లచెరువు ఆర్ అండ్ బి రోడ్డు వరకు 4.4 కోట్ల రూపాయలతో నిర్మించనున్న బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కోరట్లగూడెంలో జరిగిన కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, గువ్వలగూడెంలో అంతర్గత రోడ్లకు 75 లక్షలు, లింక్ రోడ్లకు 13.5 కోట్లు, మొత్తం 14.25 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం. గత ప్రభుత్వం 10 ఏండ్లలో 17 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, ఇందిరమ్మ ప్రభుత్వం 10 నెలల్లో 21 వేల కోట్ల రుణమాఫీ చేసింది. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్, ఉగాది నుంచి పేదలకు సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరు. తొలి విడతలో 4.5 లక్షల ఇళ్లకు 22,500 కోట్లతో నిర్మాణం, ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు. రాబోయే 3.5 ఏండ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఖమ్మం కలెక్టర్‌గా తొలి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా.. మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**హైదరాబాద్, జూన్ 16:** వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ సమీపంలో జరుగుతున్న మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జిహెచ్ఎంసీ లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలు, రాజకీయ నాయకులు జిహెచ్ఎంసి కి సహకరించి విజయవంతం చేయాలన్నారు. వార్డు లో పనిచేసే శానిటేషన్ కార్మికులు మొత్తం ఒకే చోట కాకుండా ఏ ప్రాంతం వారిని అక్కడే వినియోగించుకోవాలని అడిషనల్ కమీషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఏ.ఎం.హెచ్. హేమలత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 16 (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల యొక్క పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. అనంతరం ఇతర శాఖల యొక్క పనులపై ఆరా తీసి పూర్తి చేయాలని అన్నారు. భూ సమస్యలు రెండు పడకల గదుల ఇల్లు మంజూరు రైతు భరోసా పెన్షన్ల మంజూరు తదితర అంశాలపై అర్జీలు సోమవారం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో 135 అర్జీలు పలు శాఖలకు చెందిన దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ చందర్, కామారెడ్డి ఆర్‌డిఓ వీణ అలాగే జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 25న జరిగే బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈనెల 25న నిర్వహించనున్న బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నెట్ పరీక్ష నేపథ్యంలో ఆ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రొఫెసర్ శశికాంత్ చెప్పారు. ఈ పరీక్షను తిరిగి ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం, సమయాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతల వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
17 జూన్ 2025

# పబ్‌లపై ఎస్‌వోటీ పోలీసుల దాడులు

- ఇద్దరికి గంజాయి పాజిటివ్



హైదరాబాద్, జూన్16 (జనంసాక్షి) : తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు మెరుపుదాడులు చేస్తున్నారు. తాజాగా కోకాపేట్‌లోని పబ్‌లో అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు ఎస్వోటీ పోలీసులు. డ్రగ్స్, గంజాయి వాడుతున్నట్లు సమాచారంతో ఎస్ఓటీ, నార్సింగి పోలీసులు సంయుక్తంగా పబ్‌లలో దాడులు నిర్వహించారు. కోకాపేటలోని రాబిట్ హెూల్, మై క్యాప్స్, గండిపేటలోని టస్కా పబ్‌లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమానితులకు డ్రగ్స్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో నార్సింగ్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల గచ్చిబౌలిలోని పలు పబ్బులపై కూడా ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎస్ఎల్ఎన్ టెర్మినల్ మాల్‌లోని పబ్బుల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. క్లబ్ రోగ్, ఫ్రాట్ హౌస్ పబ్‌లో దాడులు జరిపిన ఎస్‌వోటీ పోలీసులు.. డ్రగ్స్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ క్రమంలో మొత్తం నలుగురికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. గంజాయి పాజిటివ్ వచ్చిన వారిలో ఫ్రాట్ హౌస్ పబ్ డీజే ప్లేయర్ శివ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మాదాపూర్, కొండాపూర్‌లో పలు పబ్‌లపై జరిపిన దాడుల్లోనూ డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా.. ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని తేలింది. మాదాపూర్ అఖాన్ పబ్‌లో ఒకరికి, కొండాపూర్ ఏ19 పబ్‌లో మరొకరికి గంజాయ్ పాజిటివ్ అని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక.. తెలంగాణను డ్రగ్స్ భూతం పట్టిపీడిస్తోంది. డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ యువత మాత్రం డ్రగ్స్ బారి నుంచి బయటకురాని పరిస్థితి. డ్రగ్స్ ఊబిలో చిక్కుకుని విలువైన జీవితాన్ని, భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తోంది యువత. మరోవైపు విద్యార్థులు, యువతే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా ఈ దందాను నిర్వహిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు కూడా డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడుతున్న సందర్భాలు ఎన్నో. సెలబ్రెటీలను కూడా వదలకుండా పోలీసులు పట్టుకుంటున్నారు. అంతేకాకుండా రెస్టారెంట్లు, పబ్‌లు, హెటల్స్‌లలో తరచూ దాడులు చేస్తూ డ్రగ్స్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట డ్రగ్స్, గంజాయి సరఫరా కొనసాగుతూనే ఉంది.

# కోర్టులో నలుగురు ఎమ్మెల్యేలు పిల్

- ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని వివరణ
- విచారణ వాయిదా వేసిన కోర్టు




హైదరాబాద్, జూన్16 (జనంసాక్షి) : తెలంగాణ హైకోర్టులో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి, మురళినాయక్‌లు పిల్ దాఖలు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటూ ఎమ్మెల్యేలు పిల్ వేశారు. ఈ పిటీషన్‌పై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఖాజాగూడలోని సర్వే నెం.119, 122లో ఉన్న 27.18 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని న్యాయవాది కోర్టుకు వివరించారు. సర్వే నెంబర్‌ని మార్చి పోరంబోకు భూమిని ఆక్రమించారని పిల్‌లో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. 2023లో రంగారెడ్డి కలెక్టర్ నిరభ్యంతర పత్రం జారీ చేయడంతో జీహెచ్ఎంసీ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని న్యాయవాది తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలంలో 8 టవర్లలో ఒక్కో దాంట్లో 47 అంతస్థులు నిర్మిస్తున్నారని న్యాయవాది చెప్పారు. ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయని చిక్కుడు ప్రభాకర్ న్యాయస్థానానికి వివరించారు. ఓ ప్రైవేట్ పాఠశాలకు 150మీటర్ల పరిధిలోనే రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేశారని న్యాయవాది తెలిపారు. దీనివల్ల పర్యావరణం కాలుష్యమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకునేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని ఎమ్మెల్యేలు కోరారు. ఈ భూమికి సంబంధించి సీఎస్, ప్రతివాదులకు మరోసారి వినతిపత్రం ఇవ్వాలని పిటీషనర్లను సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

# స్థానిక ఎన్నికలపై ముందే ఎలా చెబుతారు?

- మంత్రి పొంగులేటి వ్యాఖ్యలపై పిసిసి చీఫ్ అసహనం




హైదరాబాద్, జూన్16 (జనంసాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికలపై రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉన్న ఈ ఎన్నికల విషయంలో మంత్రి పొంగులేటి ప్రకటన చేయడాన్ని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తప్పుబట్టారు. ఈ తరహా అంశాలను కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, వాటిని ముందుగానే మీడియాకు వెల్లడి చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. ఒక మంత్రిత్వ శాఖ పరిధిలోని అంశంపై వేరొకరు మాట్లాడడం అనవసరమైన మాట్లాడ్డం ఏంటని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మండిపడ్డారు. అంతేకాదు, ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద అంశాలపై మాట్లాడేటప్పుడు మంత్రులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. అలాంటి సున్నితమైన విషయాలను మీడియా ముందుకు తీసుకురావడం పట్ల పార్టీ అధిష్ఠానం అసహనం వ్యక్తం చేసింది. ఈ తరహా ప్రకటనలు పార్టీని, ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టే అవకాశం ఉన్నందున పార్టీతో సంప్రదించకుండా ఏ విధమైన ప్రకటనలు చేయొద్దని టీపీసీసీ చీఫ్ మంత్రులకు సూచించారు. ప్రతి మంత్రి తమ శాఖ పరిధిలోని అంశాల పట్ల మాత్రమే స్పందించాలని, కోర్టు పరిధిలో ఉన్న విషయాలపై మాట్లాడేటప్పుడు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని టీపీసీసీ చీఫ్ ప్రభుత్వ మంత్రులను కోరారు.

# జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద హైటెన్షన్

- సమస్యలపై అధికారులను నిలదీసేందుకు వచ్చిన బీజేపీ నేతలు



హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి): నగరంలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బల్దియా కార్యాలయం ముందు బీజేపి ఆందోళనకు దిగింది. నగర సమస్యలపై అధికారులను నిలదీసేందుకు కమలం నేతలు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ ఆఫీస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. వీధిదీపాలు, రోడ్ల సమస్యతో పాటు డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ నిరసనకు దిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్పొరేటర్లు, బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం చెలరేగింది. రామ్ నగర్ కార్పోరేటర్లు గోడలు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు , బీజేపీ నేతలకు మధ్య తోపులాట జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన బీజేపీ కార్పొరేటర్లను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జీహెచ్ఎంసీ ఆఫీస్ గేట్ ముందు కూర్చుని బీజేపీ నేతలు ఆందోళన చేస్తున్నారు. హైదరాబాద్‌లో వీధి దీపాలు, రోడ్లు సరిగా లేకపోవడం, నాలాల పూడిక తీయకపోవడం వంటి అనేక సమస్యలు నగర వాసులను వెంటాడుతున్నాయని, తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున బీజేపీ నేతలు జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడు తూ.. ప్రజా సమస్యలను చెప్పేందుకు వస్తే గేట్లు మూసేసి రాకుండా ఎందుకు అడ్డుకుం టున్నారని ప్రశ్నిస్తున్నారు. విశ్వనగరంగా చెబుతున్న హైదరా బాద్ ఇప్పుడు వీధి దీపాలు లేక అంధకారంలో ఉందన్నారు. వీధిదీపాలు లేని కారణంగా గల్లీల్లో, కాలనీల్లో గంజాయికి అడ్డాలుగా మారాయని తెలిపారు. యువత పక్కదా రి పడుతోందని, మద్యం సేవించి మహిళలను ఇబ్బందిపెట్టే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లోనే ఇలా ఉంటే తెలంగాణ వ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉందో అంటూ ఆ పార్టీ నేతలు నిలదీశారు. తప్పకుండా బల్దియా కమిషనర్‌ను కలుస్తామని.. తమను లోపలికి పంపించకపోతే కమిషనర్ బయటకు వచ్చే వరకు ఇక్కడే ఉండి ఆందోళన చేస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

# స్థానిక ఎన్నికలపై త్వరలోనే స్పష్టత

- జైలుకు పోవాలన్న తొందరలో కెటిఆర్
- మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు



ములుగు, జూన్16 (జనంసాక్షి) : స్థానిక ఎన్నికల నిర్వహణపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సోమవారం నిర్వహించిన కార్యకర్తల మిటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల విషయంలో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నాలుగు నుంచి ఐదు రోజుల్లో పూర్తి వివరాలు బయటకు వస్తాయి. నోటిఫికేషన్ గురించి ఇప్పటివరకు ఎవరూ అధికారికంగా ప్రకటన చేయలేదు. అలాగే తాను కూడా ఎటువంటి తప్పుడు ప్రకటన ఇవ్వలేదు.. నా మాటల్లో మార్పు లేదని స్పష్టతనిచ్చారు. ఈ అంశంపై పూర్తి అవగాహన వచ్చే అవకాశముందని మంత్రి తెలిపారు. ఎన్నికలపై పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగుతామని, అన్ని వర్గాలను ప్రతినిధ్యం కలిగించేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఇది ఇలా ఉండగా.. మంత్రి సీతక్క మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. కేటీఆర్ జైలుకు పోవాలని కుతూహలంగా ఉన్నారు.. వీలైనంత త్వరగా జైలుకు పంపించాలని మా సీఎంను రెచ్చగొడుతున్నారు. కేటీఆర్, కవిత మధ్య పోటీ ఉంది.. కవిత జైలుకు పోయివచ్చి బీసీ ఎజెండా ఎత్తుకుంది.. నేను వెనకబడ్డా అని కేటీఆర్ కూడా జైలుకు వెళ్లే పథకం రచించాలని అనుకుంటున్నాడు. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నాడు. ఏదో ఆశించి కేటీఆర్ జైలుకు పోవాలను కుంటున్నాడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. కేటీఆర్‌కు జైలుకు పోవాలని కుతూహలంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. వీలైనంత త్వరగా జైలుకు పంపించాలని సీఎం రేవంత్ రెడ్డిని రెచ్చగొడుతున్నారని అన్నారు. కేటీఆర్, కవిత మధ్య పోటీ ఉందని తెలిపారు. కవిత జైలుకు పోయివచ్చి బీసీ ఎజెండా ఎత్తుకున్నారని.. తాను వెనకబడ్డానని భావించి కేటీఆర్ కూడా జైలుకు పోయి పథకం రచించాలని అనుకుంటున్నారని సెటైర్ విసిరారు. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏదో ఆశించి కేటీఆర్ జైలుకు పోవాలని అనుకుంటున్నారన్నారు. తోడేళ్ళలా దోచుకుని... ఇప్పుడు వినయం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. 'కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నారు .. మా సీఎం పౌరుషంతో మాట్లాడుతున్నారు' అని అన్నారు. కేటీఆర్ వ్యవహారాన్ని దర్యాప్తు సంస్థలే చూసుకుంటాయని తెలిపారు. ఈరోజు ముఖ్యమంత్రి అధ్యక్షతన ఐసీసీసీలో జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో పంచాయతీ ఎన్నికలపై స్పష్టత వస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.కాగా.. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు మాజీ మంత్రి కేటీఆర్. విచారణకు ముందు కేటీఆర్ ఆసక్తికర ట్వీట్ చేశారు. ఇప్పటికి మూడు సార్లు విచారణకు పిలిచారని, ముప్పైసార్లు విచారణకు పిలిచినా హాజరవుతానన్నారు. తనను ఏసీబీ విచారణకు పిలిచి రాక్షసానందం పొందుతున్నారని, అవసరమైతే తనను అరెస్ట్ కూడా చేయొచ్చంటూ వ్యాఖ్యలు చేశారు. అయినప్పటికీ తనకు జైలు, కేసులు కొత్తేమీ కాదని తెలంగాణ ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లి వచ్చానంటూ మాజీ మంత్రి ట్వీట్ చేశారు. జైలు గురించి కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపైనే మంత్రి సీతక్క సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# గ్యాస్ స్టేషన్ సిబ్బందిపై గన్‌తో గురిపెట్టిన మహిళ



లక్నో, జూన్16 (జనంసాక్షి) : గ్యాస్ స్టేషన్ సిబ్బందితో ఒక కుటుంబం వాగ్వాదానికి దిగింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి చెందిన మహిళ గ్యాస్ స్టేషన్ వ్యక్తి ఛాతిపై గన్ గురిపెట్టింది. నీ కుటుంబం గుర్తుపట్టలేనంతగా బుల్లెట్లతో కాల్చేస్తానని బెదిరించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని హర్డోయ్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం ఒక కుటుంబం కారులో సీఎన్‌జీ రీఫిల్ కోసం గ్యాస్ స్టేషన్‌కు చేరుకున్నది. కాగా, సీఎన్‌జీ ఫిల్ చేస్తున్న సిబ్బంది భద్రత దృష్ట్యా కారులో ఉన్న వారిని బయటకు రావాలని సూచించాడు. అయితే కారు దిగిన ఎహ్‌సాన్ ఖాన్, గ్యాస్ స్టేషన్ సిబ్బంది రజనీష్ కుమార్‌తో వాగ్వాదానికి దిగాడు. మీదకు వెళ్లడంతో ఆ వ్యక్తి చేతితో తోశాడు. ఇది చూసి ఖాన్ కుమార్తె అరిబా ఆగ్రహించింది. వెంటనే కారు వద్దకు వెళ్లి రివాల్వర్ తెచ్చింది. గ్యాస్ స్టేషన్ సిబ్బంది రజనీష్ కుమార్ ఛాతికి గురిపెట్టింది. నీ కుటుంబం నిన్ను గుర్తుపట్టలేనంతగా చాలా బుల్లెట్లతో కాల్చేస్తానని బెదిరించింది. అక్కడున్న వారు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. దీంతో ఆ కుటుంబం కారులో అక్కడి నుంచి వెళ్లిపోయింది. మరోవైపు గ్యాస్ స్టేషన్ సిబ్బంది రజనీష్ కుమార్ ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ఖాన్ కుటుంబాన్ని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అతడి పేరుతో రిజిస్టర్ అయిన లైసెన్స్ ఉన్న ఆ రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి నమోదు చేస్తున్నారు. కాగా, గ్యాస్ స్టేషన్‌లోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# మేం పిలిస్తే తప్ప రావొద్దని హెచ్చరిక



మహబూబాబాద్ జూన్ 16 (జనంసాక్షి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయంకపోవడంతో ప్రజలు అధికార పార్టీ నేతలను ఎక్కడికక్కడ నిలదీ స్తున్నారు. అయితే దీనిపై కవర్ చేసేందుకు వెళ్లిన రిపోర్టులు కవర్ చేస్తుండగా, సదరు నాయకులు మాత్రం ఇదంతా ఎందుకు కవర్ చేస్తున్నారనంటూ ఫైర్ అవుతున్నారు. ఈక్రమంలోనే మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్తగారు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి రెచ్చిపోయారు. రిపోర్టర్లకు ఆమె స్వయంగా కాల్స్ చేసి.. " మా పార్టీ మీటింగ్‌లకు మీరు రావద్దు.. మా పార్టీ కార్యక్రమాలకు మేం పిలిచినప్పుడు మాత్రమే రావాలి. లేకపోతే మా కార్యకర్తలతో కొట్టిస్తాం. పోలీసులతో అరెస్టు చేయిస్తాం" అంటూ హెచ్చరించారు. ఇటీవల పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. వారిని మోహం పట్టుకుని హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు తిరగబడుతున్న దృశ్యాన్ని కవర్ చేస్తున్న నేపథ్యంలో రిపోర్టలకు కాల్స్ చేసి బెదిరింపులకు దిగారు. దీనిపై మీడియా వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల అధికారిక కార్యక్రమాలను కవర్ చేసేందుకు రిపోర్టర్లకు పూర్తి హక్కు ఉంటుందని.. అలాంటి సమయంలో ప్రెస్ ప్రతినిధులను బెదిరించడమేంటని ప్రశ్నిస్తున్నాయి.

# ఎన్సీఆర్ కెనాల్‌లో దొరికిన మోడల్ శీతల్ మృతదేహం

న్యూఢిల్లీ, జూన్16 (జనంసాక్షి) : ఎన్సీఆర్‌లోని ఖాండ నుంచి జారోతి గ్రామాల మధ్య ఉన్న కెనాల్‌లో ఉన్న ఓ మహిళ మృతదేహాన్ని శీతల్‌గా గుర్తించారు. ఆమె హర్యానాకు చెందిన మోడల్. మ్యూజిక్ ఇండస్ట్రీలో ఆమెకు పేరున్నది. పానిపట్ సమీపంలోని ఖలీలా మజ్రా ఆమె స్వగ్రామం. ఇటీవల పానిపట్‌లోని సత్ కర్తార్ కాలేనీకి తన సోదరి నేహతో కలిసి ఇళ్లు మారింది. శీతల్ ఫోన్‌తో కాంటాక్ట్ తెగిపోవడంతో పానిపట్‌లోని ఓల్డ్ ఇండస్ట్రియల్ ఏరియా పోలీసు స్టేషన్‌లో ఆదివారం నేహా ఫిర్యాదు చేసింది. శీతల్ చివరిసారి తన బాయ్‌ఫ్రెండ్‌తో కనిపించినట్లు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. అతని కారును కూడా శీతల్ మృతదేహం లభించిన కెనాల్ వద్ద గుర్తించారు. శీతల్‌ను ఆమె బాయ్‌ఫ్రెండ్ అటాక్ చేసినట్లు సోదరి నేహా తెలిపింది. దాడి గురించి శీతల్ వీడియో కాల్ చేసినట్లు నేహా చెప్పింది. ఆ వీడియో కాల్ తర్వాత ఆమె కాంటాక్ట్ తెలియకుండా పోయిందని నేహ తెలిపింది. ఆదివారం రాత్రి కెనాల్‌లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. పానిపట్ నుంచి ఓ అమ్మాయి మిస్సైనట్లు ఆదివారం తమకు సమాచారం వెల్లడైందని ఖర్కోడా పోలీసు స్టేషన్ ఇంచార్జ్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రాథమిక విచారణ ఆధారంగా శీతల్ మృతదేహాన్ని గుర్తించారు. ఫ్యామిలీ సభ్యులతో పోలీసులు సంప్రదించారు. శీతల్ బాయ్‌ఫ్రెండ్‌తో పాటు ఇతర కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# యువతిపై చేయి చేసుకున్న ర్యాపిడో రైడర్

బెంగళూరు, జూన్16 (జనంసాక్షి) : ర్యాపిడో బైక్ డ్రైవర్ ఓ యువతిపై చేయి చేసుకున్న సంఘటన సోమవారం కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో చోటుచేసుకుంది. ర్యాపిడో బైక్ రైడర్ ఓ అమ్మాయిపై చేయి చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ర్యాపిడో, ఊబర్, ఓలా వంటి సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో రైడ్ బుక్ చేసుకుని ఈజీగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా వీటిపైనే ఆధారపడి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో బెంగళూరులో ఓ యువతి ర్యాపిడో బైక్ రైడ్ బుక్ చేసుకుంది. ఈ క్రమంలో ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. ర్యాపిడో బైక్ డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేశాడు. దీంతో ఆమె రైడ్‌ను మధ్యలోనే ఆపి కిందకు దిగింది. ర్యాష్ డ్రైవింగ్‌పై అతడిని ప్రశ్నించింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన బైక్ డ్రైవర్.. ఆ యువతిపై చేయి చేసుకున్నాడు. రోడ్డుపైనే యువతి చెంప ఛెళ్లుమనిపించాడు. దీంతో ఆమె ఒక్కసారిగా కింద పడిపోయింది. అక్కడున్న స్థానికులు ఈ తతంగాన్నంతా చూస్తున్నారు తప్పితే ఆపే ప్రయత్నం చేయలేదు. ఈ నెల జూన్ 14న జయనగర్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటన తాజాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సంఘటన పై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన సీ.హెచ్. ప్రియాంక

- హైదరాబాద్ (జనంసాక్షి) :

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370